

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 37

శనివారం 29-4-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

జీవితానికి పరీక్షలు అందరికీ ఉంటాయి.
బతుకు పరీక్షాపత్రం అందరికీ ఒకలా ఉండదు.
ప్రతి ఒక్కరికీ ఒక్కో పత్రాన్ని నిర్దేశిస్తుంది
ఎవరి పరీక్ష వారిదే...
ఎవరి ఉత్తీర్ణత వారిదే.
ఆ పరీక్షలో పోశవ్వకి
నూటికి నూరు మార్కులు.
తన ఉత్తీర్ణతే కాదు...
తనలాంటి వారి ఉత్తీర్ణత కోసం...
ఆమె నిర్విరామంగా సాగిస్తున్న
దివ్యమైన సేవ ఇది.


పోశవ్వ

# దివ్య సంకల్పం

'ఒకటే జననం... ఒకటే మరణం. ఒకటే గమనం... ఒకటే గమ్యం' చింతల పోశవ్వ కోసం ఫోన్ చేస్తే ఆమె రింగ్‌టోన్ ఆమె జీవితలక్ష్యం ఎంత ఉన్నతంగా ఉందో చెబుతుంది. తెలంగాణ, కామారెడ్డి జిల్లా కేంద్రంలో నివసించే పోశవ్వ ఓ ధీర. జీవితం విసిరిన చాలెంజ్‌ని స్వీకరించింది. 'అష్టావక్రుడు ఎనిమిది అవకరాలతో ఉండి కూడా ఏ మాత్రం ఆత్మస్థయిర్యం కోల్పోలేదు. పైగా రాజ్యాన్ని ఏలే చక్రవర్తికి గురువయ్యాడు. నాకున్నది ఒక్క వైకల్యమే. నేనెందుకు అనుకున్నది సాధించలేను' అనుకుంది. ఇప్పుడామె తన కాళ్ల మీద తాను నిలబడడమే కాక, తనలాంటి వాళ్లకు ఉపాధికల్పిస్తోంది. పోరాటం చేస్తున్న వాళ్లకు ఆసరా అవుతోంది. తన జీవితాన్ని సమాజహితానికి అంకితం చేయాలనే సంకల్పంతో పని చేస్తున్న పోశవ్వ సాక్షితో తన జీవనగమనాన్ని పంచుకున్నది.

**నాన్న వైద్యం... నానమ్మ మొక్కు!**

"విధి నిర్ణయాన్ని మార్చలేమనుకుంటాను. ఎందుకంటే మా నాన్న ఆర్‌ఎంపీ డాక్టర్ అయి ఉండీ నేను పోలియో బారిన పడ్డాను. ఆ తర్వాత నాన్న ఆయుర్వేద వైద్యం నేర్చుకుని నాకు వైద్యం చేశారు. నానమ్మ నన్ను గ్రామ దేవత పోచమ్మ ఒడిలో పెట్టి 'నీ పేరే పెట్టుకుంటా, బిడ్డను బాగు చేయ'మని మొక్కింది. మెడ కింద అచేతనంగా ఉండిపోయిన నాకు ఒక కాలు మినహా మిగిలిన దేహమంతా బాగయిపోయింది. కష్టంగానైనా నాకు నేనుగా నడవగలుగుతున్నాను. నాకు జీవితంలో ఒకరి మీద ఆధారపడే పరిస్థితి రాకూడదని ఎం.ఏ., బీఈడీ చదివించారు. చదువు పూర్తయిన తర్వాత మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ స్కీమ్‌లో అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం ఎక్కువ కాలం చేయలేదు. ఫీల్డు మీదకు వెళ్లాల్సిన ఉద్యోగం అది. నేను పనిని పరిశీలించడానికి పని జరిగే ప్రదేశానికి వెళ్లి తీరాలి. నేను వెళ్లడానికి సిద్ధమైనప్పటికీ కొన్ని చోట్లకు మామూలు మనుషులు వెళ్లడం కూడా కష్టమే. ఇతర అధికారులు, ఉద్యోగులు 'మీరు రాకపోయినా ఫర్వాలేదు' అంటారు. అయినా ఏదో అసంతృప్తి. ఉద్యోగాన్ని అలా చేయడం నాకు నచ్చలేదు. నెలకు ముప్పై వేల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేశాను. హైదరాబాద్‌లోని ఎన్‌ఐఆర్‌డీలో సర్ఫ్, ఫినాయిల్, ఫ్లోర్ క్లీనర్, సబీనా తయారీలో శిక్షణ, చిన్న ఇండస్ట్రీతో బతుకు పుస్తకంలో కొత్త పాఠం మొదలైంది.

**కోవిడ్‌తో కొత్త మలుపు**

నేను మార్కెట్‌లో నిలదొక్కుకునే లోపే కోవిడ్ వచ్చింది. మా ఉత్పత్తులు అలాగే ఉండిపోయాయి. దాంతోపాటు వాటి ఉత్పత్తి సమయంలో ఎదురైన సమస్యలు కూడా నన్ను పునరాలోచనలో పడేశాయి. క్లీనింగ్ మెటీరియల్ తయారీలో నీటి వృథా ఎక్కువ, అలాగే అవి జారుడు గుణం కలిగి ఉంటాయి కాబట్టి పని చేసేటప్పుడు దివ్యాంగులకు ప్రమాదాలు పొంచి ఉన్నట్లే. అందుకే నీటితో పని లేకుండా తయారు చేసే ఉత్పత్తుల వైపు కొత్త మలుపు తీసుకున్నాను. అవే ఎకో ఫ్రెండ్లీ రాఖీలు. ఆ ప్రయత్నం నేను ఊహించనంతగా విజయవంతం అయింది. ఆ తర్వాత గోమయ గణపతి నుంచి ఇప్పుడు పదకొండు రకాల ఉత్పత్తులను చేస్తున్నాం. అందరూ దివ్యాంగులే. ఇక మీదట ఒంటరి మహిళలకు కూడా అవకాశం కల్పించాలనుకుంటున్నాను.

ఆదాయం కోసం పర్యావరణానికి హాని కలిగించడానికి వెనుకాడని ఈ రోజుల్లో, పర్యావరణ హితమైన మార్గంలో ఉపాధిని వెతుక్కుంటున్న మా ప్రయత్నాన్ని ఎన్నో సంస్థలతోపాటు ప్రభుత్వం కూడా గుర్తించింది.



**కన్యాదాతనయ్యాను!**

మా జిల్లాలో ఎవరికి వీల్ చైర్ కావాలన్నా, ట్రై సైకిల్, వినికిడి సాధనాలు, పెన్షన్ అందకపోవడం వంటి సమస్యల గురించి నాకే ఫోన్ చేస్తారు. ఎన్‌జీవోలు, డీఆర్‌డీఏ అధికారులను సంప్రదించి ఆ పనులు జరిగేటట్లు చూస్తున్నాను. దివ్యాంగులకు, మామూలు వాళ్లకు కలిపి మొత్తం పన్నెండు జంటలకు పెళ్లిళ్లు చేశాను. వాళ్లలో ఇద్దరికి మాత్రం అమ్మాయి తరఫున పెళ్లి పెద్ద బాధ్యత వహించాల్సి వచ్చింది. నాకు అమ్మాయిల్లేరు, ముగ్గరబ్బాయిలు. ఈ రకంగా అవకాశం వచ్చిందని సంతోషించాను.

**సంకల్పం గొప్పది!**

నేను నా ట్రస్ట్ ద్వారా సమాజానికి అందించిన సహాయం ఎంతో గొప్ప అని చెప్పను. ఎంతో మంది ఇంకా విస్తృతంగా చేస్తున్నారు. కానీ నాకు ఉన్నంతలో నేను చేయగలుగుతున్నాను. నా లక్ష్యం గొప్పదని మాత్రం ధీమాగా చెప్పగలను. ఆదాయం కోసం పర్యావరణానికి హాని కలిగించడానికి వెనుకాడని ఈ రోజుల్లో, పర్యావరణ హితమైన మార్గంలో ఉపాధిని వెతుక్కుంటున్న మా ప్రయత్నాన్ని ఎన్నో సంస్థలతోపాటు ప్రభుత్వం కూడా గుర్తించింది. నాకు గత ఏడాది మహిళాదినోత్సవం సందర్భంగా సత్కరించింది. నా కుటుంబ పోషణకు నా భర్త ఉద్యోగం ఉంది. నా దివ్యహస్తం ట్రస్ట్ ద్వారా చేస్తున్న సర్వీస్ అంతా పర్యావరణ పరిరక్షణ, సమాజహితం, దివ్యాంగుల ప్రయోజనం కోసమే'' అన్నారు. 'ఉన్నది ఒకటే జననం... అంటూ... గెలుపు పొందే వరకు... అలుపు లేదు మనకు. బ్రతుకు అంటే గెలుపు... గెలుపు కొరకే బతుకు' అనేదే ఆమె తొలిమాట... మలిమాట కూడా.

– వాకా మంజులారెడ్డి

---

ముహూర్తాలు చూసి సిజేరియన్లు చేయించుకుంటున్న ఈ రోజుల్లో డ్యాన్సింగ్ థెరపీ ద్వారా నార్మల్ డెలివరీలను ప్రోత్సహిస్తున్నారు హైదరాబాద్‌లో ఉంటున్న గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్పిరెడ్డి. మారిన జీవనశైలి కారణంగా పెరుగుతున్న సిజేరియన్ రేషియో తగ్గించడానికి ఏడేళ్లుగా ఈ డాక్టర్ చేస్తున్న కృషి ఎంతో మంది కాబోయే తల్లులకు వరదాయినిగా మారింది. ఈ విషయాల గురించి డాక్టర్ మరింతగా ఇలా వివరించారు.


డాక్టర్ శిల్పిరెడ్డి

# డ్యాన్సింగ్ మామ్స్

'ఈ మధ్య కాలంలో గర్భిణులు చేసే పనుల్లో ఫోర్స్ స్ట్రెంతెనింగ్, పెల్విక్ ఫ్లోర్ ఎక్సర్‌సైజులు బాగా తగ్గిపోయాయి. గతంలో నీళ్ల చేదడం, ముగ్గులు పెట్టడం, ఇండియన్ టాయిలెట్లు వాడటం, కూర్చొని బట్టలు ఉతకడం, దంచడం, రుబ్బడం, వంటలు చేయడం.. ఇలాంటి పనులన్నీ డెలివరీ అయ్యే దారిని అనువుగా మార్చేవి. ఇప్పుడు ఈ పనులన్నీ తగ్గిపోయాయి. ఫలితంగా డెలివరీ అయ్యే దారి ఇరుకుగా మారి ప్రసవం కష్టమైపోయింది. గర్భవతి అని తెలిసిన రోజు నుంచి ఆహారం బాగా తీసుకోవాలనే విధానం పెరిగింది. కూర్చొని వర్క్ చేసుకునే గ్యాడ్జెట్స్ పెరిగిపోయాయి. శారీరక శ్రమ తగ్గి, క్యాలరీలు పెరగడంతో లోపల బేబీ కూడా పెరుగుతుంది. ఇక ప్రసవ సమయానికి నొప్పి లేకుండా డెలివరీ అవ్వాలనుకుంటారు. ఎందుకంటే, ప్రసవం నొప్పి అనేసరికి ఒక విధమైన స్ట్రెస్ ఉంటుంది. దీని నుంచి బయటకు రాలేక 'ఎందుకు రిస్క్...' సిజేరియన్ అయితేనే బెటర్ అనుకుంటారు. సాధారణంగా వ్యాయామాలు, ఆహార నియమాలు గురించి చెబుతాం కానీ, ప్రసవం సమయానికి నొప్పి భయంతో కూడిన స్ట్రెస్ ఎక్కువ పెట్టేసుకుంటారు. ఈ వలయం నుంచి బయటకు తీసుకురావాలంటే ముందు నుంచీ భయం పోగొడుతూ వారి మనసును ఆహ్లాదంగా ఉంచాలి. అందుకే మంచి పాటలతో చిన్న చిన్న డ్యాన్సింగ్ మూమెంట్స్ చేయిస్తుంటాం. గర్భవతిగా ఉన్నన్ని రోజులూ దీనికి సంబంధించిన ప్రత్యేకమైన వ్యాయామాలు, జుంబా క్లాసులు కూడా ఉంటాయి. సహజ ప్రసవానికి అనుకూలంగా మార్చే ప్రక్రియ ఇది.


గర్భవతితో డ్యాన్స్ చేయిస్తూ..

సిజేరియన్ల రేషియో పెరగడంతో నార్మల్ డెలివరీల వైపు ప్రభుత్వాలు కూడా మొగ్గు చూపుతున్నాయి. అందరిలోనూ సహజ ప్రసవాల విషయంలో ఆలోచనలు పెరిగాయి. దీంతో దీని వెనక ఉన్న కారణాలనూ కూడా అవగాహనలోకి తీసుకొని చేసిన ప్రోగ్రామ్ ఇది. ఈ ప్లానింగ్ అమల్లోకి రావాలంటే మంచి టీమ్, నిపుణులు అందుబాటులో ఉండాలి. ఎవరికి వారు సొంతంగా చేయలేరు. అలా చేస్తే, ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. నాలో పుట్టిన ప్లానింగ్ కాబట్టి ఎక్కడైనా సమస్య వస్తే దానిని ఎలా పరిష్కరించాలో కూడా నాకు తెలుసు. ఇక్కడ మా కడల్ హాస్పిటల్‌లో పెద్ద యోగా హాల్, ఫిజియోథెరపిస్టులు, ఎమర్జెన్సీ టీమ్, గైనకాలజిస్టులు .. ఈ సెటప్‌ను మాకు అనుగుణంగా మార్చుకున్నాం. దీనిని కాపీ చేయడం కూడా సులువు కాదు. నాలాగా చేయాలంటే సేమ్ సెటప్‌ను ఫాలో అవ్వాలి. ఈ ప్లానింగ్‌గా అమలు చేస్తే నాలుగైదేళ్లకు సక్సెస్ రావచ్చు. కోవిడ్ తర్వాత జనాల్లో చాలా మార్పు వచ్చింది. ముందు నుంచీ ప్లానింగ్ విషయంలో శ్రద్ధ పెరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి, గ్రామీణ స్థాయి నుంచి కూడా మా సేవలు పొందడానికి వస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా కావల్సిన సేవలు అందిస్తున్నాం' అని వివరించారు ఈ డాక్టర్.

**రోజువారీ పనులు**

అధిక ఆహారం తీసుకోకుండా, ఆర్గానిక్ ఫుడ్, మిల్లెట్ ఫుడ్ ఏ విధంగా తీసుకోవాలి, బామ్మల కాలం నాటి బలవర్ధకమైన ఆహారం తయారీ, చేయాల్సిన రోజువారీ పనులు.. ఇలాంటివన్నీ కలిపి ఒక ప్రోగ్రామ్ చేశాం. ఈ ప్లాన్‌ను పూర్తిగా ఫాలో అయితే ప్రసవానికి వచ్చినప్పుడు భయమనేది లేకుండా గర్భిణిలో ఒక నిశ్చింత కలుగుతుంది.

**ఏడేళ్లుగా చేస్తున్న కృషి**

క్రమం తప్పకుండా ఏడేళ్లుగా చేయడంతో మంచి స్పందన వస్తోంది. గతంలో నోటి మాట ద్వారా వచ్చిన వారే ఎక్కువ. సోషల్‌మీడియా ద్వారా రెండేళ్లుగా చాలా మందిలోకి వెళ్లింది. మనకు వచ్చిన ఆలోచనను సరిగ్గా అమల్లో పెట్టినప్పుడు 'ఎవరో నవ్వుతారు. ఏదో అంటారు' అని దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదు. అప్పుడే సరైన ఫలితాలు పొందుతాం. ఈ ప్లానింగ్ విషయంలో జరిగినది అదే. గర్భవతి అని తెలిసినప్పుడు ఆమె ఎప్పుడు డెలివరీకి వస్తుందో తెలిసిపోతుంది. అయితే, కొంతమంది మాత్రం మంచి ముహూర్తం అని చెప్పిన టైమ్‌కి సిజేరియన్ చేయమని అడుగుతుంటారు. ఇది సరైనది కాదని, నార్మల్ డెలివరీయే మేలైనదని చెబుతాం. సమాజంలో ఒక చిన్నమార్పు రావడానికి చేస్తున్న కృషి ఇది.

– నిర్మలారెడ్డి

---

**బ్యూటిప్స్**

# పెసర ప్యాక్‌లు



- పొడి చర్మంతో బాధపడుతుంటే... రెండు టీ స్పూన్‌ల పెసర పప్పును రాత్రి నానబెట్టి ఉదయం గ్రైండ్ చేసి ముఖానికి, మెడకు పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వేసవిలో వారానికి మూడుసార్లు ఈ ప్యాక్ వేస్తుంటే చర్మం తేమగా నిగారించడంతోపాటు ఎండ వేడి నుంచి రక్షణ కలుగుతుంది.
- టేబుల్ స్పూన్ పొట్టుతో కూడిన పెసలను రాత్రంతా నానబెట్టి ఉదయం గ్రైండ్ చేసి అందులో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ బాదం నూనె కలిపి ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు పట్టించాలి. బాగా ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఈ ప్యాక్‌ను రోజు మార్చి రోజు వేస్తుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. క్రమంగా తెల్లదనం సంతరించుకుంటుంది.
- ఎండలో ఎక్కువ సమయం గడిపినప్పుడు చర్మం నల్లగా పోతుంది. ఆ ట్యాన్ వదలాలంటే... పావు కప్పు పెసలు లేదా పెసర పప్పును రాత్రంతా నానబెట్టి ఉదయం గ్రైండ్ చేయాలి. అందులో రెండు టేబుల్ స్పూన్‌ల పెరుగు కలిపి ముఖం, మెడ, చేతులతోపాటు ఎండకు కమిలిన చోట్ల రాయాలి. ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇలా రోజూ చేస్తుంటే కమిలిన చర్మం తిరిగి సొంత రంగును సంతరించుకుంటుంది.



---

**● రూట్స్**

# సేవే శక్తి!



ఉత్సాహం నుంచి శక్తి జనిస్తుంది.
మరి ఆ ఉత్సాహం ఎలా వస్తుంది?
ఎవరి మాట ఎలా ఉన్నా...
విట, జలజ్ దాని దంపతులకు మాత్రం ఆ ఉత్సాహం స్వచ్ఛంద సేవాకార్యక్రమాల ద్వారా వస్తుంది.
పారిశ్రామికవేత్తల కుటుంబానికి చెందిన ఈ దంపతులు తన ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
'ఒక మంచి పని చేసి చూడండి. అందులో నుంచి వచ్చే శక్తి ఏమిటో మీకే తెలుస్తుంది' అంటున్నారు...

ముందుకు వెళ్లడం మంచిదేగానీ వెనక్కి తిరిగి చూసుకోవడం కూడా మంచిదే. విటల్, జలజ్ దాని దంపతులు అదే చేశారు. వారి తాత స్వస్థలం గుజరాత్‌లోని చారిత్రక పట్టణం కపడ్ వంజ్. ఆయన రకరకాల సేవాకార్యక్రమాల్లో పాల్గొనేవాడు.

ఒకసారి ఆయన సేవాకార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ఆ స్ఫూర్తితో ఎనభై సంవత్సరాల నుంచి కొనసాగుతున్న 'కపడ్‌వంజ్ కెలవాణి మండల్' (కెకెఎం) అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేయడం మొదలుపెట్టారు. ఈ సంస్థ పరిధిలో పదమూడు విద్యాసంస్థలు ఉన్నాయి.

'కెకెఎం'తో కలిసి పనిచేయడం విట, జలజ్ దంపతులలో కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది.

కొన్ని సంవత్సరాల తరువాత...


తమ సేవాకార్యక్రమాలను విస్తృతం చేయడం కోసం 'దాని ఫౌండేషన్' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ 'కెకెఎం'తో పాటు అన్నమిత్ర ట్రస్ట్, ఈఎల్ఎంఎస్ స్పోర్ట్స్ ఫౌండేషన్... మొదలైన సంస్థలతో కలిసి పనిచేస్తుంది.

'అన్నమిత్ర'తో కలిసి దేశంలోని 6,500 పాఠశాలలో పిల్లల కోసం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు.

'బాలకార్మిక వ్యవస్థ పోవాలంటే ముందు పిల్లలకు కడుపు నిండా తిండి దొరకాలి. ఆ భోజనమే వారిని విద్యకు దగ్గర చేస్తుంది. అభివృద్ధిపథంలోకి నడిపిస్తుంది' అంటుంది విట.

'ప్రథమ్' అనే స్వచ్ఛందసంస్థతో కలిసి అట్టడుగు వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే కార్యక్రమాలలో పాలుపంచుకుంటుంది దాని ఫౌండేషన్.

సేవా కార్యక్రమాలే కాకుండా తమ కుమారుడు, ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ ముదిత్ కోరిక మేరకు ఆటలపై కూడా దృష్టి సారించారు. ఈఎల్ఎంఎస్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌తో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి క్రీడా నైపుణ్యాలు మెరుగుపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ఆటలకు ప్రాచుర్యాన్ని తీసుకువస్తున్నారు. పాఠశాలలో క్రీడాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.



'ఆటలో ఉత్సాహం ఉంటుంది. వినోదం ఉంటుంది. గెలుపు కోసం చేసే పథక రచన ఉంటుంది. లైఫ్ స్కిల్స్‌ను పిల్లలు ఆటల్లో నుంచే నేర్చుకోవడం మొదలు పెడతారు.
– విట,
దాని ఫౌండేషన్

ప్రొఫెషనల్ లెవెల్లో పిల్లలను క్రీడల్లో తీర్చిదిద్దడానికి హై-పెర్‌ఫార్మెన్స్ ప్లాన్స్, హై-పెర్‌ఫార్మెన్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్స్‌కు రూపకల్పన చేశారు.

గతంతో పోల్చితే విద్యార్థులు ఆటలపై ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఇదొక శుభపరిణామంగా చెప్పుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇలా అంటుంది విట...

'ఆటలో ఉత్సాహం ఉంటుంది. వినోదం ఉంటుంది. గెలుపు కోసం చేసే పథక రచన ఉంటుంది. లైఫ్ స్కిల్స్‌ను పిల్లలు ఆటల్లో నుంచే నేర్చుకోవడం మొదలు పెడతారు. మన దేశంలో కోట్ల జనాభా ఉంది. ఇలాంటి దేశంలో మనం ఛాంపియన్‌లను తయారు చేయలేమా!'

'క్రీడలపై వారి అనురక్తి, అంకితభావాన్ని దగ్గరి నుంచే చూసే అవకాశం వచ్చింది. క్రీడారంగంపై వారు చేపడుతున్న కార్యక్రమాల ప్రభావం తప్పకుండా ఉంటుంది' అంటున్నాడు ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత అభినవ్ బింద్రా.

గతకాలం మాట ఎలా ఉన్నా విట ప్రస్తుతం తమ ఫౌండేషన్‌కు సంబంధించిన కార్యక్రమాల్లో ఎక్కువ సమయం గడుపుతుంది.

'ఆడ్‌వర్బ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్' చైర్మన్ జలజ్ కంపెనీ పనుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తమ ఫౌండేషన్‌కు సంబంధించిన కార్యక్రమాలకు తగిన సమయం కేటాయిస్తుంటాడు.

విట దృష్టిలో స్వచ్ఛంద సేవ అంటే చెక్ మీద సంతకం చేయడం కాదు.

యాంత్రికంగా చేసే పని కాదు. మనసుతో చేసే మంచిపని. ప్రజలతో కలిసి పోయి చేసే ఉత్తేజకరమైన పని.

---

**ఇంటర్నేషనల్ జాజ్ డే: ఏప్రిల్ 30**

**జాజ్ జాజిమల్లికి కొత్త అందాన్ని తీసుకువస్తోంది ముంబైకి చెందిన ఆల్–ఉమెన్ జాజ్ టీమ్.**
**పాశ్చాత్య కళకు దేశీయత జత చేసి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది.**
**జాజ్ డ్యాన్స్‌లో అద్భుతమైన ప్రతిభ చూపుతోంది.**

# జాజ్ జాజిమల్లి

ముంబైలోని ఆల్–ఉమెన్ జాజ్ టీమ్‌లో శ్వేతన్ కన్వర్, రాధిక మాయాదేవ్, రోషిణి నాయర్, వేదిక అగర్వాల్, దీక్ష, రియా సూద్ అనే డ్యాన్సర్‌లు ఉన్నారు.

'స్టీరియోటైప్‌ను బ్రేక్ చేయడానికి జాజ్ టీమ్ ప్రారంభించాం' అంటుంది ఫౌండర్ శ్వేతన్ కన్వర్.

డెహ్రాడూన్‌కు చెందిన శ్వేతన్ ఫ్యాషన్ మార్కెటింగ్ స్టూడెంట్.

ఒకప్పుడు హాబీగా మాత్రమే ఉన్న జాజ్ డ్యాన్స్ ఇప్పుడు తన కెరీర్‌గా మారుతుందని ఆమె ఊహించలేదు.

'జాజ్ డ్యాన్స్ అనేది అందరూ అనుకునేంత సులువైన విద్య కాదు. ఎంతో సాధన చేస్తే తప్ప ఆ విద్య మన సొంతం కాదు' అంటుంది శ్వేతన్.


ఆల్ ఉమెన్ జాజ్ టీమ్ సభ్యులు

రాధిక మాయదేవ్ పదహారు సంవత్సరాల వయసు నుంచే జాజ్ డ్యాన్స్ చేయడం ప్రారంభించింది. అయితే తన అభిరుచినే కెరీర్‌గా ఎంచుకోవాలనుకున్నప్పుడు మాత్రం ముందు తల్లిదండ్రులు అడ్డుచెప్పినప్పటికీ కూతురు ఉత్సాహాన్ని గమనించి ఆ తరువాత వారు ఆమోదించారు.
కూతురికి లభించిన గుర్తింపుకు సంతోషిస్తున్నారు.

కామర్స్ స్టూడెంట్ అయిన రోహిణి నాయర్ మొదట భరతనాట్యం చేసేది. ఆ తరువాత జాజ్ డ్యాన్స్‌లోకి వచ్చింది. ఇది వారి తల్లిదండ్రులకు నచ్చలేదు. అయితే వారిని తన మాటలతో మెప్పించింది.

'మా అమ్మాయి జాజ్ డ్యాన్సర్' అని గర్వంగా చెప్పుకునేలా చేసింది రోహిణి.

'ప్రయోగాలతోనే ఏ కళ అయినా వృద్ధి చెందుతుంది. కళ ఎప్పుడూ నిలవనీరులా ఉండకూడదు' అంటున్న వేదిక అగర్వాల్ జాజ్‌కు దేశీయ సొగసును జత చేయడానికి పలు రకాలుగా ఆలోచిస్తుంది.

సాధారణంగా జాజ్ డ్యాన్స్ అనగానే శాక్సఫోన్ శబ్దాలు, ఇంగ్లీష్ పాటల లిరిక్స్ వినిపిస్తాయి.

'అలా మాత్రమే ఎందుకు!' అంటూ ఈ టీమ్ జాజ్ డ్యాన్స్‌కు కొత్త లుక్ తీసుకువచ్చింది.

ప్రసిద్ధ బాలివుడ్ పాటలతో జాజ్ డ్యాన్స్ చేయడం ప్రారంభిచారు.

'మొదట ఆశ్చర్యంగా చూస్తారు. ఆ తరువాత ఆనందిస్తారు. ఆ తరువాత ఆమోదిస్తారు' అనే మాట ఈ టీమ్ విషయంలో నిజమైంది.

'జాజ్ డ్యాన్స్‌లో బాలీవుడ్ పాటలు ఏమిటి!' అని ఆశ్చర్య పోయినవారే వారి ప్రదర్శన చూసిన తరువాత 'ఆహా! అద్భుతం' అని మెచ్చుకున్నారు.

'హిందీ సినిమా పాటలకే కాదు సౌత్ ఇండియన్ మ్యూజిక్‌కు కూడా జాజ్ డ్యాన్స్ జత చేయనున్నాం' అంటుంది రోహిణి నాయర్.

'మీరు చూస్తే లావుగా కనిపిస్తారు. ఇంత చక్కగా ఎలా డ్యాన్స్ చేయగలుగుతున్నారు!' అని చాలామంది రాధిక మాయదేవ్‌ను అడుగుతుంటారు.

ఆమె ఆ సందేహానికి చెప్పే సమాధానం...

'ప్రతి బాడీకి తనదైన ప్రత్యేకత ఉంటుంది. రిథమ్ ఉంటుంది. ప్రతి బాడీకి డ్యాన్స్ చేసే సామర్థ్యం ఉంటుంది. అందుకు అవసరమైనది సాధన మాత్రమే'

జాజ్ డ్యాన్స్‌లో కంటెంపరరీ, ఫంక్, స్ట్రీట్ స్టైల్, లిరికల్ అండ్ కమర్షియల్...అంటూ రకరకాల స్టైల్స్ ఉన్నాయి. వీటన్నిటిలోనూ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తూ అభినందనలు అందుకుంటోంది ఆల్–ఉమెన్ జాజ్ టీమ్.

---

**కిచెన్‌టిప్స్**



- బిర్యానీ, ఫ్రై డ్రైస్, పుదీనా రైస్ వంటివి రుచి, వాసనతో కొత్తదనం కావాలంటే బియ్యాన్ని ముందుగా వేయించాలి.
- గారెల పిండి నూనెలో వేయగానే విడిపోతుంటే పిండిలో ఒక టేబుల్ స్పూను నెయ్యి కలపాలి.
- పులుసు పలచనయితే బియ్యపిండి లేదా సెనగ పిండిని కాస్త నీటిలో కలిపి అందులో పోసి ఉడక పెట్టుకోవాలి.
- కూరగాయలు తరిగేటప్పుడు చేతులు తెగితే వెంటనే గాయానికి పసుపు అద్దితే త్వరగా మానటమే కాక సెప్టిక్ అవదు.
- ఫ్రెష్ బ్రెడ్ మెత్తగా ఉండి ముక్కలుగా కోయటం కష్టమైనప్పుడు చాకును మంట దగ్గరిగా పెట్టి వేడి చేసి వాడితే పని తొందరగా అవుతుంది.






'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 37

శనివారం 29-4-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**లక్నో పరుగుల సునామీ**
ఐపీఎల్‌లో 56 పరుగుల తేడాతో పంజాబ్‌కింగ్స్‌పై గెలుపు - 10లో




**అయిదో రోజూ లాభాలే**
రెండు నెలల గరిష్టానికి సూచీలు 61 వేల పైకి సెన్సెక్స్ - 11లో



**ఒక్కో పంచాయతీకి రూ.కోటి**
కర్ణాటకలో అధికారంలోకి వస్తే ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.కోటి ఇస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు.
వివరాలు 6లో ▸



**అలాంటి ప్రసంగాలపై కేసులు**
విద్వేష ప్రసంగాలు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని అన్ని రాష్ట్రాలను, యూటీలను సుప్రీంకోర్టు ఆదేశించింది.
వివరాలు 6లో ▸



**సిసోడియాకు నో బెయిల్**
మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి ఆప్ నేత మనీశ్ సిసోడియాకు ఢిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించింది.
వివరాలు 6లో ▸



**సోనియా గాంధీ విషకన్య**
కాంగ్రెస్ పార్టీలో నాట్యం చేసే విషకన్య సోనియా గాంధీ అని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యాత్నాల్ అన్నారు.
వివరాలు 6లో ▸

# మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

## ముఖ్యమంత్రి నేరుగా ప్రజలతో కనెక్ట్ అయి ఉండేలా ఫోన్ లైన్



- ప్రభుత్వ సేవల్లో సమస్యలు, సలహాలను నేరుగా తెలియజేయవచ్చు
- 1902 హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా గ్రీవెన్స్‌లు నమోదు
- నిర్దిష్ట సమయంలోగా నాణ్యతతో పరిష్కరించడమే లక్ష్యం
- ఐవీఆర్ఎస్, ఎస్సెమ్మెస్‌లతో అప్‌డేట్స్.. ఆ తరువాత ఫీడ్ బ్యాక్ కూడా
- చాలా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాం.. స్పందనకు మెరుగైన రూపం
- నా పేరు కలిపారంటేనే కార్యక్రమం ప్రాధాన్యత తెలుస్తోంది
- సీఎంవో నుంచి మండలాల వరకు పర్యవేక్షణ యూనిట్లు
- ప్రత్యేకాధికారులుగా సీనియర్ ఐఏఎస్‌లు..
- ప్రతి 15 రోజులకు జిల్లాల సందర్శన
- సచివాలయాలు, ఆర్బీకేలు, అంగన్‌వాడీలు, విలేజ్ క్లినిక్స్ పనితీరుపై దృష్టి.. గ్రామాలలో ఇళ్ల నిర్మాణంపైనా పరిశీలన
- ప్రతి కలెక్టర్‌కు తక్షణ నిధులుగా రూ.3 కోట్లు..
- అవసరమైన చోట వెచ్చించే అధికారం
- కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం దిశా నిర్దేశం

**సాక్షి, అమరావతి:** వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజల సమస్యలను నిర్దిష్ట సమయంలోగా నాణ్యతతో పరిష్కరించడంతో పాటు నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మే 9వతేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. నమోదైన సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరా తీయడం, ముఖ్యమంత్రి సందేశాలను నేరుగా చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. ముఖ్యమంత్రి నేరుగా ప్రజలతో కనెక్ట్ అయి ఉంటారని, సేవల్లో సమస్యలు, సలహాలను నేరుగా తెలియచేయవచ్చని వెల్లడించారు. ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కార్యాలయం ఆయా సమస్యలు నిర్దేశిత సమయంలోగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఉద్దేశం, ఆశయాలు, లక్ష్యాలపై అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

**హెల్ప్‌లైన్ నంబర్ 1902**

మే 9న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. అందుకోసం 1902 హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రవేశ పెడుతున్నాం. ఇప్పటికే పలు మార్లు సమీక్షలు చేశాం. జగనన్నకు చెబుదాం పేరులో ముఖ్యమంత్రి అయిన నా పేరు జోడించారంటే ఈ కార్యక్రమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఎంత ఉందో అర్థం అవుతోంది. ఇది చాలా

మిగతా 2వ పేజీలో ▶

### పేదల ఇళ్లకు రూ.15,810 కోట్లు

- గత ఆర్థిక ఏడాది రూ.10,203 కోట్లు వ్యయం చేశాం: సీఎం
- 'పేదలందరికీ ఇళ్లు'కి నిధుల లోటు లేదు... ఎక్కడా బకాయిలు లేవు
- పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది
- ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతమయ్యేలా అధికారులు కృషి చేయాలి

2 లో

### వేసవి సెలవుల్లోనూ మనబడి నాడు-నేడు

- రెండో దశ పనులు వేగంగా జరగాలి: సీఎం జగన్
- కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలి
- జూన్ 12న స్కూళ్లు తెరిచిన రోజే విద్యా కానుక అందాలి

2 లో



### బ్రిజ్‌భూషణ్‌పై 'ఎఫ్ఐఆర్'

- రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఉదంతంపై...
- ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు
- రెండు ఎఫ్ఐఆర్‌లపై సత్వర విచారణ చేపడతామన్న ఢిల్లీ పోలీసులు
- మైనర్ రెజ్లర్లకు తగిన భద్రత కల్పించండి.. మే 5 లోగా అఫిడవిట్ దాఖలు చేయండి
- దర్యాప్తునకు సంబంధించిన డాక్యుమెంట్ల విషయంపై గోప్యత పాటించండి
- పోలీసులకు సుప్రీం కోర్టు ఆదేశం
- సుప్రీం ఆదేశాలను స్వాగతిస్తున్నా
- బ్రిజ్‌భూషణ్ ప్రకటన

10 లో

## న్యూస్‌రీల్

### ఆంధ్రా బౌద్ధ శిల్పాలకు అంతర్జాతీయ గుర్తింపు



ప్రాచీన కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన ఆంధ్రప్రదేశ్‌కు మరో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. రాష్ట్రానికి చెందిన ఆరు బౌద్ధ శిల్పాలు అమెరికా, దక్షిణ కొరియాల్లో అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికయ్యాయి.
వివరాలు 3లో ▸

### ఏయూలో ఉద్యోగ విప్లవం




విశాఖ బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా సైన్స్ కళాశాల అచీవర్స్ డే నిర్వహించింది. ఇందులో భాగంగా ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను వర్సిటీ అందించింది.
వివరాలు IVలో ▸

### మరో ఇద్దరి కిడ్నీలు కాజేశారు



విశాఖపట్నం కిడ్నీ రాకెట్ విషయంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అమాయకులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి ఎరవేసి.. వారి కిడ్నీలు కాజేస్తున్నారు. మధురవాడ వాంబే కాలనీకి చెందిన మరో ఇద్దరి కిడ్నీలు కాజేసినట్లు తెలిసింది.
వివరాలు 2లో ▸

### ఉగ్రవాదాన్ని సమూలంగా పెకలిద్దాం



ప్రపంచానికి పెనుముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని సమూలంగా పెకలించి వేయాల్సిన అవసరం ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ విషయంలో ఎస్సీఓ సభ్యదేశాలు కలిసికట్టుగా పనిచేయాలని ఢిల్లీలో ఎస్సీఓ సభ్యదేశాల రక్షణ శాఖ మంత్రుల సదస్సులో అన్నారు.
వివరాలు 6లో ▸



# ఉద్దానం ఫేజ్-2కు రెడీ

## రూ.265 కోట్లతో పాతపట్నం నియోజకవర్గంలో 5 మండలాలకు తాగునీరు

- జ్యుడీషియల్ ప్రివ్యూ పరిశీలనకు టెండర్ దరఖాస్తు
- మూడున్నర లక్షల మందికి తాగునీరు సమస్య తీరే అవకాశం
- ఇప్పటికే రూ.700 కోట్లతో ఉద్దానం మొదటి దశ ప్రాజెక్టు చేపట్టిన సీఎం జగన్ సర్కార్
- 90శాతం పనులు కూడా పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఉద్దానం ఫేజ్-1




ఫేజ్-1లో భాగంగా హిరమండలంలో నిర్మించిన అప్రోచ్ బ్రిడ్జ్

**సాక్షి, అమరావతి:** దశాబ్దాల తరబడి కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతానికి చెందిన పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పొడవునా సురక్షిత తాగునీరు అందించనుంది. ఇందుకోసం రూ.265 కోట్లతో ఉద్దానం ఫేజ్-2 ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతోంది. తద్వారా పాతపట్నం, మెలియపుట్టి, హిరమండలం, కొత్తూరు, లక్ష్మీనరసపేట మండలాల పరిధిలోని 448 నివాసిత ప్రాంతాల్లో ఉంటున్న దాదాపు మూడున్నర లక్షల మందికి తాగునీటి ఇబ్బందులు పూర్తిస్థాయిలో తొలగిపోతాయి. ఉద్దానం, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూగర్భ జలాల్లో కొన్ని ప్రమాదకర లోహాలు కారణంగానే ఆ నీటిని తాగే అక్కడి ప్రజలు ఏళ్ల తరబడి కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్లు నిపుణులు గుర్తించారు. ఈ సమస్య పరిష్కారానికి గత చంద్రబాబు ప్రభుత్వం మాయమాటలు చెబుతూ కాలక్షేపం చేస్తే.. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన

మిగతా 3వ పేజీలో ▶

### అవినాశ్ పిటిషన్ జూన్ 5కు వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంపీ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ జూన్ 5కు వాయిదా పడింది. జస్టిస్ సురేందర్ శుక్రవారం 4 గంటలకు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టారు. హైకోర్టుకు శనివారం నుంచి వేసవి సెలవులు ఉండటంతో విచారణను జూన్ 5కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో అవినాశ్ న్యాయవాది జోక్యం చేసుకుని.. సీబీఐ ఎలాంటి కఠిన చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదే కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన ప్రకారం.. వాదనలు పూర్తికాకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని న్యాయమూర్తి చెప్పారు. కావాలంటే.. సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించమని చెప్పారు. లేదా సెలవుల్లో ఉండే బెంచ్ ముందు హౌస్ మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేయవచ్చని సూచించారు. ఆ తర్వాత అవినాశ్ న్యాయవాది సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సీబీఐ కఠిన చర్యలు తీసుకునే పరిస్థితి ఉంటే.. సెలవుల్లో ఉండే బెంచ్‌ను ఆశ్రయించవచ్చని ధర్మాసనం సూచించింది.

# ఇంటింటికీ సచివాలయాల ఉద్యోగులు



## సిటిజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ కింద ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన

### ఆధార్ కొత్త నిబంధనలపై సమాచారం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రతి నెలా ఆఖరి శుక్ర, శనివారాల్లో సిటిజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు వారి సొంత ఊళ్లలోనే ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సేవల వివరాలను తెలియజేస్తున్నారు. ఏప్రిల్ ఆఖరి శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా

మిగతా 3వ పేజీలో ▶

# ఎన్టీఆర్ యుగపురుషుడు



ఎన్టీఆర్ శతజయంతి సభలో ప్రసంగిస్తున్న రజనీకాంత్

- ఆయన నటన నాకు స్ఫూర్తి
- ఎన్టీఆర్ శతజయంతి సభలో నటుడు రజనీకాంత్
- ఎన్టీఆర్ ఒక శక్తి: చంద్రబాబు

9 లో




# దళిత సంక్షేమంలో చంద్రబాబు విఫలం

## మా బిడ్డలకు విద్యాసాధికారత అందించిన ఘనత సీఎం జగన్‌దే

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులతో దళితులకు మేలు
- దళితులకు రాజకీయంగా అత్యున్నత స్థానం దక్కింది
- దళిత సంక్షేమంపై మాట్లాడే అర్హత చంద్రబాబుకి లేదు
- ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎంను తూలనాడుతున్నారు
- బాబూ.. అసెంబ్లీలో చర్చిద్దాం రా..
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



**సాక్షి, అమరావతి:** దళిత సంక్షేమంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. ఊహా ప్రపంచంలో తిరుగుతూ ప్రతిదీ తానే కనిపెట్టానని చెప్పుకొనే చంద్రబాబు.. ఎస్సీ నాయకులంతా తన భ్రమలను ప్రచారం చేయాలని కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దళితులకు సంక్షేమం అందించడంలో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను తూలనాడటం సిగ్గు చేటని మండిపడ్డారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో

మిగతా 9వ పేజీలో ▶

# విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్

### మే 3న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభం

- మధురవాడ సమీపంలో 190.29 ఎకరాల్లో ఏర్పాటు
- డేటా సెంటర్‌తో పాటు ఐటీ పార్క్, బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ, రిక్రియేషన్ సెంటర్ అభివృద్ధి
- ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి
- ఐదు దశల్లో 300 మెగావాట్ల డేటా సెంటర్ అభివృద్ధి



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో డేటా సెంటర్, ఐటీ పార్కుల అభివృద్ధి కోసం అదానీ గ్రూపు రూ.21,844 కోట్ల భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. మొత్తం 300 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌తో పాటు బిజినెస్ ఐటీ పార్కు, స్కిల్ కాలేజీ, రిక్రియేషన్ సెంటర్లను అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖపట్నంలోని మధురవాడ సమీపంలో కాపులుప్పాడ వద్ద ఎకరం కోటి రూపాయలు చొప్పున 190.29 ఎకరాలను కేటాయించింది. ఈ డేటా సెంటర్ ద్వారా ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి లభించనుంది. తొలుత 130 ఎకరాల్లో 200 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఈ సంస్థ ఆ తర్వాత మరో 100 మెగావాట్ల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. దీంతో మరో 60.29 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదానీ గ్రూపు విశాఖ టెక్ పార్క్ లిమిటెడ్ పేరుతో

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

## జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీలు

- జూలై 26 నుంచి యూనిట్ పరీక్షలు
- ఇంటర్ విద్యా క్యాలెండర్‌ను విడుదల చేసిన విద్యాశాఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కాలేజీలు జూన్ 1న తెరుచుకోనున్నాయి. మొదటి, రెండో సంవత్సర తరగతులు అదేరోజు ప్రారంభమవుతాయి. ఈ మేరకు మాధ్యమిక విద్యా శాఖ 2023–24 విద్యాసంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం విడుదల చేసింది. యూనిట్–1 పరీక్షలు జూలై 26–28 వరకు, యూనిట్–2 పరీక్షలు ఆగస్టు 24–26 వరకు నిర్వహించనున్నారు. క్వార్టర్లీ పరీక్షలు సెప్టెంబర్ 16–23 వరకు, యూనిట్–3 అక్టోబర్ 16–18 వరకు నిర్వహించనున్నారు. అక్టోబర్ 19–25 వరకు దసరా సెలవులు. యూనిట్–4ను నవంబర్ 23- 25 వరకు, హాఫ్ ఇయర్లీ పరీక్షలను డిసెంబర్ 18–23 వరకు నిర్వహిస్తారు. 2024 జనవరి 11–17 వరకు సంక్రాంతి సెలవులు. ప్రీఫైనల్ ఎగ్జామ్స్‌ను జనవరి 19–25 వరకు, వార్షిక ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి రెండో వారంలో, వార్షిక పరీక్షలను మార్చి మొదటి వారంలో నిర్వహిస్తారు. 2023–24 విద్యా సంవత్సరంలో చివరి పనిదినాన్ని మార్చి 28గా పేర్కొన్నారు. మార్చి 29–మే 31 వరకు వేసవి సెలవులు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను మే చివరి వారంలో ఉంటాయి. 2024–25 విద్యా సంవత్సరంలో కాలేజీలను జూన్ 1 పునర్ ప్రారంభించనున్నట్లు ఇంటర్ బోర్డు కమిషనర్ శేషగిరిబాబు ఉత్తర్వులిచ్చారు.

## 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు వైఎస్సార్‌సీపీ పరిశీలకుల నియామకం

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు 4 నియోజకవర్గాలకు పరిశీలకులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. గుంతకల్‌కి ఎంసీ విజయానందరెడ్డి, రాప్తాడుకి టీజీ సురేష్, నగరికి చిందేపల్లి మధుసూదన రెడ్డి, పూతలపట్టుకి షమీమ్ అస్లాం నియమితులయ్యారు.

## రైలుకు, ప్లాట్‌ఫాంకు మధ్య ఇరుక్కున్న మహిళ

- బయటకు తీసి ప్రాణాలు కాపాడిన రైల్వే పోలీసులు



రైలుకు, ప్లాట్‌ఫామ్‌కు మధ్య ఇరుక్కుపోయిన మహిళ

చీరాల అర్బన్: రైలు ఎక్కే క్రమంలో ఓ మహిళ రైలుకు, ప్లాట్‌ఫామ్‌కు మధ్య ఇరుక్కుపోయింది. రైల్వే పోలీసులు స్పందించి ఆమె ప్రాణాలు కాపాడారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాల రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. నెల్లూరు జిల్లా కరేడు గ్రామానికి చెందిన తిరుపతమ్మ, ఆమె భర్త ఇద్దరూ ఉలవపాడు వెళ్లేందుకు తెనాలిలో విజయవాడ–గూడూరు మెమూ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. రైలు చీరాల వచ్చేసరికి మరుగుదొడ్ల కోసం రైలు నుంచి ఆమె కిందకు దిగింది. అనంతరం రైలు కదలడంతో హడావుడిగా కదులుతున్న రైలు ఎక్కింది. ఈ క్రమంలో రైలుకు, ప్లాట్‌ఫామ్‌కు మధ్య ఆమె ఇరుక్కుపోయింది. వెంటనే అక్కడ జీఆర్పీ, ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, నాగార్జున ఇద్దరూ కలిసి తోటి ప్రయాణికుల సాయంతో అతి కష్టం మీద బయటకు తీశారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను వెంటనే 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సుమారు 50 నిమిషాల పాటు రైలును నిలిపివేశారు.

# పేదల ఇళ్లకు రూ.15,810 కోట్లు

## గత ఆర్థిక ఏడాది రూ.10,203 కోట్లు వ్యయం చేశాం: సీఎం వైఎస్ జగన్

- 'పేదలందరికీ ఇళ్లు'కి నిధుల లోటు లేదు.. ఎక్కడా బకాయిలు లేవు
- పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది
- ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతమయ్యేలా అధికారులు కృషి చేయాలి
- వెయ్యికి పైగా ఇళ్లు నిర్మిస్తున్న కాలనీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- ప్రతి శనివారం హౌసింగ్ డే.. కలెక్టర్ల నుంచి అధికారుల దాకా రెండు లే అవుట్లు సందర్శించాలి
- సీఆర్‌డీఏ పరిధిలో 48 వేల ఇళ్ల పట్టాలు మే 2వ వారంలో ఇచ్చేందుకు సిద్ధం కావాలి
- వందేళ్ల తరువాత సమగ్ర భూసర్వే చేస్తున్నాం.. దేశానికే ఆదర్శంగా ఈ కార్యక్రమం
- మే 25 నుంచి రెండో దశ గ్రామాల్లో భూముల సర్వే ప్రారంభం



కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పేదల ఇళ్ల నిర్మాణానికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15,810 కోట్లు ఖర్చు చేయనున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,203 కోట్ల వ్యయం చేశామని, పేదలందరికీ ఇళ్ల కార్యక్రమానికి సంబంధించి నిధులకు ఎలాంటి లోటు లేదని స్పష్టం చేశారు. ఎక్కడా బకాయిలు లేవని చెప్పారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు, జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకాలపై సీఎం జగన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించి పలు సూచనలు చేశారు.

**వెయ్యికి పైగా ఇళ్లున్న కాలనీలపై ప్రత్యేక దృష్టి**

పెద్ద ఎత్తున చేపట్టిన గృహ నిర్మాణాలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. పేదలందరికీ ఇళ్ల కార్యక్రమాన్ని చురుగ్గా ముందుకు తీసుకెళ్లాలి. కొన్ని జిల్లాల కలెక్టర్లు ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వెయ్యికి పైగా ఇళ్లను నిర్మిస్తున్న కాలనీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇప్పించేలా ఏర్పాట్లు ముమ్మరం చేయాలి. ఇప్పటికే 10.03 లక్షల మంది లబ్ధిదారులకు రూ.3,534 కోట్లకుపైగా రుణాలు మంజూరయ్యాయి. కలెక్టర్లు బ్యాంకులతో మాట్లాడి రుణాలు ఇప్పించే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి.

### ప్రతి శనివారం హౌసింగ్ డే

ప్రతి శనివారం హౌసింగ్ డేగా పరిగణించాలి. గృహ నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నమైన అధికారులు ఆ రోజు తప్పనిసరిగా రెండు లే అవుట్లను సందర్శించాలి. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎండీవోలు, ఎంఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, డిస్కమ్‌లు, గృహ నిర్మాణ అధికారులు, సచివాలయాల సిబ్బంది ప్రతి శనివారం రెండు హౌసింగ్ లే అవుట్లను తప్పనిసరిగా సందర్శించాలి. దీనివల్ల అక్కడ ఏమైనా సమస్యలుంటే తెలుస్తాయి, నిర్మాణాల్లో నాణ్యత కూడా ఉంటుంది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని 48 వేలమంది పేదలకు సీఆర్డీఏ ప్రాంతంలో మే రెండో వారంలో ఇళ్ల పట్టాల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలి.

**సమగ్ర భూ సర్వేను కలెక్టర్లు ఓన్ చేసుకోవాలి**

జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష (సమగ్ర సర్వే) చాలా ప్రతిష్టాత్మక కార్యక్రమం. దేశంలో ఎక్కడా సమగ్ర సర్వే జరగలేదు. 100 ఏళ్ల తర్వాత మనం రాష్ట్రంలో చేస్తున్నాం. దేశమంతటికీ ఇది ఆదర్శనీయమైన కార్యక్రమం. కలెక్టర్లు దీన్ని ఓన్ చేసుకోవాలి. భూ హక్కు పత్రాల పంపిణీ, సరిహద్దు రాళ్ల పాతడం, గ్రామాల్లో భూముల రికార్డుల్లో తుది వివరాలు నమోదు, గ్రామ సచివాలయాల్లోనే సబ్ రిజిస్ట్రార్ సేవలు లభ్యం కావడం ఈ కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యమైన ఉద్దేశాలు. రాష్ట్రంలోని మొత్తం 17,464 రెవెన్యూ గ్రామాలకుగానూ మొదటి విడతగా 2 వేల గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమం తుదిదశకు చేరుకుంటోంది. దీన్ని త్వరగా పూర్తి చేయాలి. కలెక్టర్లు దీనిపై దృష్టిపెట్టి రైతులకు భూహక్కు పత్రాల పంపిణీతోపాటు తర్వాత దశల్లో సర్వే కార్యక్రమాల్లో నిమగ్నం కావాలి. పొరపాట్లకు తావులేకుండా కచ్చితమైన వివరాలతో యజమానులకు భూహక్కు పత్రాలు అందాలి. మే 25వతేదీ నుంచి రెండో దశలో మరో 2 వేల గ్రామాల్లో సర్వే ప్రారంభం అవుతుంది.

# వేసవి సెలవుల్లోనూ మనబడి నాడు-నేడు

### రెండో దశ పనులు వేగంగా జరగాలి: సీఎం జగన్

- కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలి
- ట్యాబ్‌లు సరిగా పనిచేస్తున్నాయో లేదో పరీక్షించాలి
- నెలకు ఒకసారి డిజిటల్ డే పాటించాలి
- జూన్ 12న స్కూళ్లు తెరిచిన రోజే విద్యా కానుక అందాలి
- మాదక ద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు.. వర్సిటీలు, కాలేజీల్లో నిఘా వ్యవస్థ



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: మన బడి నాడు–నేడు కార్యక్రమానికి నిధుల కొరత లేదని, స్కూళ్లకు ఎండాకాలం సెలవులను సద్వినియోగం చేసుకుంటూ రెండో దశ పనులను వేగవంతం చేయాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. తల్లిదండ్రుల కమిటీల ఖాతాల్లో రూ.734.21 కోట్లు ఉన్నాయని, తదుపరి ఖర్చుల కోసం మరో రూ.1,400 కోట్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మన బడి నాడు – నేడు, జగనన్న విద్యా కానుకపై ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులకు మార్గ నిర్దేశం చేశారు.

**జూన్ 12 లోగా ఐఎఫ్‌పీ ప్యానెళ్ల బిగింపు**

ఐఎఫ్‌పీ పానెళ్లను బిగించడం ద్వారా 15,715 స్కూళ్లలో మొదటి విడత నాడు– నేడు పనులు పూర్తైనట్లు అవుతుంది. దీంతో 6వ తరగతి, ఆపై తరగతులకు సంబంధించి 30,230 క్లాస్‌రూమ్స్‌లో డిజిటలైజేషన్ పూర్తవుతుంది. జూన్ 12వతేదీ లోగా ఐఎఫ్‌పీ ప్యానెళ్ల బిగింపు పూర్తి కావాలి. రెండో దశలో 16,461 స్కూళ్లలో నాడు– నేడు చేపడుతున్నాం. ఫేజ్ - 3లో సుమారు మరో 13 వేల స్కూళ్లలో నాడు– నేడు ద్వారా పనులు జరుగుతాయి.

**వేసవి సెలవుల్లో పనులపై దృష్టి పెట్టాలి**

మూడు విడతల్లో దాదాపు 45 వేల ప్రభుత్వ స్కూళ్లలో నాడు – నేడు పనులు పూర్తవుతాయి. వేసవి సెలవుల్లో పనులు చేయడానికి పూర్తి అవకాశాలు ఉంటాయి. ఈ సమయాన్ని పనుల కోసం బాగా వినియోగించుకోవాలి. కలెక్టర్లు దీనిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

**తొలి విడతలో ఎక్కడైనా లోపాలుంటే సరిదిద్దాలి**

మొదటి విడతలో నాడు– నేడు పనులు చేపట్టిన పాఠశాలలపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టాలి. ఎక్కడైనా లోపాలుంటే వెంటనే సరిదిద్దాలి. ఇంత పెద్ద సంఖ్యలో స్కూళ్లలో పనులు చేపడుతున్నాం. నాణ్యత లోపించకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలి. పేరెంట్స్ కమిటీ సేవలను కూడా సద్వినియోగం చేసుకోవాలి. ఇసుక, సిమెంట్, స్టీలు లాంటివి కొరత లేకుండా పంపిణీపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి. తద్వారా పనుల్లో ఆలస్యం జరగకుండా నివారించవచ్చు.

**ట్యాబ్‌లు బాగున్నాయా?**

8వ తరగతి విద్యార్థులకు, టీచర్లకు కలిపి సుమారు 5,18,740 ట్యాబ్‌లు ఇచ్చాం. వీటి ద్వారా విద్యార్థులకు ప్రయోజనం అందేలా చూడాలి. అవి సరిగ్గా పనిచేస్తున్నాయా? లేదా? అన్నదానిపై సమీక్ష చేయాలి. సమస్యలుంటే ఏం చేయాలో ఎస్‌వోపీలు రూపొందించాం. హెడ్మాస్టర్‌కు గానీ స్థానిక సచివాలయాల్లో గానీ అందచేస్తే మూడు రోజుల్లోగా రిపేరు చేసి తిరిగిస్తారు. ఈ మేరకు ఎస్‌వోపీల అమలుపై కలెక్టర్లు పర్యవేక్షించాలి.

**నెలకోసారి డిజిటల్ డే**

గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు స్కూళ్లకు వెళ్లి ఉపాధ్యాయులు, పిల్లలకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తారు. నెలకోసారి తప్పనిసరిగా డిజిటల్ డే పాటిస్తూ వారు స్కూళ్లకు వెళ్తారు. ప్రభుత్వం ఇచ్చిన ట్యాబుల వినియోగంపై అవగాహన కల్పించడం, వినియోగించడంపై శిక్షణ ఇస్తారు.

**జూన్ 12న స్కూళ్లు తెరవగానే 'విద్యాకానుక'**

స్కూళ్లు జూన్ 12న తిరిగి తెరుస్తారు, అదే రోజు వారికి జగనన్న విద్యాకానుక అందించాలి. ఇందులో ఎలాంటి ఆలస్యానికి తావు ఉండకూడదు. దాదాపు 43.10 లక్షల మందికి జగనన్న విద్యాకానుక అందుతుంది. విద్యాకానుక పంపిణీపై ప్రోటోకాల్‌ను పాటించాలి. విద్యాకానుక ద్వారా అందించే వస్తువుల క్వాలిటీపై కూడా బెస్ట్ ప్రోటోకాల్ పాటించాలి. బై లింగ్యువల్ (ద్విభాషా) పాఠ్య పుస్తకాలు, మూడు జతల యూనిఫామ్, నోట్‌బుక్స్, బ్యాగ్, షూ, రెండు జతల సాక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బెల్టు, వర్క్ బుక్స్‌తో కూడిన కిట్ నాణ్యతను పిల్లలకు అందించే ముందు కచ్చితంగా పరీక్షించాలి. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను మానిటరింగ్ చేయాలి. జగనన్న విద్యాకానుకపై ఏ ఒక్క స్కూలు, ఏ విద్యార్థి నుంచి నాకు ఫిర్యాదులు రాకూడదు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్లు పిల్లలకు విద్యాకానుక అందించాలి. గతంలో పుస్తకాలు సమయానికి ఇచ్చేవారు కాదు. అక్టోబర్, నవంబర్ నెలలొచ్చినా పిల్లలకు అందేవి కావు. నా పాదయాత్ర సమయంలో ఆ ఇబ్బందులు నేను స్వయంగా చూశా. మనం వచ్చాక పాఠశాలలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాం. మొత్తం వ్యవస్థలో మార్పులు తీసుకునివచ్చాం. పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి.

### మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోలీసు అధికారులు దృష్టిపెట్టాలి. ప్రతి యూనివర్సిటీ, కాలేజీల్లో ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రదర్శిస్తూ పెద్ద హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలి. జిల్లాల పోలీసు కార్యాలయాల్లో ప్రత్యేక డివిజన్‌ను సిద్ధం చేయాలి. విద్యాసంస్థల్లో ఇంటిలిజెన్స్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని నిరంతరం సమాచారం సేకరించాలి. పిల్లలు వాటి బారిన పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలి. మాదక ద్రవ్యాల తయారీదారులు, రవాణా, పంపిణీదారులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లోని 15 వేల మందికిపైగా మహిళా పోలీసుల (మహిళా సంరక్షణ కార్యదర్శులు) సేవలను సమర్థంగా వినియోగించుకోవాలి.

## స్కిల్ కుంభకోణంలో ఈడీ దర్యాప్తు వేగవంతం

- డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల డిపాజిట్లు జప్తు
- ఈ సంస్థ నుంచి షెల్ కంపెనీల ద్వారా సింగపూర్‌కు నిధులు
- అక్కడి నుంచి అప్పటి టీడీపీ ప్రభుత్వ ముఖ్య నేత ఇంటికి సొమ్ము

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కుంభకోణంలో ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వ ముఖ్య నేత సాధనంగా వాడుకున్న షెల్ కంపెనీ డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను శుక్రవారం జప్తు చేసింది. 2015–16 లో జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్టు ముసుగులో ఆ కంపెనీ పేరిట అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దలు ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కనుసన్నల్లోనే సాగిన ఈ కుంభకోణం కోసం డిజైన్ టెక్ అనే కంపెనీని తెరపైకి తెచ్చారు. అనంతరం ఆ కంపెనీ వెచ్చించాల్సిన 90 శాతం నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద రూ.370 కోట్లను విడుదల చేశారు. అనంతరం ఆ నిధులను డిజైన్ టెక్ కంపెనీ నుంచి వేర్వేరు షెల్ కంపెనీల ద్వారా సింగపూర్‌కు తరలించి అక్కడి నుంచి హవాలా విధానంలో హైదరాబాద్‌లోని అప్పటి ప్రభుత్వ ముఖ్య నేత నివాసానికి మళ్లించారు. దీనిపై ఇప్పటికే సీఐడీ కేసు నమోదు చేసి కీలక ఆధారాలను సేకరించింది. మనీ లాండరింగ్‌కు పాల్పడి నల్లధనాన్ని తరలించినందున కుంభకోణంపై దృష్టి సారించాలని ఈడీని సీఐడీ కోరింది. రంగంలోకి దిగిన ఈడీ కుంభకోణంలో పాత్రధారులైన అప్పటి సీఎం చంద్రబాబు సన్నిహితులు, షెల్ కంపెనీల ప్రతినిధులను విచారించింది. డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ ఖన్వేల్కర్, సీమెన్స్ ప్రాజెక్టు మాజీ ఎండీ సుమన్ బోస్, ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్‌ను అరెస్టు చేసింది. తాజాగా డిజైన్ టెక్‌కు చెందిన డిపాజిట్లను ఈడీ జప్తు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# మరో ఇద్దరి కిడ్నీలు కాజేశారు..

### విశాఖలో బయటకొస్తున్న అక్రమాలు

మహారాణిపేట/సింహాచలం: విశాఖపట్నం కిడ్నీ రాకెట్ విషయంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అమాయకులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి ఎరవేసి.. వారి కిడ్నీలు కాజేస్తున్నారు. మధురవాడ వాంబే కాలనీకి చెందిన మరో ఇద్దరి కిడ్నీలు మార్పిడి చేసినట్లు తెలిసింది. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వినయ్‌కుమార్‌ను చూసేందుకు వచ్చిన వారిలో కొందరు విస్తుపోయే విషయాలు వెల్లడించారు. మరో ఇద్దరి కిడ్నీలను దోచుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు మాత్రం భయపడుతున్నారు. వినయ్‌కుమార్ మోసం చేసిన ముఠా సభ్యులే మిగిలిన ఇద్దరి కిడ్నీలు కాజేసి ఉంటారని భావిస్తున్నారు.

**ముగ్గురు సభ్యుల ముఠా**

వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ లోపం కారణంగా కిడ్నీ రాకెట్ ముఠాలు చాప కింద నీరులా పనిచేస్తున్నాయి. అనుమతులు లేకుండా కిడ్నీల మార్పిడి జరిగిపోతోంది. గతంలో కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఆస్పత్రిలో అనధికారికంగా కిడ్నీ మార్చారు. ఇప్పుడు పెందుర్తిలోని తిరుమల ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి జరిగింది. సబ్బవరం ఏరియాలోని ఓ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి చేసినట్లు తెలిసింది. వాంబే కాలనీకి చెందిన శ్రీనివాస్, రమ్య కిడ్నీల మార్పిడి అక్కడే జరిగినట్లు సమాచారం. మద్యం మత్తులో ఉన్న శ్రీనివాస్ కిడ్నీని రాత్రికిరాత్రే కాజేసినట్లు తెలిసింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు డబ్బు ఆశ చూపి ముగ్గురు సభ్యుల ముఠా అవయవాలు దోచుకుంటోంది. ముందుగా ఓ రేటు మాట్లాడుకుని కిడ్నీ మార్పిడి తర్వాత ఆ మొత్తం ఇవ్వకపోవడం వల్లే వినయ్‌కుమార్ వ్యవహారం వెలుగు చూసింది. ఆ సొమ్ము పూర్తిగా ఇచ్చి ఉంటే ఈ వ్యవహారం బయటపడేది కాదు.

**ఆర్థిక ఇబ్బందులతోనే..**

వాంబేకాలనీకి చెందిన వినయ్‌కుమార్ కారు డ్రైవర్. ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఆ సమయంలో దళారి కామరాజు వచ్చి డబ్బులు వస్తాయని ఆశ చూపడంతో అతడు కిడ్నీ ఇవ్వడానికి మొగ్గు చూపాడు. రూ.50 వేల అడ్వాన్స్ తీసుకున్నాడు. దశల వారీగా రూ.2.50 లక్షలిచ్చారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులతో చెప్పగా.. కిడ్నీ పోతే ఎలా బతుకుతావనడంతో చివరి నిమిషంలో వినయ్‌కుమార్ తన నిర్ణయాన్ని మార్చుకుని హైదరాబాద్ వెళ్లిపోయాడు. కానీ కామరాజు, మిగిలిన ఇద్దరు ఫోన్లు చేసి ఒత్తిడి చేశారు. వారి ఒత్తిడికి తలొగ్గిన హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చిన వినయ్‌కుమార్‌ను రైల్వేస్టేషన్ నుంచే బలవంతంగా పెందుర్తిలోని తిరుమల ఆస్పత్రికి తీసుకెళ్లి కిడ్నీ తీసుకున్నారు. అతడి కిడ్నీని ఎముకల డాక్టర్ తొలగించారు. ప్రస్తుతం వినయ్‌కుమార్ కేజీహెచ్‌లోని యూరాలజీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ బాధితుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.



వినయ్‌కుమార్ నుంచి వివరాలు సేకరిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

### పోలీసుల ముమ్మర దర్యాప్తు

తిరుమల ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. రిజిస్ట్రేషన్, శస్త్రచికిత్సలకు అనుమతి లేకపోవడంతో అధికారులు గురువారం ఆస్పత్రిని సీజ్‌చేసిన సంగతి తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు అనేక కోణాల్లో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారు. వైద్యుడు పరమేశ్వరరావును గురువారం పలుమార్లు విచారించారు. శుక్రవారం కూడా ఆయన్ని విచారించినట్లు తెలిసింది. గతంలో ఇలాంటి ఆపరేషన్లు ఏమైనా ఆస్పత్రిలో చేశారా అన్న విషయంపైన కూడా దర్యాప్తు చేస్తున్నారు.

### కిడ్నీ మోసాలపై నిఘా: వైద్యశాఖ మంత్రి రజిని



సాక్షి, అమరావతి: కిడ్నీ మోసాలపై రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో నిఘా పెట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. విశాఖలో వెలుగు చూసిన కిడ్నీ మార్పిడి ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన విశాఖపట్నం నగరం పెందుర్తిలోని తిరుమల ఆస్పత్రిని సీజ్ చేశామన్నారు. ఘటన తమ దృష్టికి రాగానే విచారణకు ఆదేశించామని, వైజాగ్ కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆస్పత్రిని సీజ్ చేశారని వెల్లడించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న తిరుమల ఆస్పత్రికి అసలు అనుమతులే లేవని అధికారులు గుర్తించారని చెప్పారు. ఆస్పత్రి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయని పేర్కొన్నారు. తిరుమల ఆస్పత్రి వ్యవహారంలో మధ్యవర్తులుగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీని వేస్తామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

# మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతిష్టాత్మక కార్యక్రమం. మనం ఇప్పటికే స్పందన నిర్వహిస్తున్నాం. స్పందనకు మరింత మెరుగైన రూపమే 'జగనన్నకు చెబుదాం'.. నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే 'జగనన్నకు చెబుదాం..'! సమస్యలను అత్యంత నాణ్యంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి సమస్యను నమోదు చేసుకుంటే అత్యంత నాణ్యతతో పరిష్కరించాలి.

**సీఎంవో నుంచి మండలాల వరకూ పర్యవేక్షణ యూనిట్లు**

సీఎంవో, ప్రభుత్వ శాఖల అధిపతులు, జిల్లా, డివిజన్ స్థాయి, మండల స్థాయిలో మానిటరింగ్ యూనిట్లు ఉంటాయి. వీటిని కలెక్టర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. సమస్య పరిష్కారంలో క్వాలిటీ పెంచడం అన్నది ప్రధాన లక్ష్యం కావాలి. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షణ చేస్తేనే అది సాధ్యం. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల(పీఎంయూ)ను సీఎంవో కూడా పర్యవేక్షిస్తుంది. హెల్ప్‌లైన్ ద్వారా గ్రీవెన్స్ నమోదవుతాయి. వాటిని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పరిష్కరించాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తికి సంతృప్తి కలిగించడం అన్నది చాలా ముఖ్యమైన విషయం.

**ప్రతి కలెక్టర్‌కు తక్షణం రూ.3 కోట్లు**

ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పేరు పెట్టారంటే ఇది ఎంత ముఖ్యమైనదో అర్థం చేసుకోవాలి. ముఖ్యమంత్రి అధికారులపై ఆధారపడే విధులను నిర్వహిస్తారు. మీరు అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే ప్రభుత్వం సమర్థంగా పని చేసినట్లే. అప్పుడే ఈ కార్యక్రమం చక్కగా సాగుతున్నట్లు లెక్క. ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుంది. ప్రజలకు నాణ్యంగా సేవలను అందించాలన్నదే దీని ఉద్దేశం. ప్రతి కలెక్టర్‌కు రూ.3 కోట్లను తక్షణ నిధులుగా ప్రభుత్వం ఇస్తుంది. అవసరమైన చోట ఈ డబ్బులను ఖర్చు చేయవచ్చు. వీటిని ఖర్చు చేసే అధికారం కలెక్టర్‌కు ఇస్తున్నాం.

**గ్రామ స్థాయిలో అన్ని అంశాలపై దృష్టి**

కలెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, మానిటరింగ్ యూనిట్లు గ్రీవెన్స్‌తో పాటు గ్రామ స్థాయిలో అన్ని అంశాలపైనా దృష్టి పెడతారు. దీనివల్ల వేగంగా గ్రీవెన్స్ పరిష్కారంలో డెలివరీ మెకానిజం ఉంటుంది. అంతేకాకుండా గ్రామ స్థాయిలోని సచివాలయాలు, ఆర్బీకేలు, అంగన్‌వాడీలు, విలేజ్ క్లినిక్స్.. అవన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? అన్న అంశం పైన కూడా దృష్టిపెడతారు. గ్రామాలలో ఇళ్ల నిర్మాణంపైనా దృష్టి సారిస్తారు. ఇవి సక్రమంగా పని చేస్తే గ్రామ స్థాయిలో చాలావరకు సమస్యలు సమసిపోతాయి. అవి సమర్థంగా పనిచేయడం అన్నది చాలా ముఖ్యమైన విషయం. దీనికోసమే మానిటరింగ్ కమిటీలతో పాటు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తున్నాం. సమావేశంలో విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గిరిజాశంకర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఏపీడీడీసీఎఫ్ ఎండీ అహ్మద్‌బాబు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (మౌలిక వసతుల కల్పన) కాటమనేని భాస్కర్, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్, ఆర్ అండ్ బీ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సూర్యకుమారి, సెర్ప్ సీఈఓ ఏ ఎండీ ఇంతియాజ్, ఆరోగ్య కుటుంబసంక్షేమశాఖ కమిషనర్ నివాస్, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషా, డీఐజీ గోపీనాథ్ జెట్టి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారంపై ప్రజలకు అప్‌డేట్స్

తమ సమస్యల పరిష్కారంపై ఐవీఆర్ఎస్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ప్రజలకు క్రమం తప్పకుండా అప్‌డేట్స్ అందుతాయి. అంతేకాకుండా ఇదే హెల్ప్‌లైన్ ద్వారా సమస్యల పరిష్కారంపై అర్జీదారులనుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి 1902 హెల్ప్‌లైన్ గురించి అవగాహన కల్పిస్తారు. ఈ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకునేలా ప్రోత్సహిస్తారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభమయ్యేలోగా వలంటీర్లు ప్రతి గడపకూ 1902 గురించి చెబుతారు.

### ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్‌లు

సీనియర్ ఐఏఎస్ అధికారులు జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారు. క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకోసారి సంబంధిత జిల్లాలను సందర్శించి పర్యవేక్షిస్తారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలును కలెక్టర్లతో కలసి పర్యవేక్షిస్తారు. సమస్యల పరిష్కారాల తీరును ర్యాండమ్‌గా తనిఖీ చేస్తారు. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల పనితీరును గమనిస్తారు. ఎక్కడైనా సమస్య పరిష్కారం పట్ల సంతృప్తి చెందకుంటే తిరిగి ఓపెన్ చేస్తారు. ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా దాన్ని తిరిగి తెరుస్తారు. పరిష్కారం తీరుపై పూర్తిస్థాయిలో సమీక్ష చేస్తారు. చీఫ్ సెక్రటరీ, సీఎంవో, డీజీపీతో కలిసి రెగ్యులర్‌గా మానిటర్ చేస్తారు. ప్రతి 15 రోజులకోసారి పూర్తిస్థాయిలో సమీక్ష ఉంటుంది.

## పనికట్టుకుని అసత్య కథనాలు

- ఎంపీ వైఎస్ అవినాశ్‌ను ఇరికించి పార్టీకి నష్టం కలిగించేందుకు పచ్చమీడియా యత్నం
- జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మండిపాటు
- అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎల్లో మీడియాకు హితవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


**జమ్మలమడుగు:** చంద్రబాబునాయుడు, ఎల్లో మీడియాతోపాటు మరికొందరు వివేకా కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఇరికించి తద్వారా వైఎస్సార్‌సీపీకి నష్టం కలిగించే కుట్ర పన్నుతున్నారని వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి మండిపడ్డారు. ఎల్లో మీడియాలో శుక్రవారం వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజున జమ్మలమడుగులో జీకే బ్రదర్స్‌ను పార్టీలో చేర్చుకునే కార్యక్రమం ఏర్పాటుచేశామని.. ఆ కార్యక్రమం అయిపోగానే రెండు వీధుల్లో ప్రచారం చేయాలని నిర్ణయించామని చెప్పారు. అక్కడే అల్పాహార విందు సైతం ఏర్పాటుచేశామన్నారు. అయితే, చిన్నాన్న వివేకా మరణించారని తాను రాలేనని అవినాశ్ చెప్పారని సుధీర్‌రెడ్డి వివరించారు. దీంతో షెడ్యూల్ ప్రకారం జీకే కొండారెడ్డిని పార్టీలోకి ఆహ్వానించిన తర్వాత తాము కూడా పులివెందులకు వెళ్లామన్నారు. కానీ, వైఎస్ 'అవినాశ్‌రెడ్డి కట్టుకథలు.. జమ్మలమడుగులో కార్యక్రమమే లేద'ంటూ ఎల్లో మీడియా అసత్యాలతో కూడిన ఓ కథనం ప్రచురించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్ కుటుంబంపై కక్షగట్టి అసత్య ప్రచారం చేసి ఇదే నిజమనే విధంగా చూపించాలనే ప్రయత్నం ఎల్లో మీడియా మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా నిజాలు తెలుసుకోవాలన్నారు. జి.కొండారెడ్డి మాట్లాడుతూ.. ఎల్లో మీడియాలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమన్నారు. తాము పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్న తర్వాత వివేకానందరెడ్డి మరణించారని.. దీంతో తాను రాలేనని అవినాశ్ ఆ రోజు చెప్పారని ఆయన గుర్తుచేశారు.

## ఇంటింటికీ సచివాలయాల ఉద్యోగులు

▶ మొదటి పేజీ తరువాయి

ఆధార్ నిబంధనల్లో కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలను ప్రజలకు వివరిస్తున్నారు. అలాగే వివిధ గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా అన్ని వార్డు సచివాలయాల్లో అందజేస్తున్న సేవల గురించి పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఇంటింటా వివరించి చెప్పాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

# ఆంధ్రా బౌద్ధ శిల్పాలకు అంతర్జాతీయ గుర్తింపు





మహాపురుష మూర్తితో కూడిన స్థూపం ప్యానెల్ (బుద్ధుడిని పూజిస్తున్న యక్షులు)

- జూలైలో అమెరికాలో ప్రదర్శన.. ఆ తర్వాత దక్షిణ కొరియాలో
- క్రీ.పూ. 200 ఏళ్ల నుంచి క్రీ.శ. 400 ఏళ్ల మధ్య కాలం నాటి శిల్పాల కొలువు
- రాష్ట్రం నుంచి ఆరు శిల్పాలు ఎంపిక
- తొలి బౌద్ధ కళా రూపాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు

**సాక్షి, అమరావతి:** ప్రాచీన కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన ఆంధ్రప్రదేశ్‌కు మరో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. రాష్ట్రానికి చెందిన ఆరు బౌద్ధ శిల్పాలు అమెరికా, దక్షిణ కొరియాల్లో అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఇందులో భాగంగా క్రీ.పూ. 200 ఏళ్ల నుంచి క్రీ.శ. 400 ఏళ్ల మధ్య కాలం నాటి రాష్ట్ర ప్రాచీన శిల్ప కళాసంపద ఖండాంతర ప్రజలకు కనువిందు చేయనుంది. ఈ మేరకు న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్.. 'ట్రీ అండ్ సర్పెంట్: ది ఎవల్యూషన్' అనే పేరుతో అంతర్జాతీయ ప్రదర్శనను నిర్వహించనుంది. ఇందులో భాగంగా భారతదేశంలో బౌద్ధానికి పూర్వం నాటి సంస్కృతిని చాటే శిల్పాలు, బౌద్ధం తొలినాళ్లలోని అలంకారిక కళలు, చిత్రాలను ప్రపంచానికి పరిచయం చేయనుంది. ఈ క్రమంలో మన దేశం నుంచి సున్నపురాయి, బంగారం, వెండి, కాంస్యం, రాక్ క్రిస్టల్, ఐవరీ వంటి 140 రకాల శిల్పాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించనున్నారు.

### అంతర్జాతీయంగా రెండు వేదికలపై..

భారతీయ బౌద్ధ శిల్పకళా రూపాల ప్రదర్శనను ముందు అమెరికాలోని న్యూయార్క్‌లో మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్‌లో జూలై 17 నుంచి నవంబర్ 13 వరకు నిర్వహించనున్నారు. ఈ మ్యూజియాన్ని 'ది మెట్' అని పిలుస్తారు. ఇది అమెరికాలో అతిపెద్ద ఆర్ట్ మ్యూజియం. 2022లో 32,08,832 మంది దీన్ని సందర్శించారు. ప్రపంచంలో అత్యధికంగా సందర్శించే ఆర్ట్ మ్యూజియంల జాబితాలో ఇది ఎనిమిదో స్థానంలో ఉంది. యూఎస్‌లో అయితే రెండో స్థానంలో నిలుస్తోంది. అమెరికాలో ప్రదర్శన ముగిశాక తర్వాత దక్షిణ కొరియాలో నేషనల్ మ్యూజియం ఆఫ్ కొరియాలో డిసెంబర్ 22 నుంచి 2024 ఏప్రిల్ 14 వరకు శిల్పాలను ప్రదర్శించనున్నారు. ఇందుకోసం మెట్రోపాలిటన్ మ్యూజియం 'స్టార్ వరల్డ్ వైడ్' సంస్థకు పురాతన కళా రూపాలను తరలించే బాధ్యతను అప్పగించింది. దీనికి మనదేశంలో నేషనల్ మ్యూజియం నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది.

### రాష్ట్రం నుంచి ఆరు విగ్రహాలు

అంతర్జాతీయ ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ నుంచి వేల సంవత్సరాల క్రితం నాటి ఆరు తెల్లటి పాలరాతి విగ్రహాలను ఎంపిక చేశారు. ఇందులో ఐదింటిని అమరావతి హెరిటేజ్ మ్యూజియం నుంచి, ఒకదాన్ని గుంటూరులోని బౌద్ధశ్రీ పురావస్తు మ్యూజియం నుంచి తరలించనున్నారు. ఇందుకు ఇప్పటికే ఏపీ ప్రభుత్వం అనుమతులు సైతం మంజూరు చేసింది. మన రాష్ట్రంలో అమరావతి ప్రాంతానికి అంతర్జాతీయ బుద్ధిజం కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. బుద్ధుడు తన శిష్యులకు ఇక్కడే 10 ధరణిలు (మంత్రాలు) బోధించారని.. అందుకే అమరావతి ప్రాంతం ధరణికోటగా పేరొందినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. కాలచక్ర యానం కూడా ఇక్కడి నుంచే ప్రారంభమైందని బౌద్ధులు దృఢంగా విశ్వసిస్తున్నారు. కాగా ప్రదర్శనకు తెలంగాణ నుంచి తొమ్మిది శిల్పాలను ఎంపిక చేశారు.

### ఏపీ విగ్రహాల్లో విశిష్టతలు

తొలి బౌద్ధ కళల్లో అలంకరణ ముఖ్యంగా కనిపిస్తోంది. అందమైన పువ్వులు, తీగల అల్లికలు, పూర్ణకుంభం, విజ్ఞాన, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకగా కొలిచే గుర్రం వంటి చిత్రాలు వంటివి శిల్పాల్లో ఉన్నాయి. ముఖ్యంగా శిల్పాలపై చెక్కిన ఆరాధకుల ముఖకవళికల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తాయి. మహాపురుషుని రూపం, యక్షుల చిత్రాలు, బౌద్ధంలోని వివిధ సంఘటనలను తెలిపే స్థూపం, ఒకే శిలపై సింహం తల, మొసలి, చేప, ఏనుగు తొండం రూపంలోని వాహనంపై సవారీని ప్రతిబింబించే దృశ్యాలున్నాయి.

> గొప్ప కళా సంపదకు నిలయం..
>
> బుద్ధుడి ఆనవాళ్లు ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా ఉన్నాయి. అమరావతి, నాగార్జునకొండ ప్రాంతాలు గొప్ప శిల్ప కళా సంపదను నిక్షిప్తం చేసుకున్నాయి. ఇలాంటి ఎన్నో గొప్ప, అరుదైన శిల్పాలను ఏపీ మ్యూజియాల్లో భద్రపరిచాం. వీటిని అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయడం ఎంతో గర్వకారణం.
>
> – జి.వాణీమోహన్, కమిషనర్, ఏపీ పురావస్తు, ప్రదర్శనశాలలు

# ఉద్దానం ఫేజ్–2కు రెడీ

▶ మొదటి పేజీ తరువాయి

మూడునెలలకే రూ.700 కోట్లతో పలాస, ఇచ్ఛాపురం రెండు మున్సిపాలిటీలతో పాటు ఆ ప్రాంతంలోని ఏడు మండలాల పరిధిలోని 807 గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించే ఉద్దానం ఫేజ్–1 రక్షిత మంచినీటి పథకానికి 2019 సెప్టెంబరు 6న ప్రభుత్వం మంజూరు చేసింది. 2020 ఆరంభంలోనే పనులను కూడా మొదలుపెట్టింది. ఇప్పటికే ఈ పనులు 90 శాతానికి పైగా పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దీనికి అనుసంధానంగా ఇప్పుడు ఆ ప్రాంతంలోని మరో ఐదు మండలాల ప్రజలకు కూడా తాగునీరు అందించే పథకానికి ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఆ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను కూడా మొదలుపెట్టింది. రూ.265 కోట్లతో చేపట్టే ఉద్దానం ఫేజ్–2 పనుల టెండరు డాక్యుమెంట్ ప్రస్తుతం జ్యుడీషియల్ ప్రివ్యూ పరిశీలనలో ఉంది. మే 4 వరకు అభ్యంతరాల స్వీకరణ అనంతరం జ్యుడీషియల్ ప్రివ్యూ తుది ఆమోదం అనంతరమే టెండర్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 'సాక్షి'కి వివరించారు.

**'హిరమండలం' నుంచి నీటి తరలింపు..**

ఉద్దానం మొదటి దశ, రెండో దశ మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ముందస్తు జాగ్రత్తలు కూడా తీసుకుంటోంది. ఉద్దానానికి అతి సమీపంలో ఉండే బహుదా, మహేంద్రతనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశమున్నా వేసవిలో ఆ నదులు ఎండిపోతుండడంవల్ల అక్కడ ప్రజలు తిరిగి బోరు నీటినే తాగక తప్పని పరిస్థితి ఉంటుందేమోనని ప్రభుత్వం అనుమానిస్తోంది. దీంతో కొంత అదనపు ఖర్చయినా ఏడాది పొడవునా నీరు అందించే అంశంపై దృష్టిపెట్టింది. దీంతో ఉద్దానానికి దాదాపు వంద కిలోమీటర్ల దూరంలోని హిరమండలం రిజర్వాయర్ నుంచి పైపులైను ద్వారా నీటిని తరలించి మిలియకుట్టి మండల కేంద్రం వద్ద ఆ నీటిని ఇసుక ఫిల్టర్ల ద్వారా శుద్ధిచేసి, అక్కడి ప్రజలకు ఏడాది పొడువునా తాగునీరు అందించాలని సంకల్పించింది. ఇప్పుడు రెండో దశ ప్రాజెక్టులో కొన్ని ప్రాంతాలకు కూడా నేరుగా రిజర్వాయర్ నుంచే తాగునీటి సరఫరాకు ఏర్పాట్లుచేశారు. హిరమండలం రిజర్వాయర్‌లో ఏటా 19.5 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని, అందులో 1.12 టీఎంసీల నీటిని ఉద్దానం ఫేజ్–1 ద్వారా ఆ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలకు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు కొత్తగా రూ.265 కోట్లతో చేపట్టే ఉద్దానం రెండో దశ ప్రాజెక్టుకు 0.291 టీఎంసీల నీటిని వినియోగించుకోనున్నారు. వచ్చే 30ఏళ్లలో పెరిగే జనాభాకు తగ్గట్టుగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు.

## 'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు అభినందనలు



ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన మౌనిక, కోన హారికను అభినందిస్తున్న మంత్రి బొత్స, చిత్రంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**దేవరపల్లి:** కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించారని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని మౌనిక (968), దేవరపల్లి మండలం యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కోన హారిక (939)లను మంత్రి బొత్స శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్రశంసించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) విద్యార్థినులను మంత్రి బొత్స వద్దకు తీసుకువెళ్లి వారు సాధించిన ప్రతిభను వివరించారు. సామాన్య కుటుంబానికి చెందిన బాలికలు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుని అత్యధిక మార్కులు సాధించారని ఆయనకు తెలిపారు. దీనిపై బొత్స స్పందిస్తూ.. విద్యార్థినుల ఉన్నత చదువులకు సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. కాగా యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వెల్లడించారు.

## విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక కంపెనీని ఏర్పాటుచేసింది. మే 3న అదానీ గ్రూపు అధికారుల సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డేటా సెంటర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేయనున్నారు.

**ఏడేళ్లలో 39,815 మందికి ఉద్యోగాలు**

ఉద్యోగాల కల్పన ఆధారంగానే రాయితీలు, ప్రోత్సాహకాలను ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వీటీపీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు దశల్లో ప్రాజెక్టును ఏడు సంవత్సరాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇక ఈ ప్రాజెక్టు ద్వారా 39,815 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తామని వీటీపీఎల్ సమర్పించిన ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొంది. తొలిదశ మూడేళ్ల కాలంలో కనీసం 40 మెగావాట్ల డేటా సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 30 శాతం మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించాల్సి ఉంటుందని ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. నాలుగేళ్లల్లో 50 శాతం మందికి ఉపాధి కల్పించడంతో పాటు ఏడేళ్లలో పూర్తిగా అందరికీ ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. 300 మెగావాట్ల డేటా సెంటర్ ద్వారా ప్రత్యక్షంగా 1,860 మందికి ఉపాధి లభించనుండగా, ఐటీ బిజినెస్ పార్క్ ద్వారా 32,000 మందికి పైగా ఉపాధి లభించనుంది. అలాగే, స్కిల్‌కాలేజీ, రిక్రియేషన్ సెంటర్స్ ద్వారా మరో 3,000 మంది వరకు ఉపాధి లభించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలుత కేటాయించిన 130 ఎకరాల్లో 82 ఎకరాలు డేటా సెంటర్‌కు, ఐటీ బిజినెస్ పార్కుకు 28 ఎకరాలు, స్కిల్ కాలేజీకి 11 ఎకరాలు, రిక్రియేషన్ సెంటర్‌కు 9 ఎకరాలను కేటాయించింది.

## ఇంటర్ ఫెయిలైనవారికి భరోసా

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, రెసిడెన్షియల్ కోచింగ్
- సర్క్యులర్ జారీ

**సాక్షి, అమరావతి:** ఇంటర్ పరీక్షల్లో ఫెయిలై అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు విద్యా శాఖ శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌ల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ శాఖల ఆధీనంలో పనిచేస్తున్న కళాశాలల్లోని విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని మంత్రి బొత్స సూచించారు. మే 1 నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు శిక్షణ ఉండేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

**అధికారులకు విద్యా శాఖ సూచనలు..**

- ఇంటర్ ఫెయిల్ వారి జాబితాను సిద్ధం చేయాలి.గ్రూపులు, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి.
- ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి.. వారు ఎంపిక చేసుకున్న కళాశాలలో శిక్షణా తరగతులకు హాజరయ్యేలా చూడాలి.
- విద్యార్థులు ప్రభుత్వ/ఎయిడెడ్ లేదా ఇతర ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కడైనా డే స్కాలర్‌గా లేదా హాస్టలర్‌గా శిక్షణా తరగతులకు హాజరు కావచ్చు.
- అన్ని జిల్లా వృత్తి విద్య, ప్రాంతీయ తనిఖీ అధికారులు ప్రత్యేక శిక్షణా తరగతులు, వాటి పనితీరు, విద్యార్థుల హాజరును పర్యవేక్షించాలి.

అపేక్ష లేనివాడు, శుచియైన వాడు, దక్షత కలవాడు,
ఉదాసీనుడు, వ్యథలు నశించిన వాడు, అన్ని విధాలైన కార్యాలలో
నేను చేస్తున్నాననే భావం లేనివాడు నాకు ప్రియుడు.
– భగవద్గీత



సాక్షి

శనివారం, ఏప్రిల్, 29

# నెత్తురు చిందిన బస్తర్

చెప్పుకోదగ్గ హింసాత్మక ఘటనలు లేకుండా కనీసం రెండేళ్లనుంచి ప్రశాంతంగా కనబడుతున్న ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం నక్సలైట్లు ఐఈడీ పేల్చి మినీ బస్సులో వెళ్తున్న పదిమంది జిల్లా రిజర్వ్ గార్డ్(డీఆర్‌జీ) పోలీసులనూ, ఒక డ్రైవర్‌నూ హతమార్చిన ఉదంతం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఆ రాష్ట్రంలోని దంతేవాడ జిల్లా పల్నార్–అరణ్‌పూర్ మధ్యలో ఇటీవలే నిర్మించిన రహదారిపై ఈ ఐఈడీని అమర్చారనీ, అది కూడా రెండు మూడురోజుల క్రితమేననీ వస్తున్న కథనాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఆదివాసీల హక్కుల కోసం తుపాకులు పట్టామని చెబుతున్న మావోయిస్టుల్లోగానీ, వారిని ఎదుర్కొంటున్న భద్రతా బలగాల తీరులోగానీ ఏ మార్పూ రాలేదని తాజా ఘటన చెబుతోంది. ఒకప్పుడు దేశంలోని చాలా రాష్ట్రాల్లో ప్రభావవంతంగా ఉన్న వామపక్ష తీవ్రవాదం చాన్నాళ్లుగా తగ్గుముఖం పట్టింది. 2000కు ముందు పది రాష్ట్రాల్లోని 200 జిల్లాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తిస్తే ఆ సంఖ్య 2021 నాటికి 41కి పడిపోయిందంటున్నారు. ఇప్పుడది 25 జిల్లాలకు మాత్రమే పరిమితమైందనీ, గత ఎనిమిదేళ్లలో నక్సల్ సంబంధిత హింసాత్మక ఘటనలు 55 శాతం తగ్గాయనీ, మరణాలు కూడా 63 శాతం తగ్గాయనీ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నాలుగు నెలల క్రితం విడుదల చేసిన నివేదిక తెలిపింది. హింసను కట్టడి చేయటానికి అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటూనే అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న పర్యవసానంగా మావోయిస్టుల లొంగుబాట్లు కూడా అధికంగానే ఉన్నాయని ఆ నివేదిక వివరించింది.

అయితే ఇలాంటి విజయాలే పోలీసు బలగాల్లో ఒక రకమైన నిర్లక్ష్యానికి దారితీశాయా అన్నది ఆలోచించుకోవాలి. తాజా ఉదంతాన్నే తీసుకుంటే అరణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టుల కదలికలున్నాయని అందిన సమాచారంతో డీఆర్‌జీ పోలీసులు అక్కడికి వెళ్లారు. వెళ్లేముందూ, తిరిగొచ్చేటప్పుడూ ఒకే మార్గాన్ని ఉపయోగించకూడదన్న నిబంధన ఉంది. ఒకవేళ తప్పనిసరైతే రెండుసార్లూ బలగాల కన్నా ముందు ఒక ప్రత్యేక టీం వెళ్లి ఆ దారిలో మందుపాతరలు, ఇతరత్రా బాంబులు లేవని నిర్ధారించాలి. పైగా ఈమధ్యకాలంలో మావోయిస్టుల వైపునుంచి ఐఈడీల వినియోగం బాగా ఎక్కువైందని తెలుస్తూనే ఉంది. గత నాలుగు నెలల్లో ఐఈడీలు గుర్తించి వెలికితీసిన ఉదంతాలు 34 వరకూ ఉన్నాయని వార్తలు వెలువడ్డాయి. గతంలో భారీయెత్తున ఆదివాసీలను సమీకరించి పోలీసు బలగాలపై విరుచుకుపడిన మావోయిస్టులు ఇటీవల తక్కువమందితో బృందాలను ఏర్పాటుచేసి దాడులకు దిగుతున్నారని ఒక మీడియా కథనం తెలిపింది. పైగా లోగడ కేవలం అయిదారు కేజీల ఐఈడీని పేలుళ్లకు వినియోగిస్తే ఇప్పుడది 30, 40 కేజీలవరకూ ఉంటోంది. అందువల్ల ప్రాణనష్టం అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. దీన్ని గమనించి అయినా అరణ్‌పూర్ వెళ్లిన డీఆర్‌జీ పోలీసులు తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాల్సింది. ఒకప్పుడు లొంగిపోయిన ఆదివాసీలతో సల్వాజుడుం పేరుతో ప్రైవేటు దళాలను ఏర్పాటుచేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో వాటిని రద్దుచేయక తప్పలేదు. ఆ తర్వాతే ఛత్తీస్‌గఢ్ పోలీసు విభాగంలో డీఆర్‌జీ పేరుతో ప్రత్యేక దళం ఏర్పాటయింది. ఇందులో కూడా అత్యధికులు లొంగిపోయిన మావోయిస్టులు. వారంతా ఆదివాసీలు. కనుక మావోయిస్టులకు వారిపై గురి ఉంటుంది. అటువంటప్పుడు ఎంత అప్రమత్తంగా ఉండాలి? ఘటన జరిగిన ప్రాంతంలో ఒకప్పుడు మావోయిస్టులు బలంగా ఉండేవారనీ, ఇప్పుడు వారి ప్రభావం పూర్తిగా పోయిందనీ మీడియా కథనాలు చెబుతున్నాయి. డీఆర్‌జీ పోలీసుల్లో నిర్లక్ష్యానికి అది కూడా కారణమైవుండొచ్చు.

ఒకప్పుడు మధ్య, తూర్పు భారత ప్రాంతాల్లో ఎంతో బలంగా ఉన్న తాము ఎందువల్ల బలహీనపడవలసి వచ్చిందన్న ఆత్మవిమర్శ మావోయిస్టుల్లో కొరవడిందని తాజా ఉదంతం చెబుతోంది. హింసాత్మక ఘటనలకు పాల్పడటం వల్ల ప్రభుత్వాలు మరింత కఠినంగా వ్యవహరిస్తాయే తప్ప దానివల్ల కలిగే మార్పేమీ ఉండదని పదే పదే రుజువవుతోంది. మావోయిస్టులు ఏదో ఒక చర్యకు పాల్పడగానే సమీప ప్రాంతాల్లోని ఆదివాసీ ప్రాంతాలపై పోలీసులు విరుచుకుపడటం, అమాయకులు సైతం బాధితులుగా మారడం చాన్నాళ్లుగా కనబడుతూనే ఉంది. అరెస్టులు, కేసులు, ఏళ్ల తరబడి జైళ్లపాలు కావటం పర్యవసానంగా ఆదివాసీ కుటుంబాల జీవనం అస్తవ్యస్తమవుతోంది. పోషించేవారు లేక ఎన్నో కుటుంబాలు చెప్పనలవికాని ఇబ్బందులు పడుతున్నాయి. గతంతో పోలిస్తే మావోయిస్టుల ప్రభావంలో ఉన్న ప్రాంతాలు తగ్గిపోవడానికి ఇదొక ప్రధాన కారణం. కనీసం ఈ పరిణామమైనా తమ హింసాత్మక చర్యల్లోని నిరర్థకతపై పునరాలోచన కలిగిస్తే బాగుండేది. కానీ ఆ మాదిరి మార్పు రాలేదని ఈ ఉదంతం నిరూపించింది. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను ప్రకటించటానికి, ప్రభుత్వ విధానాల్లో లోపాలున్నాయనుకున్నప్పుడు వాటికి వ్యతిరేకంగా ప్రజానీకాన్ని కూడగట్టడానికీ ఎప్పుడూ అవకాశాలుంటాయి. అలాంటి ఉద్యమాలను ప్రభుత్వాలు అణచివేయటానికి ప్రయత్నించినప్పుడు ప్రతిఘటన కూడా అదే స్థాయిలో వస్తున్నది. సాగు చట్టాలపై ఏడాదిపైగా సాగిన రైతు ఉద్యమాన్ని నయానా భయానా నియంత్రించాలనుకున్న కేంద్రం చివరకు వారి డిమాండ్లకు తలొగ్గి ఆ చట్టాలను వెనక్కి తీసుకోకతప్పలేదు. వీటన్నిటినీ మావోయిస్టులు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజా ఉద్యమాలను నిర్మించే ప్రయత్నం చేయాలి. తమ హింసాత్మక చర్యలవల్ల సాధించేదేమీ లేకపోగా ఆదివాసులే కష్టనష్టాలు అనుభవించాల్సి వస్తున్నదని గుర్తించాలి.

# డాన్లు–గాడ్‌ఫాదర్ల లంకె ఛేదించాలి!

విశ్లేషణ



ప్రకాశ్ సింగ్

**ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ నేతల పోషణలో, ప్రభుత్వ సంస్థల సంబంధంలో ఉంటూ మాఫియా ఇంతకాలం పెరుగుతూ వచ్చింది. పోలీసు శాఖ, బ్యూరోక్రసీ దశాబ్దాలుగా మాఫియాతో పరస్పర ప్రయోజనకరమైన సహజీవనంలో భాగమైపోయాయి. ఈ సంబంధం దేశంలోని పలు ప్రాంతాల్లో కాలానుగుణంగా పేరుమోసిన డాన్లను సృష్టిస్తూ వచ్చింది. చేదు వాస్తవం ఏమిటంటే– నేరస్థులు, రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారుల మధ్య గల ఈ సంబంధాన్ని ఛేదించనట్లయితే... చట్టసభల్లోకి నేరస్థుల ప్రవేశాన్ని నిరోధించడానికి తగు చర్యలు చేపట్టనట్లయితే, నేర న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయనట్లయితే, బాహ్య ఒత్తిళ్ల నుంచి పోలీసులను బయటపడవేయనట్లయితే... పరిస్థితి మరింత ఘోరంగా దిగజారిపోతుంది.**

పోలీసు శాఖలో కొనసాగిన నా 35 సంవత్సరాల సర్వీసులో, సరైనవిధంగా కానీ, తప్పు పద్ధతిలో కానీ ఒక మాఫియా డాన్‌ను చంపిన ఘటన సాధారణ ప్రజానీకంలో ఇంత ఆసక్తిని రేకెత్తించి, ఇంత వివాదాన్ని సృష్టించిన ఉదంతం నాకయితే గుర్తు లేదు. నిజానికి, సీన్ నుంచి కీలక పాత్రధారులను పక్కనబెట్టి, జరుగుతున్న సందడిని మాత్రమే ఎవరైనా గమనించినట్లయితే, ఆ శోధన ఒక పాపులర్ నేత హత్యకు గురయ్యాడన్న ముగింపునకు వచ్చి ఉండేది. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనల తీవ్రత కంటే ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని పట్టాలు తప్పించేందుకు ప్రతిపక్షం ప్రదర్శిస్తున్న కృతనిశ్చయాన్ని అది ఎక్కువగా ప్రతిఫలించి ఉండేది.

నిర్దిష్ట వివరాల్లోకి వస్తే, 1993 నాటికే... ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖులతో సంబంధాలను కలిగి, వారి రక్షణలో ఉంటున్న మాఫియా సంస్థల కార్యకలాపాల గురించిన సమాచారాన్ని పొందడానికి నాటి ప్రభుత్వం ఎన్.ఎన్. వోహ్రా కమిటీని నియమించింది. దీనిపై పని ప్రారంభించిన కమిటీ, 'ప్రభుత్వ యంత్రాంగానికి ప్రాసంగికత లేకుండా చేసి, మాఫియా నెట్‌వర్క్ వాస్తవానికి ఒక సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతోంది' అని తేల్చిచెప్పింది. ఈ కమిటీ అంతిమంగా కొన్ని సిఫార్సులను చేసింది. కానీ వాటిపై తదుపరి కార్యాచరణ లేకుండాపోయింది. పార్లమెంటులో దీనిపై తీవ్ర చర్చోపచర్చలు జరిగాయి. అయినా ఫలితం లేదు. క్రమంగా పోలీసు శాఖ, బ్యూరోక్రసీ ఈ పరస్పర ప్రయోజనకరమైన సహజీవనంలో భాగమైపోయాయి. ఈ అక్రమ సంబంధం దేశంలోని పలు ప్రాంతాల్లో కాలానుగుణంగా పేరుమోసిన మాఫియా డాన్లను సృష్టిస్తూ వచ్చింది. యూపీలో ముఖ్తార్ అన్సారీ, అతీఖ్ అహ్మద్, శ్రీ ప్రకాశ్ శుక్లా వంటి వారిని ఉదాహరణగా చెప్పవచ్చు.

## ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మూలించాలి

ఈ సంబంధాన్ని ఎలా ఛేదించవచ్చు? మొదటగా, మాఫియాను రాజకీయ నాయకులు పోషిస్తూ, కాపాడటాన్ని తప్పకుండా నిలిపివేయాలి. రెండు, దాని ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మూలించాలి. మూడు, మాఫియా డాన్లను చట్టానికి జవాబుదారీగా చేయాలి. నాలుగు, ఈ అవినీతి సంబంధంలో భాగంగా ఉన్న పోలీసు అధికారులు, బ్యూరోక్రాట్ల రెక్కలు కత్తిరించాలి. ఈరోజు ఉత్తరప్రదేశ్‌లో మాఫియాకు అత్యున్నత స్థాయిలో ఎలాంటి రాజకీయ రక్షణా లేకుండా పోయింది. దాని ఆర్థిక సామ్రాజ్యాన్ని గణనీయంగా తగ్గించివేశారు. యూపీ పోలీసుల ప్రకారం– అతీఖ్ అహ్మద్, అతడి కుటుంబ సంపదలో రూ.1,169.20 కోట్లను జప్తు చేయడం, స్వాధీనపర్చుకోవడం లేదా నాశనం చేయడం జరిగింది. దీనికి తోడుగా, 12 మంది ముఠా నేతలు, వారి 29 మంది అనుయాయులకు శిక్ష పడేలా చేశారు.



ముఖ్తార్ అన్సారీకి పదేళ్ల జైలుశిక్ష పడగా, అతీఖ్ అహ్మద్‌కు యావజ్జీవం పడింది. ఎట్టకేలకు న్యాయచక్రాలు కదలడం ప్రారంభించాయి.

అయితే ఈ మార్గం సజావుగా లేదు. ఏప్రిల్ 15న అతీఖ్ అహ్మద్, అతడి సోదరుడు అష్రఫ్‌ను తప్పనిసరి వైద్య పరీక్షలకు తీసుకువెళ్తుండగా ముగ్గురు గుర్తు తెలియని యువ నేరస్థులు వారిని కాల్చిచంపారు. నిందితులకు రక్షణగా ఉంటున్న భద్రతా సిబ్బంది చేష్టలుడిగి చూస్తుండిపోయారు. వారి స్పందన పేలవంగా ఉండిపోయింది. జరిగింది దురదృష్టకరమైనది. దాన్ని అధిగమించి ఉండవచ్చు. కానీ, ఈ సమయంలో రాష్ట్ర పోలీసులు ఆ నేరంలో భాగస్వాములయ్యారని ఆరోపించడం న్యాయం కాకపోవచ్చు.

## న్యాయ విచారణ జరగాలి

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించింది. బాందా, హమీర్‌పుర్, కాస్‌గంజ్ నుంచి వచ్చిన ఈ ముగ్గురు యువకులు ఎలా ఒక్కటయ్యారు? వారిని ఈ పనిలోకి ఎవరు దింపారు? వారి ఉద్దేశం ఏమిటి? వారికి ఎవరు డబ్బులిచ్చారు? వారికి టర్కీ పిస్టల్స్ ఎవరు అందించారు? హత్యాఘటనలో వారు చేసిన నినాదాలను ఎవరైనా వారికి నేర్పించారా వంటి సంబంధిత విషయాలన్నీ న్యాయ విచారణ, పోలీసు దర్యాప్తులో తేలవలసి ఉంది. ఒక్కసారిగా ఫేమస్ అయిపోవాలన్న కోరికతోనే ఈ హత్యలకు పూనుకున్నామని ఈ ముగ్గురు హంతకులు ఇచ్చిన వివరణ నమ్మేలా లేదు.

అతీఖ్ కుమారుడు అసద్ అహ్మద్, అతడి అనుచరుడు గులామ్ హుస్సేన్‌లను ఏప్రిల్ 13న యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎన్‌కౌంటర్ అని చెబుతున్న దానిలో చంపేశారు. 2005లో జరిగిన రాజు పాల్, మరో ఇద్దరు పోలీసుల హత్యలో కీలక సాక్షి అయిన ఉమేష్ పాల్ హత్యతో వీరికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. తాజా ఘటనపై తప్పకుండా న్యాయ విచారణ జరిపించాల్సి ఉంది. ఈలోగా నిందాత్మక క్రీడ మొదలైపోయింది. న్యాయవిచారణ వెల్లడించాల్సింది ఇప్పటికే తెలిసి ఉన్న వాస్తవాలను కాదు. ఒక 'టాంగావాలా' వేలాది కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టేలా, అధికారులు సైతం మోకాళ్లపై వంగేంత అధికార కేంద్రంగా అతగాడిని మార్చేసిన రాజకీయ నేతలు, పార్టీలు ఏవి అనే విషయాన్ని న్యాయవిచారణ బయటపెట్టాల్సి ఉంది.

పాశ్చాత్య మీడియా సైతం ఈ హత్యలకు విశేష ప్రాముఖ్యతనిచ్చింది. కానీ ఈ సందర్భంగా వాటి కపటత్వం బయటపడుతోంది. ఒక మాజీ ఎంపీ హత్యకు గురయ్యాడని 'బీబీసీ' నివేదించడమే కాదు, అతడిని మాఫియా డాన్‌గా కాకుండా రాబిన్ హుడ్‌గా అభివర్ణించింది. 'న్యూయార్క్ టైమ్స్' అయితే, భారత్ చట్టవ్యతిరేక హింసవైపు దిగజారిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. కానీ అమెరికాలోనే ప్రతి సంవత్సరం సగటున వెయ్యి మంది పౌరులు (2022లో 1,096 మంది, 2021లో 1,048 మంది) పోలీసుల కాల్పుల్లో హత్యకు గురవుతున్నారనే విషయాన్ని మర్చిపోయింది.

## ఇది సమష్టి బాధ్యత

మరోవైపున జరిగిన తప్పులన్నింటి భారాన్ని పోలీసులు మోయవలసి వస్తోంది. బహుశా అందుకు వారు అర్హులే కావచ్చు. రాజకీయ వర్గానికి కూడా కొంత జవాబుదారీతనం ఉండకూడదా? మాఫియాను పెంచి పోషించింది వారే మరి. ఈ విషయంలో న్యాయ వ్యవస్థకు కూడా జవాబుదారీతనం లేదా? మునుపటి అలహాబాద్ జిల్లాలో నేర న్యాయ యంత్రాంగానికి జిల్లా కలెక్టర్లు నేతృత్వం వహిస్తున్న సమయంలోనే అతీఖ్ అహ్మద్ పెరిగాడు. అతీఖ్, అతడి అనుయాయులపై ఉన్న 54 కేసులు ఇప్పటికీ విచారణ దశలోనే ఎందుకు ఉంటున్నాయి? అందులో 1979 నాటి పాత హత్య కేసు కూడా ఉందని గుర్తించాలి.

దేశంలో నేర న్యాయవ్యవస్థ వాస్తవానికి కుప్పగూలిపోతోందని జస్టిస్ వీఎస్ మలిమథ్ 2003 లోనే హెచ్చరించారు. మరి దిద్దుబాటు చర్యలు చేపట్టారా? పోలీసు సంస్కరణలపై సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడం గురించి ఎవరైనా పట్టించుకున్న పాపాన పోయారా? చేదు వాస్తవం ఏమిటంటే– నేరస్థులు, రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారుల మధ్య సంబంధాన్ని మనం ఛేదించనట్లయితే... శాసనసభలు, పార్లమెంట్‌లోకి నేరస్థుల ప్రవేశాన్ని నిరోధించడానికి మనం తగిన చర్యలు చేపట్టనట్లయితే, నేర న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయనట్లయితే, బాహ్య ఒత్తిళ్ల నుంచి పోలీసులను బయటపడవేయనట్లయితే పరిస్థితి మరింత ఘోరంగా దిగజారిపోతుంది!

వ్యాసకర్త మాజీ పోలీసు అధికారి;
పోలీసు సంస్కరణల కోసం పనిచేస్తున్నారు.
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### అసలు సంగతి



ఆహార పరిశ్రమ కథనం ఇలా ఉంటుంది. మీకు పీచు కావాలా? ఓట్స్ తినండి. పాలీఫెనాల్స్ కావాలా? గ్రీన్ టీ తాగండి. యాంటీఆక్సిడెంట్లు కావాలా? డార్క్ చాకొలేట్ తినండి. ఈ పోషకాలన్నీ ఉండేదేమిటో తెలుసా? మామిడి. సమస్యల్లా రైతులు ప్రకటనలు ఇవ్వలేరు, సమావేశాలను నిర్వహించలేరు.

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

### సురక్షితం అనుకోలేం



క్యాబ్‌లో ప్రయాణిస్తున్నప్పుడు తమ భద్రత పట్ల ఏ ఆందోళనా లేకుండా నిద్రలోకి జారుకోవడం అనేది కేవలం మగవాళ్లకే సాధ్యం. అయినా జనం ప్రపంచమంతా సమానం అయిందని చెప్పి, అసలైనది విస్మరిస్తారు. ప్రతీక్షణం జాగ్రత్తగా ఉండటమనేది మనిషిని తినేస్తుంది.

– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

### థాంక్యూ ఇండియా



ఖార్తూమ్ (సూడాన్) ఫ్రెంచ్ ఎంబసీలోని స్థానిక ఉద్యోగి, ఆమె కుటుంబాన్ని భారత విమానంలో తరలించినందుకు భారత్‌కు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇండో–ఫ్రెంచ్ సంఘీభావం ఎప్పుడూ తొట్రుపడదు.

– ఇమాన్యుయెల్ లెనైన్, భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి

### సానుభూతి లేదా?



తన సహ మహిళా అథ్లెట్లు ఏడ్చేలా చేసినందుకు పీటీ ఉషకు అభినందనలు. చెప్తుంటారు గదా, మహిళలకు పెద్ద శత్రువు మరో మహిళే!

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

### సిగ్గుచేటు



లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ అథ్లెట్లు వీధులకెక్కాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటు. అయినా నిందిత బీజేపీ ఎంపీని ప్రభుత్వం ఎప్పటికప్పుడు కాపాడుతోంది.

– స్వర భాస్కర్, నటి

ఇన్‌బాక్స్

## పరిణామం తెలియొద్దా?

కేంద్ర ప్రభుత్వం హిందూ ఆధిపత్య ఎజెండాను అనుసరిస్తున్నందున పాఠ్యపుస్తకాల నుండి ముఖ్యమైన చారిత్రక, శాస్త్రీయ వాస్తవాలను తొలగిస్తోంది. 2018లో బీజేపీ రెండవసారి అధికారంలోకి రావడానికి ఒక ఏడాది ముందు, అప్పటి విద్యా మంత్రి భారతీయులు హిందూ 'ఋషుల' వారసులనీ, కోతులు కాదని తాను నమ్ముతున్నాననీ చెప్పారు. 2021–22 విద్యా సంవత్సరం నాటికి తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు పరీక్షా సిలబస్ నుంచి 'డార్విన్ సిద్ధాంతా'న్ని తొలగించారు. 2022–23 నాటికి, పాఠశాల పాఠ్యపుస్తకాల నుండి 'పరిణామం' అంశాన్ని పూర్తిగా తొలగించింది ప్రభుత్వం.

పాఠ్యపుస్తకాల్లో మార్పులను ఫెడరల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలోని కేంద్ర విద్యా శాఖ 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' (ఎన్‌సీఈఆర్‌టీ) సూచించింది. ఇందువల్ల దేశంలో 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' (సీబీఎస్‌ఈ)కి అనుబంధంగా ఉన్న 24,000 పైగా పాఠశాలల్లో చదువుతున్న 10 లక్షల మంది ఈ పరిణామవాదాన్ని తెలుసుకునే అవకాశం లేదు. అలాగే సీబీఎస్‌ఈ ప్రపంచవ్యాప్తంగా 26 దేశాలలో దాదాపు 240 అనుబంధ పాఠశాలలను కలిగి ఉంది. అంతేకాక భారత్‌లోని 14 రాష్ట్రాలలో కనీసం 19 పాఠశాల బోర్డులు తరగతి గదులలో ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలను కూడా ఉపయోగిస్తాయి. ఎన్‌సీఈఆర్టీ చర్యను సైన్స్ కమ్యూనిటీ నిందించింది. ఇది 'విద్యకు అపహాస్యం' అని పేర్కొంటూ, దేశవ్యాప్తంగా 1,800 మంది ఎన్‌సీఈఆర్టీని విమర్శిస్తూ బహిరంగ లేఖ రాశారు. 'జీవ ప్రపంచం నిరంతరం మారుతున్న వాస్తవం, పరిణామం అనేది దైవిక జోక్యం అవసరం లేని చట్టం– నిర్వహణ ప్రక్రియ. మానవులు కొన్ని జాతుల కోతి నుండి ఉద్భవించారని డార్విన్ తన 'సహజ ఎంపిక' సిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పటి నుండి హేతుబద్ధమైన ఆలోచనకు ఈ సిద్ధాంతం మూలంగా నిలిచింది. అలాంటి సిద్ధాంతాన్నీ, ముస్లింపాలకుల కొన్ని ఘట్టాలను తొలగించటం ఎంత వరకు సమంజసం?

– డా. ముచ్చుకోట సురేష్ బాబు,
అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక

# లంగరు వేసుకుని చేసేది పాలన కాదు!

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

మరో పదమూడు మాసాలకు రాష్ట్ర విభజన జరిగి ఒక దశాబ్దకాలం పూర్తవుతుంది. ఇదే కాలంలో కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం– 'జీ20' అధ్యక్ష స్థానానికి ఎదిగింది. సాధారణంగా ప్రభుత్వ అధినేతలు ఇటువంటి ఎదుగుదలను తమ ఖాతాలో వేసుకుంటారు. అది సహజమే అయినా తాత్కాలికం. చరిత్ర రచన– 'ఎవరి కాలంలో అని కాకుండా, ఏ కాలంలో ఏమి జరిగింది?' అనే ప్రతిపాదికగానే సాగుతుంది. దానికి కారణం, ప్రభుత్వాల నిర్ణయాల 'వెనుక–ముందు' అందుకు దోహదం చేసే అంశాల తాకిడి అదృశ్యంగా కొన్ని కొన్నిసార్లు నిలువరించలేనంత బలంగా ఉంటుంది. ఉదాహరణకు ఇందిరాగాంధీ తొలి 'టర్మ్'ను (1966–77) 'వెల్ఫేర్ ఎరా' అంటున్నంత మాత్రాన, దానికి ముందున్న రెండు దశాబ్దాల పరిణామాల్ని విస్మరించడానికి కుదరదు. అలాగే– మరో రెండు దశాబ్దాల తర్వాత 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మళ్ళీ గతాన్ని గుర్తుచేస్తూ – 'ఇందిరమ్మ రాజ్యం – ఇంటింటా సౌభాగ్యం' అంటూ రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడంలో ఉన్నది, రెండు వేర్వేరు కాలాల మధ్య ఉన్న ఒక – నిరంతరత్వం!

ఈ రెండు సందర్భాల్లో కూడా ప్రభుత్వం ప్రజలకు చేరువ కావడం కనిపిస్తుంది. ఇటువంటి కొన్ని మినహాయింపులు కూడా చరిత్రలో నమోదు అవుతుంటాయి. ఇక్కడ – 'ప్రభుత్వం' ప్రజలకు చేరువ కావడం అంటే, అంతిమంగా – 'రాజ్యం' ('స్టేట్') ప్రజలకు చేరువ కావడం అని అర్థం చేసుకోవాలి. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 13 జిల్లాలు ఉన్న రాష్ట్రాన్ని గత ఏడాది రిపబ్లిక్ దినోత్సవం నాడు 26 జిల్లాల రాష్ట్రంగా చేసింది. అందువల్ల, మునుపున్న ఒక్కొక్క జిల్లా రెండై – వాటికి ఇప్పుడు ఇద్దరు కలెక్టర్లు, ఇద్దరు ఎస్పీలు వచ్చారు. అలా ఈ 'ప్రభుత్వం' ప్రజలకు 'రాజ్యాన్ని' చేరువ చేసి, 'బ్యూరోక్రసీ' (పరిపాలన యంత్రాంగం) ద్వారా తాను కూడా మరింత దగ్గరయింది.

ఇప్పుడీ ఉపోద్ఘాతం ఎందుకు అవసరం అయింది అంటే... ఏప్రిల్ మొదటి వారంలో జరిగిన– 57 మంది ఐఏఎస్, 39 మంది ఐపీఎస్ అధికారుల బదిలీల్లో ఏడాది క్రితం కొత్తగా ఏర్పడిన జిల్లాల– కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలు ఉన్నారు. పొరుగు రాష్ట్రాలతో మనం సరిహద్దు పంచుకొంటున్న – పార్వతీపురం మన్యం జిల్లా, పాడేరు–అల్లూరి జిల్లా (ఒడిస్సా), అన్నమయ్య జిల్లా (తమిళనాడు), సత్యసాయి జిల్లా (కర్ణాటక) వంటివి కూడా ఉన్నాయి. ఉంటే ఏమైంది? దీన్ని– నాలుగేళ్ల క్రితం గ్రామ సచివాలయాలతో మొదలైన పరిపాలన



సంస్కరణల ప్రవాహం, రాష్ట్రం 'మ్యాప్' అంచుల్లోని – 'టెయిల్ ఎండ్'కు చేరి (సింక్) ఇంకుతున్నట్టుగా చూడాల్సి ఉంటుంది. కొత్త జిల్లాల వల్ల ప్రజలకు నేరుగా పౌర సేవలు అందించే సచివాలయాల పనిని, జిల్లా కలెక్టర్లు మరింత దగ్గరగా 'మోనిటర్' చేస్తారు. ఈ ఏర్పాటుతో – రాజధానిలో చీఫ్ సెక్రటరీ నుంచి కింద గ్రామ సచివాలయాల వరకు – 'నెట్ వర్క్' అమరిక పూర్తి అయింది.

ఇక్కడొక సందేహం సహజం. స్థిరమైన రాష్ట్ర రాజధాని నగరం అంటూ లేకుండా, ఇంతపెద్ద మానవ వనరుల సమూహాన్ని పరిపాలన యంత్రాంగంలో భాగం చేయడం ఎలా సాధ్యమయింది? ఈ సందేహానికి సమాధానం వెతకడం కోసం లోతైన చర్చ అవసరం.

సంప్రదాయ రాజకీయాల దృష్టి నుంచి– 'ఏపీ హైబ్రిడ్' పరిపాలనను చూసేవారికి, ఇవి అంత తేలిగ్గా నప్పవు కూడా. ఒకప్పుడు పరిపాలన అంటే, రాజధాని 'నగరం'లో లంగరు వేసుకుని కూర్చుని చేసే పని అనేది మనకున్న అవగాహన. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ అవగాహన మేర పాలన సాగిస్తే అభివృద్ధి అంతంత మాత్రమే అవుతుంది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత మళ్ళీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి ఈ సూక్ష్మం గ్రహింపు లేకపోయింది. ఒకప్పుడు మనమే అనుమతించిన– 'టెక్నాలజీ' ఈనాడు మనల్ని కూడా 'అవుట్ డేటెడ్' చేయడం ఇందులో గుర్తించవలసిన మర్మం.

చివరిగా... ప్రపంచీకరణతో వచ్చిన– 'జియో పాలిటిక్స్' వల్ల కేంద్రం 'ఢిల్లీ' విడిచి దేశం అంచు (మార్జిన్స్)లకు చేరడం కొత్త పరిణామం! ఇవి ఇక ఎంతమాత్రమూ ఒకచోట కట్టు కొయ్య పాతుకుని కట్టేసుకుని కూర్చుని పరిపాలన చేసే రోజులు కావు. కనుకనే, ఈ నెల మొదటి వారంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మిజోరాం వెళ్లి రూ. 1.76 లక్షల కోట్లతో ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలను కలుపుతూ – రోడ్లు, రైలు, విమాన సర్వీసులు 2025 లోపుగా పూర్తి చేస్తామని ప్రకటించారు. అక్కడే రూ. 2,500 కోట్లతో చేపట్టే 11 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరో వారానికి ప్రధాని మోదీ గౌహతిలో జరిగిన 'బిహూ' డ్యాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. బ్రహ్మపుత్ర నదిపై నిర్మించే బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు.

ఇక గత ఏడాది చివరి ఆరునెలలు ప్రధాని మోదీతో సహా అరడజను మంది కీలక శాఖల మంత్రులు మన కాకినాడ – విశాఖల మధ్య అధికారిక పర్యటనలు పెట్టుకున్నారు. ఉన్నట్టుండి వీరందరికీ దేశం 'మార్జిన్స్' ఎందుకు ముఖ్యమయ్యాయి? ఈ ప్రశ్నకు సమాధానం – 'మార్జినల్ సెక్షన్స్' సీఎంగా పేరుపడ్డ వైఎస్ జగన్ వద్ద దొరకవచ్చు!

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక అంశాల విశ్లేషకులు

# ప్రజల మన్నన చూరగొంది!

సందర్భం



పురిఘళ్ల రఘురామ్

ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడినే ప్రజలు అనుసరిస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన కార్యక్రమాలు ఆయనను దేశ ప్రజల హృదయాల్లో తిరుగు లేని నాయకుణ్ణి చేశాయి. ముఖ్యంగా మోదీ క్రమం తప్ప కుండా, నెలకు ఒకమారు చొప్పున నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' ఆయనకు చిరకీర్తిని ఆర్జించి పెడుతోంది. ప్రజలతో తన మనోభావాలను పంచుకుంటూ... విభిన్న ప్రాంతాల ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తూ, వారికి దేశంపై ఉన్న విశ్వాసాన్నీ, సమాజం పట్ల ఉన్న అనురక్తినీ, అంకిత భావాన్నీ, బాధ్యతనూ గుర్తు చేస్తూ ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని ముందుకు సాగుతున్నారు. ఏప్రిల్ 30న ఈ కార్యక్రమ 100వ ఎపిసోడ్‌ను నిర్వహించడానికి ప్రధాని సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వాధినేత లేదా దేశాధినేత ఏదో ముఖ్యమైన సందర్భంలో తప్ప ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం మనం చూడలేదు. సాధారణంగా ఆ కార్యక్రమం వారి ప్రసంగంతోనే ముగిసేది. కానీ వారి ప్రసంగ కార్యక్రమంలో దేశ ప్రజలతో ముఖాముఖి మాట్లాడడం; ప్రజల అభిప్రాయాలు, సూచనలను తెలుసుకోవడం, స్వీకరించడం అనేది ఇంతకు ముందెన్నడూ చూడలేదు. సందర్భాన్ని బట్టి ప్రధాని ఆయా వర్గాలతో మాట్లాడి 'నేనున్నాన'నే భరోసా ఇవ్వడం ఈ కార్యక్రమం విజయం సాధించడంలో ప్రధాన కారకంగా నిలిచింది. ఉదాహరణకు విద్యార్థుల పరీక్షల సమయంలో ఆయన వారితో పంచుకునే విశేషాలు వారికి ఎంతో స్ఫూర్తినీ, ధైర్యాన్నీ, భరోసానూ ఇస్తున్నాయి.



'మన్ కీ బాత్' ఇప్పటికి వంద కోట్ల మందికి పైగా శ్రోతలు వీక్షించినట్టు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), రోహ్‌తక్ నిర్వహించిన సమగ్ర అధ్యయనంలో తేలింది. ప్రోగ్రామ్ 100వ ఎడిషన్‌కు ముందు... ప్రసార భారతి విడుదల చేసిన ఐఐఎం గణాంకాల ప్రకారం... దేశ ప్రజల్లో 96 శాతం మందికి 'మన్ కీ బాత్' తెలుసునని రుజువయ్యింది. శ్రోతలు మోదీ... నాయకుడిగా జ్ఞానవంతుడనీ, తమతో ఆయన భావోద్వేగ సంబంధాన్ని ఏర్పరుచుకున్నాడనీ భావిస్తున్నారు. ఆయన తన అభిప్రాయాలను ప్రభావవంతంగా, నిర్ణయాత్మకంగా, ప్రజలకు వివరించగలిగారన్న నమ్మకం కుదిరింది. 'మన్ కీ బాత్' వినడం వల్ల, బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రజల్లో మార్పు వచ్చినట్టు సర్వే ధ్రువీకరించింది. ఈ కార్యక్రమం ద్వారా 'భారతదేశ విజయాలు', 'సామాన్య పౌరుల గాథలు', 'సాయుధ బలగాల ధీరత్వం', 'యువత సమస్యలు' చర్చకు వచ్చాయి. ప్రతి నెలా చివరి ఆదివారం ఈ కార్యక్రమం ప్రసారమవుతోంది. 2014 అక్టోబర్ 3న ప్రారంభమైన ఈ కార్యక్రమం రేపు ఆదివారం వందవ ఎపిసోడ్‌ను పూర్తి చేసుకోనుండడం ముదావహం.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు
(రేపటికి 100వ ఎడిషన్‌లోకి ప్రవేశిస్తున్న 'మన్ కీ బాత్')

**గ్రహం అనుగ్రహం** శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.నవమి ప.4.58 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.11.46 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.1.03 నుండి 2.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.41 నుండి 7.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.01 నుండి 11.43 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.14.

## ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక ఎస్‌బీఐ

**ఎంపీ వల్లభనేని బాలశౌరి**



ఎస్‌జీటీలకు చెక్కును అందిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కైలే, డీజీఎంలు

**కూచిపూడి(మొవ్వ):** భారతదేశ ఆర్థిక వ్యవస్థకు భారతీయ స్టేట్ బ్యాంక్ వెన్నెముకగా నిలుస్తుందని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూచిపూడి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలోని ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన అవుట్ రీచ్ కార్యక్రమానికి ఎంపీ బాలశౌరి స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. కూచిపూడి బ్రాంచ్ మేనేజర్ జి.సుమతి అధ్యక్షతన జరిగిన సమావేశం ఎంపీ మాట్లాడుతూ విద్యావంతులైన యువత, అర్హత కలిగిన వారు బ్యాంక్ స్కీములను సంపూర్ణంగా తెలుసుకుని, రుణాలు పొంది ఉన్నతులుగా ఎదగాలని, రుణాలు తీసుకోవటం వినియోగదారుల హక్కు అని అన్నారు. అలాగే సీజీటీఎంఎస్ఈ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ ప్రైజర్స్ స్కీమ్‌ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు, డ్వాక్రా మహిళలకు క్షేత్ర స్థాయి బ్యాంకింగ్ రంగం అందిస్తున్న రుణాలు, బీమాపై అవగాహన కల్పించి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు, ఇతర వ్యవసాయ సంబంధ రుణాలకు సంబంధించిన రూ.46,43,00,000 చెక్కుని లబ్ధిదారులకు ఎంపీ, ఎమ్మెల్యేలు అందచేశారు. డిప్యూటీ జనరల్ మేనేజర్లు కె.రంగరాజన్, వి.హేమ (ఏబీయు, జీఎస్ఎస్), అంబటి వెంకట రామయ్య (ఎఫ్ఐ)లు పాల్గొని ఎస్‌బీఐ ద్వారా అందుస్తున్న పలు లోన్స్, మైక్రో ఇన్సూరెన్స్ తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, శ్రీమన్నారాయణ స్వామి నిర్వాహకులు జీయర్‌స్వామి పాల్గొన్నారు.

## మే 5న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** పౌర్ణమిని పురస్కరించుకుని మే 5వ తేదీన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. 5వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున 5-55 గంటలకు దేవస్థాన ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. కుమ్మరి పాలెం, నాలుగు స్తంభాలు, సితార, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రహ్మణ వీధి మీదగా మహామండపం వరకు సాగుతుంది.

సుమారు 7 కిలోమీటర్ల మేర సాగే గిరి ప్రదక్షిణలో అమ్మవారి ప్రచార రథంతో సాగుతుందన్నారు. దేవస్థాన ఛైర్మన్ , పాలక మండలి సభ్యులతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు పాల్గొననున్నట్లు చెప్పారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ విడుదల



జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** నవరత్నాల పథకాలలో భాగంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పంపిణీ చేసేందుకు రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను కలెక్టర్ తన కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఏ నెలలో ఏయే సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నామనే విషయాన్ని ముందుగానే ప్రకటించి అనుగుణంగా సంక్షేమ క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. జనవరి మాసంలో వైఎస్సార్ భరోసా, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ పెన్షన్ కానుక, ఫిబ్రవరి మాసంలో జగనన్న విద్య దీవెన, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, మార్చి మాసంలో జగనన్న వసతి దీవెన, ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు, ఏప్రిల్ మాసంలో జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, మే మాసంలో వలంటీర్లకు వందనం, వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల భీమా, జగనన్న విద్య దీవెన, వైఎస్సార్ కల్యాణమస్తు, మత్స్యకార భరోసా జూన్ మాసంలో జగనన్న విద్యా కానుక, అమ్మఒడి, వైఎస్సార్ లా నేస్తం, జూలై మాసంలో జగనన్న విదేశీ విద్యాదీవెన, వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ కళ్యాణమస్తు, ఆగస్టు మాసంలో జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ కాపు నేస్తం, వాహన మిత్ర, సెప్టెంబర్ మాసంలో వైఎస్సార్ చేయూత, అక్టోబర్ మాసంలో వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, నవంబర్ మాసంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, కళ్యాణమస్తు, జగనన్న విద్యా దీవెన, డిసెంబర్ మాసంలో విదేశీ విద్యా దీవెన, జగనన్న చేదోడు పథకాల లబ్దిదారులకు క్రమం తప్పకుండా వారి ఖాతాల్లో సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలకు తెలియచేసేలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సంక్షేమ క్యాలెండర్‌ను ప్రదర్శించాలని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి యు.సురేంద్రనాథ్, డీపీఆర్ఓ ఎస్.వి.మోహన్‌రావు, ఏ.వి.సూపర్ వైజర్ ఏ.సాయి బాబా, పబ్లిసిటీ అసిస్టెంట్ వి.వి. ప్రసాద్ పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి కృషి

**కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు**



**చిలకలపూడి(మచిలీపట్నం):** రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ సమావేశ హాలులో శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయం వెన్నుముక లాంటిదని ప్రభుత్వానికి రైతులు చాలా ముఖ్యమని వారికి ఏ విధమైన సమస్య రాకుండా అన్ని విధాల మేలు జరిగే విధంగా ఉండేందుకు సలహా మండలి సమావేశాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మండలి సభ్యులు క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను తెలుసుకుని సమావేశంలో ప్రస్తావించినప్పుడు వాటిని తప్పనిసరిగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వీటిలో స్వల్పకాలికమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమంలో రైతులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగులు రైతులకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన అన్ని సదుపాయాలు అందించాలన్నారు. ఆర్బీకేల్లో మట్టి నమూనాలు పరీక్షించి ఏ పంటలు వేయాలో, ఏ ఎరువులు వాడాలో, ఎంత మోతాదులో వేయాలో వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు.

**20 టన్నుల ధాన్యం సేకరణకు చర్యలు..**

ఈ పంట ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్టు కలెక్టర్ చెప్పారు. గతంలో రైతులు మిల్లర్లు, దళారుల వలన సరైన ధర రాక ఇబ్బంది పడేవారన్నారు. ప్రస్తుతం జిల్లాలో 6 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించటం జరిగిందన్నారు. ఇంకా 20 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 129 రైతు సంఘాల గ్రూపులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు వచ్చే మే నెలలో అందజేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ జన్ను రాఘవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న ప్రధాన కాలువ ద్వారా నీరు చివరి ఆయకట్టు వరకు సరిగా అందటం లేదని, పంట కాలువల్లో పూడిక తీయటంతో పాటు కట్టల ఎత్తు పెంచాలని కోరారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలు సాగు చేసే విధానాన్ని తెలియజేసే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, సలహామండలి సభ్యులు పట్టపు శ్రీనివాసరావు, పెన్నేరు ప్రభాకరరావు, శ్రీకాకోళపు నాగేశ్వరరావు (బాబు), జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయభారతి, ఎల్‌డీఎం సాయిరాం, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి చంద్రశేఖరరావు, ఏపీఎంఐపీ పీడీ విజయలక్ష్మీ, ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీధర్, మార్క్‌ఫెడ్ డీఎం మురళీకృష్ణ, డీసీవో ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సెలవులే అదును.. ప్రతిభకు పదును

- వేసవిలో ఉచితంగా కోచింగ్ క్యాంపులు
- మ్యాజిక్, మ్యాథ్స్, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ
- విద్యార్థులకు సెలవులు సద్వినియోగం చేసుకునే అవకాశం



**మొగల్రాజపురం(విజయవాడతూర్పు):** వేసవి వచ్చిందంటే పిల్లలకు ఎక్కడి లేని ఉత్సాహం. సెలవుల్లో కొంత మంది విహార యాత్రలకు వెళ్తారు. మరి కొందరు బంధువుల ఊరు వెళ్లి ఉత్సాహంగా గడుపుతారు. మరికొంత మంది తమ అభిరుచిని బట్టి వేసవి శిక్షణ శిబిరాల్లో చేరి తమ ప్రతిభకు పదును పెట్టుకుంటారు. విజయవాడ పరిధిలో కొన్ని సంస్థలు, కళాశాలు వేసవిలో ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ఇక ఆలస్యం ఎందుకు ఆ వివరాలను తెలుసుకుందాం. మన ఆసక్తిని బట్టి ఆ శిబిరాల్లో చేరి ప్రతిభకు పదను పెడదాం పదండి...

### మ్యాజిక్ నేర్చుకుందాం.. రండి

అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో 8-15 సంవత్సరాల మధ్య వయస్సు వారికి పది రోజుల పాటు 'మ్యాజిక్ నేర్చుకుందాం రండి' పేరుతో మే ఐదు నుంచి 14వ తేదీ వరకు ఉచిత శిక్షణ శిబిరం జరగనుంది. ప్రముఖ మెజీషియన్ క్రాంతికార్ స్వయంగా ఈ చిన్నారులకు శిక్షణ ఇస్తారు. విజయవాడ దుర్గాపురం ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, పటమటలోని సర్వోత్తమ గ్రంథాలయం, మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల, పాతబస్తీలోని కేబీఎన్ కళాశాల ఆవరణల్లో మ్యాజిక్ శిక్షణ ఉచితంగా ఇస్తారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 88850 00171, 63059 54249 సెల్ నంబర్లలో సంప్రదించొచ్చు.

### మహిళలకు ప్రత్యేకం

కేబీయన్ కళాశాల ఉమెన్స్ స్టడీస్ సెంటర్, యూజీసీ సంయుక్తంగా మహిళలకు వివిధ అంశాల్లో వేసవి ఉచిత శిక్షణ తరగతులే నిర్వహిస్తున్నాయి. ఈ నెల 25 నుంచి జూన్ మూడో తేదీ వరకు శిక్షణ కొనసాగుతుంది. డీటీపీ, ఫొటోషాపీ, బ్యుటీషియన్, టైలరింగ్, ఫ్యాషన్ స్టైలింగ్, కంప్యూటర్ బేసిక్స్, మగ్గం వర్క్స్, మెహిందీ డిజైన్స్, ఫుడ్ రెసిపీస్, డాన్స్‌తో పాటుగా స్కూటీ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు డ్యాన్స్ (వెస్ట్రన్/క్లాసిక్), పెయింటింగ్, డ్రాయింగ్, వేదిక్ మ్యాథమెటిక్స్, సింగింగ్, స్పోకెన్ హిందీలో శిక్షణ ఇస్తారు. ఇంటర్ ఆపై తరగతులు చదువుతున్న యువతులకు స్పోకెన్ ఇంగ్లిష్, స్పోకెన్ హిందీ, పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, వేదిక్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్స్ బేసిక్స్, డీటీపీ, సింగింగ్, స్కేటింగ్, కరాటేల్లో శిక్షణ ఇస్తారు. మరిన్ని వివరాలకు 62814 85823, 96521 82588 సెల్ నంబర్లలో సంప్రదించొచ్చు.

### కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

విజయవాడ నగరంలోని బందరు రోడ్డులో ఉన్న ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ బేసిక్స్, ట్యాలీ ఇన్ జీఎస్టీ, ఇంటర్‌నెట్ బేసిక్స్, డీటీపీ, ఫొటోషాపీ కోర్సుల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నారు. 9 నుంచి 10 తరగతిలోకి వస్తున్న వారికి లెక్కలు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో 10 తరగతి సిలబస్ పరిచయం చేసేందుకు నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. పటమట, వన్‌టౌన్, అజిత్ సింగ్‌నగర్ ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇతర వివరాలకు 0866-2578044 నంబరులో సంప్రదించవచ్చు.

### పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ మే పదో తేదీన నిర్వహించే పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించేందుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉచితి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే తరగతులు మొదలయ్యాయి. వివరాలకు 94926 85021 నంబరులో సంప్రదించవచ్చు.

- భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ఆవరణలో కూడా పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. వివరాలకు 90108 49524 నంబరులో సంప్రదించాలి.

### నామమత్రాపు ఫీజుతో ..

నామమాత్రపు ఫీజుతో గాయత్రీనగర్‌లోని స్ఫూర్తి క్రియేటివ్ స్కూల్‌లో వివిధ అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్స్, హ్యాండ్ రైటింగ్, కాలీగ్రఫీ, పేపర్ క్విలింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాపీ, డిజిటల్ మేకింగ్, టైప్ రైటింగ్‌లో లోయర్ అండ్ హయ్యర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఇతర వివరాలకు 98493 55339 నంబరులో సంప్రదించవచ్చు.

### వీఎంసీ ఆధ్వర్యంలో..

విజయవాడ నగర పాలక సంస్థ (వీఎంసీ) ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం ఆవరణలో అన్ని క్రీడాంశాల్లోనూ ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ఈ కోర్సులను మే రెండో వారంలో ప్రారంభిస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. మీకు ఎందులో ఆసక్తి ఉందో ఆ శిబిరంలో చేరండి.. ఎంచక్కా అభిరుచికి తగిన అంశంలో పట్టు పెంచుకోండి..

## క్లుప్తంగా

### మనీ లాండరింగ్ కేసులో సిసోడియాకు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ నాయకుడు మనీశ్ సిసోడియాకు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ కోర్టు లనిరాకరించింది. కుంభకోణంలో ఆయన పాత్రపై స్పష్టమైన ప్రాథమిక ఆధారాలున్నాయని ప్రత్యేక జడ్జి ఎం.కె.నాగపాల్ అన్నారు. భార్యకు అనారోగ్యం బెయిల్ ఇచ్చేందుకు ఆధారం కాబోదన్నారు.

### తైవాన్ సమీపంలో భారీగా చైనా విమానాలు, నౌకలు

తైపీ: చైనా మరోసారి ప్రతీకార చర్యలకు దిగింది. గురువారం అమెరికా నేవీకి చెందిన పి-8ఏ పొసెడాన్ యాంటీ సబ్‌మెరీన్ గస్తీ విమానం చైనా- తైవాన్‌లను విడదీసే తైవాన్ జలసంధి మీదుగా చక్కర్లు కొట్టడం ఆ దేశానికి మింగుడుపడటం లేదు. దీంతో, శుక్రవారం యుద్ధ విమానాలను, నేవీ షిప్‌లను పెద్ద సంఖ్యలో తైవాన్ సమీపంలోకి పంపించి, బెదిరింపు చర్యలకు దిగింది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ)కి చెందిన 38 ఫైటర్ జెట్లు, ఇతర యుద్ధ విమానాలు తమ భూభాగానికి అత్యంత సమీపంలోకి వచ్చినట్లు తైవాన్ రక్షణ మంత్రి శుక్రవారం తెలిపారు. ఈ నెలారంభంలో భారీగా సైనిక విన్యాసాలు చేపట్టిన తర్వాత పెద్ద సంఖ్యలో విమానాలు, నౌకలను తైవాన్ సమీపంలోకి తరలించడం ఇదే మొదటిసారి.

### ఉక్రెయిన్‌పై రష్యా దాడులు.. 22 మంది దుర్మరణం



కీవ్: రష్యా దాడుల్లో శుక్రవారం 22 మంది ఉక్రేనియన్లు దుర్మరణం పాలయ్యారు. ఉమాన్‌లో 9 అంతస్తుల నివాస భవనంపై క్షిపణి దాడిలో ముగ్గురు చిన్నారులతో పాటు 20 మంది చనిపోయారు. ఇప్పటిదాకా యుద్ధ ఛాయలు కనిపించని ఈ నగరంపై రష్యా తొలిసారి లాంగ్‌రేంజ్ క్షిపణులను ప్రయోగించింది. మరోవైపు 2 నెలల తర్వాత రాజధాని కీవ్‌లోని ఓ నివాస భవనంపై క్షిపణి దాడి జరిగింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన 21 క్రూయిజ్ మిస్సైళ్లను, రెండు డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు. నీప్రో నగరంలోని నివాస ప్రాంతాలపై రష్యా బలగాల దాడిలో రెండేళ్ల చిన్నారి, ఆమె తల్లి చనిపోగా మరో నలుగురు గాయపడినట్లు గవర్నర్ చెప్పారు. ఈ దాడులతో ఉద్దేశపూర్వకంగా బెదిరించేందుకు రష్యా ప్రయత్నిస్తోందని ఉక్రెయిన్ అంటుండగా తమ దీర్ఘ శ్రేణి క్షిపణులు లక్ష్యాలను ఛేదించినట్లు రష్యా చెబుతోంది. రష్యా ఆక్రమిత డొనెట్స్క్‌పై ఉక్రెయిన్ బలగాల రాకెట్ దాడిలో ఏడుగురు పౌరులు దుర్మరణం చెందినట్లు నగర మేయర్ చెప్పారు.

చట్టం తన పని తాను చేసుకుపోతున్నట్టే కాలమూ తన మానాన తాను పరిగెడుతూనే ఉంటుంది. ఎవరి కోసమూ ఆగదు. ఈ పరుగెత్తే కాలమే ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కాళ్లకు అడ్డం పడుతోంది. అయినా సరే, 80 ఏళ్ల బైడెన్ ఆగేదే లేదంటున్నారు. 'అప్పుడేనా...!' అంటూ మరో విడత అధ్యక్ష పదవికి సిద్ధమయ్యారు. 2024 అధ్యక్ష ఎన్నికల బరిలో డెమొక్రాట్ల అభ్యర్థిని తానేనని మొన్న మంగళవారం ఆయన అధికారకంగా ప్రకటించేశారు. ఎదురు పడేది బహుశా డొనాల్డ్ ట్రంపే కదా, ఇంకోసారి ఓడించలేనా అన్నది ఆయన ధీమా. 'ఆయనకు 76, నాకు 80... అంతే కదా' అన్నది ఆయన ధైర్యం. అంతేగానీ, ఇక కొత్త తరానికి వదిలేద్దామన్న భావన మాత్రం ఇద్దరిలోనూ లేకపోవడం గమనార్హం. డొనాల్డ్ ట్రంప్ విషయంలో చట్టం, ప్రెసిడెంట్ బైడెన్ విషయంలో కాలం తమ మానాన తమ పని చేసుకుంటూ వెళ్లిపోతూనే ఉంటాయి. గ్రీకున ఏడాది తిరిగేసరికి ఎన్నికల నగారా మోగుతుంది. గెలుపెవరిదో, ఓడేదెవరో మళ్లీ కాలమే చెబుతుంది...

**ఎస్.రాజమహేంద్రారెడ్డి**

రెండో ప్రపంచ యుద్ధం భీకరంగా సాగుతున్న కాలంలో, అమెరికా ఆ యుద్ధ మైదానంలోకి దిగిన ఏడాదికి 1942లో బైడెన్ జన్మించారు. కాలచక్రం మరో 30 ఏళ్లు తిరిగేసరికి 1973లో తొలిసారి సెనేటర్ అయ్యారు. అప్పటికి వైట్‌హౌస్‌లో రిచర్డ్ నిక్సన్ కొలువుదీరి ఉన్నారు. అత్యంత పిన్న వయసు సెనేటర్‌గా చరిత్ర సృష్టించిన బైడెన్‌కు, 15 ఏళ్లు విరామం లేకుండా ఆ పదవిలో కొనసాగాక 'నేనెందుకు శ్వేతసౌధంలో అడుగుపెట్టకూడదు?' అన్న ఆలోచన వచ్చింది. 1988లో ఆ ముచ్చటా తీర్చుకుందామనుకున్నా పరిస్థితులు అనుకూలించలేదు. డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి రేసులో ముందు వరుసలో నిలిచి ముచ్చటగా మూడు నెలలు ముమ్మరంగా ప్రచారం కూడా చేసుకున్నాక అనివార్యంగా, అర్ధంతరంగా వైదొలగాల్సి వచ్చింది. ఆ సమయానికి అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్నయుద్ధం ఇంకా ముగియలేదు. ఇక్కడ సీన్ కట్ చేస్తే, 2020లో బైడెన్ 78 ఏళ్ల వయసులో వైట్‌హౌస్ మెట్లెక్కి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆ వయసులో అధ్యక్షుడు కావడం కూడా అమెరికా చరిత్రలో రికార్డే. తన రికార్డును తానే బద్దలు కొట్టేందుకు ఈ డెలావర్ పెద్దాయన బరిలో దిగుతున్నారు. గెలిచి తీరతానన్న ఆత్మవిశ్వాసమే ఆయనను ముందుకు నడిపిస్తోంది. ఈ ధీమా వెనక పలు కారణాలున్నాయి.




# బైడెన్.. బైడెన్.. బై బై
# ఎందుకు చెప్పలేదు?

దూకుడుకు కాసింత దుందుడుకుతనం కలిపితే డొనాల్డ్ ట్రంప్. అదే ఆయన స్వభావం. అదే ఆయన పెట్టుబడి కూడా. ఒకసారి తన చేతిలో ఓడిన ఈ ట్రంపే ఈసారి కూడా తన రిపబ్లికన్ ప్రత్యర్థి అని బైడెన్ ఫిక్సయిపోయారు. రిపబ్లికన్ పార్టీ తమ తుది అభ్యర్థిని ఇంకా ప్రకటించకపోయినా, ట్రంప్‌కే చాన్స్ దక్కే సూచనలు పుష్కలంగా ఉన్నాయి. సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ, టెక్ దిగ్గజం వివేక్ రామస్వామి, రేడియో హోస్ట్ లారీ ఎల్డర్, అర్కన్సాస్ మాజీ గవర్నర్ అసా హచిన్సన్ ప్రధానంగా ఆయనతో పోటీ పడుతున్నారు. వీరిలో నిక్కీ హేలీ నుంచే ట్రంప్‌కు కొంచెం గట్టి పోటీ ఎదురవ్వచ్చు. ట్రంప్‌ను పక్కకు నెట్టి బరిలోకి దిగుతాడనుకున్న ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించే యోచనలో ఉన్నట్టు లేరు. మొత్తమ్మీద బైడెన్ ప్రత్యర్థిగా ట్రంప్ దాదాపుగా ఖాయమైనట్టే. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓడినా తానే గెలిచానని డాంబికాలు పలికి, కేపిటల్ హిల్‌పై దాడికి తన అభిమానులను, రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలను ఉసిగొల్పడంతో ట్రంప్ గ్రాఫ్ దారుణంగా పడిపోయిందన్నది బైడెన్ అంచనా. అపఖ్యాతి మూటగట్టుకున్న ట్రంప్‌ను ఓడించడం ఈసారి మరింత తేలికని ఆయన భావిస్తున్నారు. మీద పడుతున్న వయసును లెక్కచేయకుండా బైడెన్ ముందుకురకడానికి ఇదే ప్రధాన కారణం. పోర్న్ నటికి డబ్బుల చెల్లింపు విషయంలో ట్రంప్‌ను కోర్టు ముద్దాయిగా ప్రకటించడమూ తనకు లాభిస్తుందని ఆశపడుతున్నారు. అయితే ట్రంప్‌ను అన్యాయంగా ఈ కేసులో ఇరికించారని రిపబ్లికన్లలో చాలామంది నమ్ముతుండటంతో ఆ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఆయన అవకాశాలు మరింత మెరుగయ్యాయన్నది విశ్లేషకుల అంచనా. రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుల్లో ట్రంప్ హవా కొనసాగుతున్నా ప్రజల్లో మాత్రం ఆయన పట్ల అసంతృప్తి పెరిగిందన్నది డెమొక్రాట్ల వాదన. 2018 నుంచీ ట్రంప్ పయనం ఓటమి బాటలోనే సాగుతుండటం గమనార్హం. 2018 మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు సెనేట్‌ను, హౌజ్‌ను రెండింటినీ కోల్పోయారు. 2020లో అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి చవిచూశారు. 2022 మిడ్ టర్మ్ ఎన్నికల్లోనూ ట్రంప్ సారథ్యం వల్ల పార్టీ అనూహ్య పరాజయం చవిచూసింది. మొత్తమ్మీద రిపబ్లికన్లకు ట్రంప్ గుదిబండగా తయారవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోర్టు కేసులు ట్రంప్‌కు కొత్త ఊపిరిలూదినా ఆయనను ఓడించడం తనకొక్కడికే సాధ్యమని బైడెన్ నొక్కివక్కాణిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి ఓడించి చూపించానని పదేపదే చెబుతున్నారు. వయసుదేముంది, అదో అంకె మాత్రమేనన్నది ఆయన భావన. వచ్చే ఏడాది బరిలో దిగే సమయానికి ట్రంప్‌కు 78 ఏళ్లొస్తాయి. తనకన్నా నాలుగేళ్లే చిన్న కదా అంటారు బైడెన్. ఒకవేళ అంచనాలన్నీ తారుమారై ట్రంప్‌కు రిపబ్లికన్ అభ్యర్థిత్వం దక్కకున్నా ఆయన స్వతంత్రుడిగా బరిలోకి దిగడం ఖాయం. రిపబ్లికన్ మద్దతుదార్ల ఓట్లు చీలడం తథ్యం. అదే జరిగితే బైడెన్ పని మరింత సులువవుతుంది.

### మళ్లీ ట్రంపే ప్రత్యర్థి అవుతారని...

### ఓటు 'విచ్ఛిత్తి'

అబార్షన్ల (గర్భవిచ్ఛిత్తి) చట్టబద్ధత చెల్లదని రిపబ్లికన్స్ అనుకూల సుప్రీంకోర్టు తేల్చిచెప్పడం కూడా డెమొక్రాట్లకు రాజకీయంగా లాభించింది. అబార్షన్లు అనైతికమని రిపబ్లికన్లు బాహాటంగా ప్రచారం చేసి స్వేచ్ఛావాదులు, స్త్రీవాదుల ఆగ్రహానికి గురయ్యారు. తన దేహం మీద స్త్రీకే పూర్తి హక్కుంటుందని, అబార్షన్ చేయించుకోవాలా, వద్దా అన్నది ఆమె ఇష్టాయిష్టాల మీదే ఆధారపడి ఉంటుందనేది బైడెన్ టీమ్ వాదన. సనాతనవాదులు, మతవాదులకు ఇది రుచించకపోయినా ప్రజల్లో అధిక భాగం బైడెన్‌తో ఏకీభవించారు. ఈ పరిణామం వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుంది. అబార్షన్ల చట్టబద్ధతను తిరస్కరిస్తూనే, ఆయా రాష్ట్రాలు తమ అభీష్టం మేరకు దాన్ని అమలు చేసే వెసులుబాటును సుప్రీంకోర్టు కల్పించడం గమనార్హం. అమెరికావ్యాప్తంగా ఈ తీర్పుకు అనుకూల, ప్రతికూల ప్రదర్శనలు మిన్నంటాయి. రిపబ్లికన్ పాలిత కాన్సాస్, కెంటకీ, మోంటానా రాష్ట్రాలు ఆగమేఘాల మీద అబార్షన్లపై ఉక్కుపాదం మోపాయి. డెమొక్రటిక్‌పాలిత కాలిఫోర్నియా, మిషిగన్, వెర్మోంట్ అబార్షన్ హక్కుల పరిరక్షణకు ప్రతినబూనాయి. ఈ పరిణామాలు ఓటర్లనూ రెండు వర్గాలుగా చీల్చాయి. సుప్రీం తీర్పు తర్వాత జరిగిన మిడ్ టర్మ్‌లో రిపబ్లికన్ల ఓటు బ్యాంకు చెల్లాచెదురు కావడానికి ఇదే ప్రధాన కారణమైంది. అబార్షన్ వ్యతిరేకతను రాజకీయ నినాదంగానే భావించిన రిపబ్లికన్ పార్టీ, ప్రజలు ఇంతగా ప్రభావితమవుతారని అంచనా వేయలేకపోయింది. పరోక్షంగా డెమొక్రాట్లకు అదనపు లాభం చేకూరింది. అబార్షన్లపై రిపబ్లికన్ల వైఖరే తన విజయానికి రెండో మెట్టు అవుతుందని బైడెన్ గట్టిగా నమ్ముతున్నారు.

### అనుకూల ఓటు పదిలం

బైడెన్ విజయావకాశాలను ప్రభావితం చేసే పై రెండు అంశాలు ట్రంప్ వ్యతిరేక ఓటుతో ముడిపడి ఉన్నాయి. సగటు ఓటరును తమవైపు తిప్పుకునే మంచి పనులు కూడా బైడెన్ గత రెండేళ్లలో చాలానే చేశారు. అనుకూల ఓటు, కొత్త ఓటును పదిలం చేసుకోవడానికి ఇవి అండగా నిలుస్తాయి. ట్రంప్ పాలనలో అమెరికాను ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనాను బైడెన్ సమర్థంగా అరికట్టి పార్టీలకతీతంగా ప్రజల మన్ననలు అందుకున్నారు. దిగుమతుల మీద ఆధారపడకుండా స్వదేశీ తయారీ 'మేడిన్ అమెరికా' భావానికి బహుళ ప్రచారం కల్పించారు. ఆ దిశగా మాన్యుఫాక్చరింగ్ యూనిట్ల స్థాపనకు బిల్లు తెచ్చారు. వైద్య చికిత్స ఖర్చులను తగ్గించడంతో పాటు ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకున్నారు. విదేశీ వ్యవహారాల్లోనూ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించారు. నాటోకు వెన్నుదన్నుగా, ఉక్రెయిన్‌కు అండగా నిలిచి రష్యాను నిలువరించడం గమనించదగ్గవి. ప్రపంచంపై తన పెత్తనాన్ని నిలుపుకోవాలంటే చైనాపై ఓ కన్నేసి ఉంచాలనే సూక్ష్మాన్ని కూడా బైడెన్ గుర్తించడం విశేషం. వచ్చే ఎన్నికల్లో ఈ అంశాలన్నీ తనకు అనుకూలంగా ఓటుబ్యాంకును సుస్థిరం చేస్తాయనే నమ్మకమే బైడెన్‌ను ఎన్నికలవైపు నడిపిస్తోంది.

### కొస మెరుపు

బైడెన్‌కు ఇన్ని అనుకూలతలున్నా ట్రంప్‌కు 2020 ఎన్నికల్లో 7.4 కోట్ల ఓట్లు వచ్చాయన్నది తోసిపుచ్చలేని అంశం. రిపబ్లికన్లు ట్రంప్‌ను పక్కన పెట్టి అనూహ్యంగా తమ తురుపు ముక్క డిసాంటిస్‌ను తెరపైకి తెస్తే మాత్రం బైడెన్ వయసు చర్చనీయాంశంగా మారుతుంది. అన్నీ మంచి శకునములేనని బైడెన్ భావిస్తున్నా ఆర్థిక నిర్వహణ వంటి వ్యవహారాల్లో ఆయన పనితీరుపై విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. వెక్కిరిస్తున్న ద్రవ్యోల్బణం వంటివాటిని ఉదాహరణగా చూపుతున్నారు. అనుకూల, ప్రతికూల పవనాలెలా ఉన్నా వయసు విషయంలో మాత్రం బైడెన్, ట్రంప్ దొందూ దొందే అన్నది తటస్థుల అభిప్రాయం. 2024 నవంబర్‌లో జరిగే ఎన్నికల్లోగా ఏమైనా జరగొచ్చు. చివరికి గెలుపు ఎవరినైనా వరించవచ్చు. ఇప్పటికైతే బైడెన్ ఆత్మవిశ్వాసాన్ని కొట్టిపారేయలేం. అయినా రాజకీయాల్లో వయసుతో పనేముంది? అధికారమే ముఖ్యం! బైడెన్‌కైనా, ట్రంప్‌కైనా లక్ష్యం అదే!

"రాజకీయం ఒక రంగులలోకం అధికారమొక తీరని దాహం"

### జియాఖాన్ ఆత్మహత్య కేసు.. సూరజ్ పంచోలీకి విముక్తి



ముంబై: పదేళ్ల నాటి బాలీవుడ్ నటి జియాఖాన్ ఆత్మహత్య కేసు కీలక మలుపు తిరిగింది. సాక్ష్యాధారాల్లేవంటూ ఆమె బాయ్‌ఫ్రెండ్, నటుడు సూరజ్ పంచోలీని ఈ కేసులో నిర్దోషిగా సీబీఐ కోర్టు ప్రకటించింది. అమెరికా పౌరురాలైన జియా 2013 జూన్ 3న ముంబై జుహూ ప్రాంతంలోని తన ఇంట్లో ఉరేసుకుని కనిపించారు. ఆమె రాసినట్లు చెబుతున్న లేఖ లభ్యమైంది. సూరజ్‌తో సంబంధాలు, అతడి వేధింపులు, చిత్రహింసలను అందులో ప్రస్తావించారు. కుమార్తెకు న్యాయం జరిగే వరకు పోరడతానని జియా తల్లి రబియా ఖాన్ అన్నారు.

### సోనియా గాంధీ ఓ విషకన్య

**బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్య, మండిపడ్డ కాంగ్రెస్**

కొప్పల్/న్యూఢిల్లీ: ప్రధాని మోదీని విషసర్పంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అభివర్ణించిన కొద్ది గంటల్లోనే బీజేపీ ప్రతి దాడికి దిగింది. ఆ క్రమంలో కాంగ్రెస్ నేత సోనియాగాంధీపై కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యాత్నాల్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ''అమెరికా ఒకప్పుడు మోదీకి వీసా ఇవ్వను పొమ్మంది. ప్రపంచ నేతగా ఎదిగాక ఎర్ర తివాచీ పరిచి మరీ స్వాగతం పలికింది. అలాంటి మోదీజీని విషసర్పం అంటారా? మరి సోనియా కాంగ్రెస్ పార్టీలో నాట్యం చేసే విషకన్యా? ఆమె చైనా, పాకిస్తాన్ తరఫున పనిచేసే ఏజెంట్' అన్నారు. వీటిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సుర్జేవాలా మండిపడ్డారు. ''కర్ణాటక బీజేపీ నేతలకు మతి భ్రమించింది. యాత్నాల్‌ను తక్షణం పార్టీ నుంచి బహిష్కరించాలి'' అని డిమాండ్ చేశారు. నెహ్రూ గాంధీ కుటుంబాన్ని గతంలోనూ ఇలాగే కించపరిచారన్నారు.

### వారికి మతి పోయింది

**మోదీపై ఖర్గే విమర్శలపై అమిత్ షా**

సాక్షి, బళ్లారి: ప్రధాని మోదీ విషసర్పమన్న ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి, వారి నేతలకు మతి భ్రమించిందనేందుకు రుజువని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దుయ్యబట్టారు. శుక్రవారం కర్ణాటకలో గదగ్, ధార్వాడ జిల్లాల్లో ఆయన పలు సభలో మాట్లాడారు. ''మోదీని విషసర్పంతో పోల్చడం ఆ పార్టీ ఎంతగా దిగజారిందనేందుకు రుజువు. వారెంతగా విమర్శిస్తే అంతగా ఆయనకు ప్రజల్లో మద్దతు పెరుగుతుంది'' అన్నారు. 'తీవ్రవాద భావజాల పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)ను నిషేధించినందుకు నాపై కేసు పెట్టారు. పీఎఫ్ఐను కాంగ్రెస్ నెత్తిన పెట్టుకుంది. దానిపై నిషేధం తర్వాత కర్ణాటక సురక్షితంగా ఉంది'' అన్నారు. ''సీఎం తానంటే తానని పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, సిద్ధరామయ్య వాదులాడుకుంటున్నారు. అవసరం లేదు. సీఎం బీజేపీ వ్యక్తే అవుతారు. కన్నడ ఓటర్లు బీజేపీనే గెలిపిస్తారు. ఓటర్ల నమ్మకం కోల్పోయిన కాంగ్రెస్ వాగ్దానాలను ఎవరు విశ్వసిస్తారు?. కొన్ని విషయాల్లో మాత్రం కాంగ్రెస్ ఇచ్చే గ్యారెంటీని ఖచ్చితంగా నమ్మవచ్చు. అవి.. అబద్ధాలు, అవినీతి, కులతత్వం, వంశపాలన, బుజ్జగింపు రాజకీయాలు' అంటూ అమిత్ షా ఎద్దేవా చేశారు.

## ఉగ్రవాదాన్ని పెకిలిద్దాం

**కలిసికట్టుగా పనిచేద్దాం ● ఎస్సీఓ సదస్సులో రాజ్‌నాథ్**



ఎస్సీఓ దేశాల రక్షణమంత్రులతో రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: ప్రపంచానికి పెనుముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించి వేయాల్సిన అవసరం ఉందని రక్షణ శాఖ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఈ విషయంలో షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్సీఓ) సభ్యదేశాలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రభూతం ఏ రూపంలో ఉన్నా ప్రమాదకరమేనని, దాన్ని అంతం చేయాల్సిందేనని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఎస్సీఓ సభ్యదేశాల రక్షణ శాఖ మంత్రుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదానికి అండదండలు అందించేవారి పీచమణచాలని చెప్పారు. కూటమిలోని సభ్యదేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరస్పరం గౌరవించుకొనేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయాలని అన్నారు. చైనా, పాకిస్తాన్ తీరును పరోక్షంగా ఆయన తప్పుపట్టారు. ఎస్సీఓ సదస్సుకు రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. సభ్య దేశాల నడుమ విశ్వాసం, సహకారం మరింత బలోపేతం కావాలని తాము కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం శాంతి, భద్రతకు ఊతం ఇవ్వాలన్నదే తమ ఆశయమని వివరించారు. ఎస్సీఓ సదస్సుకు చైనా, రష్యా తదితర సభ్య దేశాల రక్షణశాఖ మంత్రులు హాజరయ్యారు. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి హాజరు కాలేదు. ఆయన బదులుగా పాకిస్తాన్ ప్రధానమంత్రి ప్రత్యేక సహాయకుడు మాలిక్ అహ్మద్ ఖాన్ వర్చువల్‌గా పాల్గొన్నారు. షాంఘై సహకార కూటమి 2001లో షాంఘైలో ఏర్పాటయ్యింది. ఇందులో భారత్, రష్యా, చైనా, కిర్గిస్తాన్, కజకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ సభ్యదేశాలుగా ఉన్నాయి. 2017లో పాకిస్తాన్ శాశ్వత సభ్యదేశంగా మారింది.

**సరిహద్దులో సాధారణ స్థిరత్వం: చైనా విదేశాంగ మంత్రి**

బీజింగ్: భారత్–చైనా సరిహద్దులో ప్రస్తుతం సాధారణ స్థిరత్వం నెలకొని ఉందని చైనా విదేశాంగ మంత్రి జనరల్ లీ షాంగ్‌ఫు చెప్పారు. ఇరు దేశాల సైనిక, దౌత్య మార్గాల్లో కమ్యూనికేషన్ కొనసాగిస్తున్నాయని వివరించారు. ఎస్సీఓ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన లీ షాంగ్‌ఫు శుక్రవారం భారత విదేశాంగ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్–చైనా సరిహద్దు వద్ద ప్రస్తుత పరిస్థితి, ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలు 45 నిమిషాలపాటు మాట్లాడుకున్నారు. సరిహద్దు ఒప్పందాలను ఉల్లంఘిస్తే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఉన్న మొత్తం ఆధారం చెరిగిపోతుందని చైనాకు రాజ్‌నాథ్ సింగ్ తేల్చిచెప్పారు. సరిహద్దుకు సంబంధించిన ఏ వివాదమైనా ప్రస్తుతం అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారమే పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ నేపథ్యంలో జనరల్ లీ షాంగ్‌ఫు ఆచితూచి స్పందించారు.

## సాంకేతిక ప్రజాస్వామ్యం దిశగా

**అందుకోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం**

| టెక్నాలజీ ప్రజలందరికీ అందితేనే దేశాభివృద్ధి | ఆలిండియా రేడియో బృందంలో నేనూ భాగమే | ప్రధాని మోదీ వెల్లడి | 91 ఎఫ్ఎం ట్రాన్స్ మిటర్లు ప్రారంభం |
|---|---|---|---|

న్యూఢిల్లీ: ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్(ఎఫ్ఎం) రేడియో సేవలను గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించే దిశగా 91 ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రేడియో పరిశ్రమలో ఇదొక విప్లవాత్మకమైన ముందుడుగు అని అభివర్ణించారు. సాంకేతిక(టెక్నాలజీ) ప్రజాస్వామీకరణ కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. తమ తరానికి రేడియోతో భావోద్వేగ అనుబంధం ఉందని తెలిపారు. తాను రేడియో హోస్ట్‌గా వ్యవహరిస్తున్నానంటూ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రస్తావించారు. 100వ ఎపిసోడ్ వచ్చే ఆదివారం ప్రసారం కాబోతోందని వివరించారు. దేశ ప్రజలతో భావోద్వేగపూరిత బంధం పెంచుకోవడం రేడియో ద్వారానే సాధ్యమని ఉద్ఘాటించారు.

**అందరికీ ఆధునిక టెక్నాలజీ**

స్వచ్ఛ భారత్ అభియాన్, బేటీ బచావో, బేటీ పడావో, హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలు మన్ కీ బాత్ ద్వారా ప్రజా ఉద్యమాలుగా మారాయని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆలిండియా రేడియో బృందంలో తాను కూడా ఒక భాగమేనని వెల్లడించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే 91 ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్లను ప్రారంభించామని తెలియజేశారు. దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడానికి ఆధునిక టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడం కీలకమన్నారు. డిజిటల్ ఇండియా వల్ల రేడియో



శ్రోతల సంఖ్య పెరగడమే కాదు, కొత్త ఆలోచనా విధానం ఉద్భవిస్తోందని వివరించారు. ప్రతి ప్రసార మాధ్యమంలో విప్లవం కనిపిస్తోందని చెప్పారు. డీడీ ఉచిత డిష్ సేవలను 4.30 కోట్ల ఇళ్లకు అందించినట్లు తెలిపారు. ప్రపంచ సమాచారం ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు, దేశ సరిహద్దుల్లోని కుటుంబాలకు చేరుతోందని హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలకు సైతం విద్యా, వినోద సమాచారం చేరుతోందన్నారు.

**డిజిటల్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు**

గ్రామీణ ప్రాంతాలకు ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణతో మొబైల్ డేటా చార్జీలు భారీగా తగ్గిపోయాయని, సమాచారం పొందడం ప్రజలకు సులభతరంగా మారిందని అన్నారు. దేశం నలుమూలలా డిజిటల్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పుట్టుకొస్తున్నారని వెల్లడించారు. చిరువ్యాపారులు కూడా యూపీఐ సేవలు బ్యాంకింగ్ సదుపాయాలు వాడుకుంటున్నారని గుర్తుచేశారు. ప్రధానమంత్రి ప్రారంభించిన 91 ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్ల ద్వారా దేశవ్యాప్తంగా 85 జిల్లాల్లో రెండు కోట్ల మందికి పైగా ప్రజలు ఎఫ్ఎం రేడియో ప్రసారాలు వినవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సాం, మేఘాలయా, నాగాలాండ్, హరియాణా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ, చత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని పలు మారుమూల జిల్లాలతోపాటు లద్దాఖ్, అండమాన్, నికోబార్ దీవుల్లో ఎఫ్ఎం రేడియో సేవలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి.

**రికమండేషన్లకు చరమగీతం**

ఆలిండియా రేడియో వంటి కమ్యూనికేషన్ చానళ్లు మొత్తం దేశాన్ని, దేశంలోని 140 కోట్ల మందిని అనుసంధానించాలన్నదే తమ విజన్, మిషన్ అని ప్రధాని మోదీ వివరించారు. గతంలో రికమండేషన్ల ఆధారంగా పద్మ పురస్కారాలు ప్రదానం చేసేవారని, ఆ పద్ధతికి తాము చరమగీతం పాడేశామని అన్నారు. దేశానికి, సమాజానికి అందించిన విలువైన సేవల ఆధారంగానే ఈ పురస్కారాలు అందజేస్తున్నామని చెప్పారు. ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్ల ప్రారంభోత్సవంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పలువురు పద్మ పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ వారికి స్వాగతం పలికారు.

### ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.కోటి

- మొత్తం కల్యాణ కర్ణాటకకు రూ.5,000 కోట్లు
- కర్ణాటక ప్రచారంలో రాహుల్ హామీల వర్షం



ఫలూదా రుచి చూస్తున్న రాహుల్

సాక్షి, బళ్లారి: కర్ణాటకలో అధికారంలోకి వస్తే ప్రతి గ్రామ పంచాయతీకి రూ.కోటి, కళ్యాణ కర్ణాటక ప్రాంతాభివృద్ధికి రూ.5,000 కోట్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. శుక్రవారం కలబురిగి జిల్లాలోని జేవర్గి సభలో హోరు వానలోనూ రాహుల్ ప్రసంగించారు. 'బళ్లారిలో రూ.5,000 కోట్లతో వస్త్ర పరిశ్రమను తెస్తాం. జిల్లాను ప్రపంచ జీన్స్ హబ్‌గా, జీన్స్ రాజధానిగా మారుస్తాం. 50 వేల ఉద్యోగాల భర్తీని పూర్తిచేస్తాం' అని అన్నారు. 'ప్రతీ పనికి కాంట్రాక్టర్ల నుంచి మంత్రులు 40 శాతం కమిషన్ గుంజారు. ఈ ప్రభుత్వ దోపిడీతో బళ్లారి ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు'' అని ఆరోపించారు. తాము 150 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేయడాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తంచేశారు.

### సూడాన్ నుంచి మరో 754 మంది రాక

న్యూఢిల్లీ/కైరో: సూడాన్‌లో చిక్కుకుపోయిన మరో 754 మంది భారతీయులు 'ఆపరేషన్ కావేరి'లో భాగంగా శుక్రవారం స్వదేశం చేరారు. ఈ మేరకు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ట్వీట్ చేశారు. ఇప్పటిదాకా 1,360 మందిని తీసుకొచ్చినట్టు చెప్పారు. వీరిలో 17 మంది తెలంగాణ వాసులు కూడా ఉన్నట్లు ఢిల్లీలోని తెలంగాణ భవన్ తెలిపింది. మరోవైపు సూడాన్‌లో హింస ఆగడం లేదు. 72 గంటల కాల్పుల విరమణకు రెండు పక్షాలు అంగీకరించి గంటలైనా కాకుండానే రాజధాని ఖార్టూమ్, ఒండుర్మన్, కఫోరీల్లో పోరు తీవ్రమైంది.

### నా కూతురు వల్లే రిషి ప్రధాని అయ్యారు

**సుధా నారాయణ మూర్తి ఆసక్తికర వ్యాఖ్య**



న్యూఢిల్లీ: ప్రముఖ మహిళా రచయిత, దాతృత్వశీలి, భారతీయ టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకులు నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి.. తన అల్లుడు రిషి సునాక్‌నుద్దేశిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బంధువులతో మాట్లాడుతూ ఆమె చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. ' నా కూతురు అక్షతామూర్తి కారణంగానే రిషి సునాక్ బ్రిటన్ ప్రధానమంత్రి కాగలిగారు. నా అల్లుడు నిజానికి పంజాబీ. 150 ఏళ్ల క్రితమే వాళ్ల పూర్వీకులు భారత్‌ను వీడారు. వారు తమ మతాన్ని విశ్వసిస్తారు. రిషి వాళ్ల అమ్మగారు సోమవారం ఉపవాసం ఉంటారు. అయినాసరే అక్షతతో వివాహం తర్వాత రిషి ప్రతి గురువారం ఉపవాసం పాటించడం అలవాటుచేసుకున్నారు. భార్య 'పలుకు'బడి ఎంతగా పనిచేస్తుందో చూశారుగా. నేను నా భర్తను గొప్ప వ్యాపారవేత్తగా మార్చాను. అక్షత తన భర్తను ఏకంగా బ్రిటన్ ప్రధానమంత్రి స్థాయికి తీర్చిదిద్దింది. చూశారా.. భర్తను భార్య ఎంతగా మార్చివేయగలదో !. ఇదంతా అర్ధాంగి ఘనత' అంటూ సుధామూర్తి సరదాగా వ్యాఖ్యానించారు. మంత్రాలయంలోని గురు రాఘవేంద్రను నారాయణమూర్తి కుటుంబం ఎంతగానో ఆరాధిస్తుంది. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను మొదలుపెట్టింది కూడా గురువారమే. అక్షతను రిషి 2009లో వివాహం చేసుకున్నారు. తండ్రి నారాయణమూర్తి ద్వారా సంక్రమించిన ఆస్తుల కారణంగా అక్షత పేరిట దాదాపు రూ.7,500 కోట్ల స్థిర,చరాస్తులున్నాయి. ఇప్పటికీ ఆమెకు ఇన్ఫోసిస్‌లో అత్యంత కనిష్ఠ స్థాయిలో వాటాలున్నాయి.

## ఊరేగింపుగా ఎందుకు తీసుకెళ్లారు ?



- పోలీసుల సమక్షంలోనే అతీక్ హత్యకు ఎలా తెగించారు?
- నివేదిక ఇవ్వాలని యూపీ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతని సోదరుడు అష్రాఫ్ కస్టడీలో ఉండగా పోలీసుల కళ్లెదుటే హత్యకు గురైన ఘటనపై సుప్రీంకోర్టు శుక్రవారం ప్రశ్నల వర్షం కురిపించింది. దీనిపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా పోలీసులు, యూపీ సర్కారుకు పలు ప్రశ్నలు సంధించింది. ' అతీక్‌ను ఆస్పత్రికి తీసుకొస్తారని నిందితులకు ముందే ఎలా తెలుసు ? మేం కూడా టీవీలో చూశాం. ఆస్పత్రి గేటు నుంచి వారిని లోపలికి అంబులెన్స్‌లో ఎందుకు తీసుకెళ్లలేదు. మీడియా సమక్షంలో వారిని ఎందుకు ఊరేగింపుగా నడిపిస్తూ తీసుకెళ్లారు?. అతీక్ పోలీసు కస్టడీలో ఉండగా మీడియా చూస్తుండగా షూటర్లు హత్యకు ఎలా తెగించగలిగారు?' అని యూపీ సర్కార్ తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీని జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ప్రశ్నించింది. దర్యాప్తు పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

**విద్వేష ప్రసంగాలపై కేసులు నమోదుచేయండి**

న్యూఢిల్లీ: దేశంలో మత సామరస్యానికి తీవ్ర భంగం వాటిల్లేలా విద్వేష ప్రసంగాలు చేసే వారిపై సుమోటో కేసులు నమోదుచేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. లేదంటే కోర్టు ధిక్కార చర్య తప్పదని డీజీపీలను హెచ్చరించింది.



ఈ ఆరేళ్ల పిల్లి ఏకంగా 18 కేజీలుంది! ప్రపంచంలోనే అత్యంత బరువైన పిల్లి ఇదేనని భావిస్తున్నారు. అమెరికాలో ఫోర్డ్ అనే ఈవిడ దీన్ని పెంచుకుంటోంది. బరువు తగ్గించి ఆరోగ్యంగా తయారు చేస్తానంటోంది.

# పండుగలా టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం

- కావలిలో రూ.161.11 కోట్లతో 2,112 ఇళ్ల నిర్మాణం
- సంతోషంగా గృహ ప్రవేశం చేసిన పేదలు



గృహ ప్రవేశం చేసిన కుటుంబంతో మంత్రి సురేష్, ఎమ్మెల్యే రామిరెడ్డి తదితరులు

కావలి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని మద్దూరు పాడులో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం పండుగలా జరిగింది. రూ.161.11 కోట్లతో నిర్మించిన 2,112 ఇళ్ల సముదాయాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం ప్రారంభించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. పండుగ వాతావరణంలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి వసతులు కల్పించకుండానే గోడలు కట్టి గృహ ప్రవేశాలంటూ ఎన్నికల వేళ లబ్ధిదారులను మోసం చేసిందని గుర్తు చేశారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో గృహ సముదాయాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి నిధులు మంజూరు చేసి ఆ పనులను పూర్తి చేయించారని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పేపరు మీద లెక్కలు..

# చూస్తే బోగస్ సంస్థలు!

**నకిలీ కంపెనీలతో భారీగా పన్ను ఎగవేత**

**18 సంస్థలను గుర్తించిన అధికారులు**

**43 కేసులు నమోదుచేసిన వాణిజ్యపన్నుల శాఖ**

విజయవాడ గాంధీనగర్‌లో మదీనా ఎంటర్ ప్రైజెస్ అనే బోగస్ సంస్థను సృష్టించి పాత ఇనుము విక్రయాల ద్వారా రూ.7.2 కోట్లకు పైగా టర్నోవర్ చేసినట్లు లెక్క చూపారు. ఈ లావాదేవీలన్నీ పేపరు మీద ఉన్నాయి తప్ప.. వాస్తవంగా సరుకు కొన్న, అమ్మిన దాఖలాల్లేవు. ఈ విషయాన్ని అధికారులు టోల్‌గేట్ ద్వారా వెళ్తున్న వాహనాల ఫాస్ట్యాగ్, వేబిల్లుల సిస్టం ద్వారా కనుగొన్నారు.

విజయవాడ-3 సర్కిల్ పరిధిలోని పెనమలూరులో కె.వి.రావు ట్రేడర్స్ పేరుతో ఫేక్‌సంస్థను సృష్టించి రూ.2.27 కోట్లకు పైగా టర్నోవర్ చేసినట్లు కనుగొన్నారు. ఇవన్నీ పేపరు పైన లావాదేవీలే తప్ప.. వాస్తవంగా అమ్మకాలు, కొనుగోళ్లు జరగలేదని అధికారులు గుర్తించారు.



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇలా బోగస్ సంస్థలు సృష్టించి ఇన్‌పుట్ ట్యాక్స్ (కొనుగోలు చేసిన వస్తువులపై చెల్లించేపన్ను) కట్టకుండా ఎగవేసే దొంగల్ని వాణిజ్యపన్నుల అధికారులు వేటాడుతున్నారు. తుక్కు ఇనుముకు సంబంధించి కాగితాలపైనే సరఫరా చేసినట్లు చూపుతూ, మాన్యుఫాక్చర్ యూనిట్లకు లబ్ధి చేకూరుస్తున్న వారిని గుర్తించి పెనాల్టీలు వేసేదిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల విజయవాడలో పాత ఇనుము వ్యాపారానికి సంబంధించి నమోదై ఉన్న సంస్థల్లో వాణిజ్యపన్నుల అధికారులు చేసిన తనిఖీల్లో పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ తనిఖీల్లో 43 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో 18 బోగస్ సంస్థలు ఉన్నట్లు గుర్తించారు. వీటి ద్వారా రూ.40 కోట్లకుపైగా టర్నోవర్ జరిగినట్లు గుర్తించారు. ఆ సంస్థలకు సంబంధించి అసలైన యజమానులను గుర్తించి పెనాల్టీ విధించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**నకిలీ సంస్థలను సృష్టిస్తున్నారిలా..**

పాత ఇనుము వ్యాపారం చేసే వారిలో కొందరు వివిధ మార్గాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారు. తమ వద్ద పనిచేసే పేదల ఆధార్‌కార్డు తీసుకుని పాన్‌కార్డు దరఖాస్తు చేసి, దొంగ రెంటల్ అగ్రిమెంట్‌తో ఆన్‌లైన్‌లో కాటన్, టెక్స్‌టైల్స్, కిరాణా వ్యాపారం పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తర్వాత పాత ఇనుము కమోడిటీని దానికి యాడ్ చేస్తున్నారు. విచ్చలవిడిగా ఇన్‌వాయిస్‌లు, వేబిల్లులు సృష్టించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని దొంగచాటుగా కాగితాలపైనే సరఫరా చేసినట్లు చూపి, మాన్యుఫాక్చరింగ్ సంస్థలకు లబ్ధి చేకూరుస్తున్నారు. మున్సిపల్ పన్ను రశీదులను సైతం ఈ బోగస్ సంస్థల సృష్టికి కొంతమంది వాడుకుంటున్నారు. మున్సిపల్ వెబ్‌సైట్ నుంచి ఏదో పేరు మీద ఉన్న పన్ను రశీదులను డౌన్‌లోడ్ చేసుకొని, దొంగ లీజు అగ్రిమెంట్లతో నకిలీ సంస్థలను సృష్టిస్తున్నారు.

### మాన్యుఫాక్చరింగ్ సంస్థలకు లబ్ధి ఇలా..

పాత ఇనుము సేకరించే హాకర్స్‌కు ఎటువంటి ఇన్‌పుట్ ట్యాక్స్ ఉండదు. పాత ఇనుము వివిధ మార్గాల్లో కొన్న దానికి బిల్లులు ఉండవు. ఇలా కొనుగోలు బిల్లుల్లేకుండా సరుకును రీరోలింగ్ మిల్లుకు సరఫరా చేస్తే ఆ కంపెనీ వారు ప్రభుత్వానికి 18 శాతం ట్యాక్స్ చెల్లించాలి. కానీ ట్యాక్స్ కట్టకుండా ఎగవేసేందుకు ఈ నకిలీ సంస్థలను సృష్టించి ఫేక్ అమ్మకం బిల్లులను జనరేట్ చేసి, ఈ-వేబిల్లులు, బ్యాంకు అకౌంట్‌ల ద్వారా లబ్ధిపొంది, వచ్చే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను రీరోలింగ్ సంస్థలకు పాస్ చేస్తున్నారు. ఇక్కడ తయారయ్యే వస్తువులకు దొంగ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను వాడుకుని ఈ మాన్యుఫాక్చరింగ్ సంస్థలు లబ్ధిపొందుతున్నాయి. బోగస్ సంస్థలను సృష్టించి పాత ఇనుమును ఎక్కువగా విజయవాడ నుంచి హైదరాబాద్ తరలిస్తున్నారు.

### దోషులను పట్టుకునేందుకు చర్యలు



బోగస్ సంస్థలు సృష్టించి, పన్ను ఎగవేసే వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకుంటున్నాం. రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులతో పాటు, దాని వెనుక ఉన్న అసలైన దోషులను, సాఫ్ట్‌వేర్, ప్రత్యేక నిఘా ఆధారంగా గుర్తించి, వారు టర్నోవర్ చేసిన మొత్తానికి సంబంధించి పెనాల్టీ వసూలు చేస్తాం. ఇటీవల విజయవాడలో చేసిన తనిఖీల్లో 43 కేసులు నమోదు చేశాం. ఇప్పటివరకు విచారణలో 18 బోగస్ సంస్థలను గుర్తించాం.

– ఇ.కృష్ణమోహన్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్, వాణిజ్యపన్నుల శాఖ విజయవాడ రీజియన్

### టెంట్‌హౌస్ రంగ అభివృద్ధికి సహకరించాలి

**సప్లయర్స్ అండ్ డెకరేటర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రవి జిందాల్**



మాట్లాడుతున్న రవి జిందాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న టెంట్‌హౌస్ రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు అందించి, ఈ రంగంపై ఆధారపడినవారి అభివృద్ధికి సహకరించాలని ది న్యూ ఫంక్షన్ మెటీరియల్స్ సప్లయర్స్ అండ్ డెకరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రవి జిందాల్ కోరారు. అసోసియేషన్ సమావేశం శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరిగింది. రవి జిందాల్ మాట్లాడుతూ డెకరేషన్ సామగ్రిపై జీఎస్టీని 18 నుంచి 12 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలనే ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ చావల్, కోశాధికారి పంకజ్, తెలంగాణ రాష్ట్ర కోశాధికారి సి.కిషోర్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాషా, ప్రధాన కార్యదర్శి ఎల్.మల్లికార్జున రావు, కోశాధికారి టివెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ది న్యూ ఫంక్షన్ మెటీరియల్స్ సప్లయర్స్ అండ్ డెకరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న టెంట్ డెకార్స్ ప్రదర్శన శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల షామియానాలు, కుర్చీలు, టేబుళ్లు , కృత్రిమంగా తయారుచేసిన డెకరేషన్ వస్తువులు, క్యాటరింగ్‌కు ఉపయోగించే వంట పాత్రలు, మ్యాట్‌లు, స్వాగతం పలికే బొమ్మలు, దేవతామూర్తుల విగ్రహాలు వంటివి అందుబాటులో ఉన్నాయి.

## ఇక శనివారం కూడా పాస్‌పోర్ట్ సేవలు

**రాష్ట్రవ్యాప్తంగా 2,200 స్లాట్‌లు**

మురళీనగర్ (విశాఖ ఉత్తర): పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో శనివారం నుంచి ప్రత్యేక సేవలు ప్రారంభం కానున్నాయి. సాధారణంగా పాస్‌పోర్టు సేవా కేంద్రాలు వారంలో 5 రోజులే పని చేస్తాయి. ప్రస్తుతం పాస్‌పోర్టులకు ఉన్న డిమాండ్ కారణంగా కార్యాలయాలు శనివారం కూడా పనిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పాస్‌పోర్టులకు డిమాండ్ తగ్గేవరకూ కేంద్రాలు ప్రతి శనివారం కూడా పనిచేయనున్నాయి. ఇందుకుగాను ప్రత్యేక సిబ్బందిని అధికారులు నియమించారు. విశాఖ, విజయవాడ, భీమవరం, తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ఒక్క శనివారం నాడే 2,200 స్లాట్‌లు రిలీజ్ చేస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారులు సూచించారు.

## ఏపీ బిషప్స్ కౌన్సిల్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి/కృష్ణలంక (విజయవాడతూర్పు)/తిరుపతి కల్చరల్ : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రాణిగారితోటలోని ఎరుషలేమ్ ప్రార్థన మందిరంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశంలో ఏపీ బిషప్స్ కౌన్సిల్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ యలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ.. క్రైస్తవ ప్రతినిధులందరూ క్రీస్తుమార్గంలో నడవాలని ఆకాంక్షించారు. క్రైస్తవ నాయకులు ప్రతి విషయంలోనూ జాగ్రత్త వహించాలని, మాట తీరు, ప్రవర్తన, నడత అన్ని విషయాల్లోను ఆదర్శంగా ఉండాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన 26 జిల్లాల బిషప్ కౌన్సిల్ అధ్యక్ష , కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు బిషప్ రత్న కుమార్, అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి వానాల డేవిడ్‌రాజు, కోశాధికారి విక్టర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కృష్ణా తీరాన ఫుడ్ ఫెస్టివల్

- విజయవాడ భవానీపురం పున్నమి ఘాట్‌లో ఏర్పాటు
- ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు వీలుగా సాంస్కృతిక కార్యక్రమాలు
- మే 7వ తేదీ వరకు నిర్వహణ



విజయవాడ నగరంలో ఫుడ్ ఫెస్టివల్‌కు చేస్తున్న ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నదీ తీరాన ప్రజలు చల్లని గాలులతో కూడిన ప్రదేశంలో సేద తీరేందుకు వీలుగా విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ) ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. కృష్ణా నది ఒడ్డునున్న భవానీపురంలోని పున్నమి ఘాట్‌లో ఏప్రిల్ 29 నుంచి మే 7 వరకు ఫుడ్ ఫెస్టివల్ జరగనుంది. 'ఫ్లేవర్స్ ఆఫ్ ఇండియా' థీమ్ తో తొలిసారిగా నదీ తీరాన ఈ ఫుడ్ ఫెస్టివల్ ను వీఎంసీ ఏర్పాటు చేసింది. స్కూళ్లకు వేసవి సెలవులు కావడంతో, పిల్లలు,పెద్దలు ఈ ప్రాంతంలో కనీసం 2 గంటల పాటు సేద తీరటంతోపాటు వారిని ఆహ్లాద పరిచే విధంగా ఈ ఫుడ్ ఫెస్టివల్ ఉండనుంది. ఇందులో ప్రసిద్ధిగాంచిన పంజాబీ, రాజస్థానీ, ఢిల్లీ, కేరళ, తందూరిలు, తెలుగు రాష్ట్రాల రుచికరమైన వంటకాలను 20కి పైగా స్టాల్స్‌లో తీసుకురాబోతున్నారు. విజయవాడకి సంబంధించి ప్రముఖ హోటళ్లు ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో భాగస్వామ్యమవుతున్నాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ ఫుడ్ ఫెస్టివల్ ఉంటుంది. నదీ తీరాన ఈట్ స్ట్రీట్ తరహాలో దీన్ని అభివృద్ధి చేసేందుకు వీలుగా ఇక్కడ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ప్రజలకు రుచికరమైన ఆహారంతో పాటు లైవ్ రాక్ బ్యాండ్, డ్యాన్స్, జుంబా, గోడ, రోడ్డు పెయింటింగ్, శాండ్ ఆర్ట్, స్టాండ్-అప్ కామెడీ, వంటి ఈవెంట్స్‌తో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. జబర్దస్త్ కామెడీ షో నటులతో కామెడీషో ఏర్పాటు చేస్తున్నారు. కాగా, ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకోవడమే బాబు లక్ష్యం

**943వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు**



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా ప్రభుత్వాన్ని ఆటంకపరచడం, బహుజనుల సంక్షేమాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా బాబు ఆధ్వర్యంలో కులవాదులు కోర్టుల్లో తప్పుడు కేసులు వేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 943వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. బాబు ఆధ్వర్యంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఒకే అంశంపై ఇన్ని పిటిషన్‌లు వేసిన దాఖలాలు లేవన్నారు. రూ.లక్షల కోట్లు ఖర్చుపెట్టి కేసులు వేస్తుండడంతో ఆంతర్యమేమిటో ప్రజలకు అర్థమైందని త్వరలో వారికి తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. బురిడీ మాటలతో రైతులను నిలువునా ముంచిన చంద్రబాబు ఈ ప్రాంతంలో అభివృద్ధి ఏమీ చేయకుండానే మొండిగోడలను చూపించి తప్పుడు ప్రచారానికి దిగడం సిగ్గుచేటన్నారు. గ్రాఫిక్స్ బొమ్మలు చూపించి ప్రపంచంలో గొప్ప రాజధాని నిర్మిస్తానని చెప్పిన బాబు.. ఇప్పుడు మొండి గోడలు, చిట్టడవి మిగలడంతో తాను చేసిన తప్పును ఇతరులపై నెట్టేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సామాజిక న్యాయం కోసం అసమానతలు తొలగించేందుకు అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వికేంద్రీకరణ ద్వారా ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం వ్యయంలో జోక్యం చేసుకోలేం

**అది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వ్యవహారం • స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం.. పిల్ కొట్టివేత**

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు వ్యయం వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. అది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వ్యవహారమని స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు మొత్తం వ్యయం నుంచి విశాఖపట్నం నగరానికి మంచి నీరు అందించేందుకు కేటాయించిన రూ.7,214 కోట్లను తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) కొట్టేసింది. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని న్యాయస్థానాలు ఆదేశాలు ఇవ్వలేవని తేల్చి చెప్పింది. పోలవరం ప్రాజెక్టు వ్యయాన్ని మొత్తం తామే భరిస్తామని ఇచ్చిన హామీని కేంద్రం ఉల్లంఘిస్తే, దానికి కట్టుబడి ఉండాలని తాము ఆదేశాలు ఇవ్వలేమంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విభజన చట్టం, పార్లమెంట్‌లో ఇచ్చిన హామీ మేరకు పోలవరం ప్రాజెక్టు వ్యయంలో విశాఖ నగరానికి తాగు నీరు అందించేందుకు అయ్యే వ్యయాన్ని అంతర్భాగంగా పరిగణించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ అమలాపురానికి చెందిన రమేష్‌చంద్ర వర్మ దాఖలు చేసిన పిల్‌పై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది మంగెన శ్రీరామారావు వాదనలు వినిపిస్తూ.. విశాఖ ప్రజల దాహార్తిని, పారిశ్రామిక అవసరాలను తీర్చేందుకు కేటాయించిన రూ.7,214 కోట్లను పోలవరం ప్రాజెక్టు వ్యయంలో అంతర్భాగంగా పరిగణిస్తున్నట్లు కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందన్నారు. అయితే ఈ హామీ నుంచి కేంద్రం ఇప్పుడు తప్పుకుందన్నారు.

## 'చెట్ల నరికివేతపై నిర్దిష్ట వివరాలతో పిల్ వేసుకోండి'

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా చెట్ల నరికివేతపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. చెట్లు ఎవరు కొట్టేస్తున్నారో నిర్దిష్టంగా పేర్కొనకుండా, అందరూ చెట్లు కొట్టేస్తున్నట్లు పిటిషన్ దాఖలు చేస్తే తాము ఎవరికి ఆదేశాలు ఇవ్వగలమని ప్రశ్నించింది. నిర్దిష్టంగా ఎవరు చెట్లు కొట్టేస్తున్నారో పేర్కొంటూ పిల్ దాఖలు చేస్తే పరిశీలిస్తామంది. తిరిగి పిల్ దాఖలుకు పిటిషనర్‌కు వెసులుబాటునిచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో విచక్షణారహితంగా చెట్లను నరికేస్తూ టింబర్ డిపోలకు తరలిస్తున్నారని సామాజిక కార్యకర్త అయ్యల సోమయాజుల రామగణపతి శాస్త్రి హైకోర్టులో ఇటీవల ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు.

# అత్యంత అరుదైన గ్యాస్ట్రిక్ టెరటోమా కణితి తొలగింపు

- గుంటూరు జీజీహెచ్‌లో చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స
- రూ.10 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్ ఆరోగ్యశ్రీతో పూర్తి ఉచితంగా..



చిన్నారి, తల్లిదండ్రులతో డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ ప్రభావతి

గుంటూరుమెడికల్ : గుంటూరు జీజీహెచ్ చిన్న పిల్లల శస్త్రచికిత్స వైద్య నిపుణులు అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి పది నెలల చిన్నారి ప్రాణాలు కాపాడారు. అత్యంత అరుదైన కణితిని చిన్నారి కడుపు నుంచి తొలగించి రికార్డు సృష్టించారు. పిల్లల శస్త్ర చికిత్స వైద్య విభాగాధిపతి(పీడియాట్రిక్ సర్జరీ) డాక్టర్ చందా భాస్కరరావు శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం జాలాదికి చెందిన గోగుల మూడి నాగార్జున, లావణ్య దంపతుల పది నెలల రియాన్స్ ఈ నెల ఒకటో తేదీ నుంచి వాంతులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు పలు ప్రైవేటు ఆస్పత్రులను సంప్రదించినా ప్రయోజనం లేకపోగా సమస్య మరింత పెరగసాగింది. తల్లిదండ్రులు 6న గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. పీడియాట్రిక్ వైద్యులు రెండు రోజుల పాటు చిన్నారికి చికిత్స అందించి ఈ నెల 8న పీడియాట్రిక్ సర్జరీ వైద్య విభాగానికి రిఫర్ చేశారు. అన్ని రకాల పరీక్షలు చేసి ఉదర కోశ రాక్షస కణితి(గ్యాస్ట్రిక్ టెరటోమా) ఉన్నట్లు నిర్ధారించారు. 20 సెంటీ మీటర్ల పొడవు, 18 సెంటీమీటర్ల వెడల్పు, 15 సెంటీమీటర్ల లోతుతో, చిన్నారి పొట్టను చాలా వరకు ఆక్రమించింది. ప్రపంచంలో ఇప్పటి వరకు ఇలాంటి ట్యూమర్లు కేవలం 112 మాత్రమే నమోదయ్యాయి. ఈ నెల 15న ఐదున్నరగంటల సేపు ఆపరేషన్ చేసి కణితిని పూర్తిగా తొలగించారు. సుమారు రూ.10 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేసినట్టు వివరించారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతో పాటు డాక్టర్ జయపాల్, డాక్టర్ సుమన్, డాక్టర్ మౌనిక, డాక్టర్ బారిష్, డాక్టర్ పరశురామ్, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ నాగభూషణం, డాక్టర్ వహిద పాల్గొన్నట్లు వెల్లడించారు.

## క్లుప్తంగా...

### 18న కృష్ణా ట్రిబ్యునల్ విచారణ

సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణలకు పంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-2 మే 18 నుంచి విచారణ చేపట్టనుంది. ఈ దఫా రెండు రోజుల పాటు విచారించనుంది. రెండు రాష్ట్రాల తరఫున సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయడంతోపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు తెలంగాణ సర్కార్ 90 టీఎంసీలను కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై కూడా విచారించనుంది.

### వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

**మే 3 వరకు దరఖాస్తుల స్వీకరణ**

సాక్షి,అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 2023-24 సంవత్సరంలో పెట్టుబడి సాయం కోసం కొత్తగా అర్హత పొందే, గతంలో అర్హత కలిగి లబ్ధి పొందని భూ యజమానులు, అటవీ భూ సాగుదారులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మే 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత సాయం మేలో నేరుగా అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ ఏడాది కొత్తగా అర్హత పొందిన రైతులు, అర్హత కలిగి ఇంతవరకు దరఖాస్తు చేసుకోని రైతులు సమీప ఆర్బీకే కార్యాలయంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి, రైతు భరోసా పోర్టల్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని కోరారు. గతేడాది లబ్ధి పొంది ప్రస్తుతం చనిపోయి ఉంటే, అలాంటి రైతుల భార్య లేదా భర్త నామినీగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### అవినాశ్‌రెడ్డిని ఇరికించేందుకు కుట్ర

- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు: తన రాజీనామా కోసం టీడీపీ నాయకులు ఎదురు చూస్తున్నారని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చెప్పారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముద్దాయి అని నిర్ధారిస్తూ కోర్టు తీర్పు వెలువరిస్తే తనతోపాటు జిల్లాలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలం అందరం కలిసి రాజీనామా చేస్తామని గతంలో చెప్పామన్నారు. గతంలో తాను ప్రకటించిన వీడియోలను పరిశీలించుకోవాలని సూచించారు. అవినాశ్‌రెడ్డిని ముద్దాయిగా చేర్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆనాడే తాను చెప్పానని గుర్తుచేశారు. ఆ మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామన్నారు. అవగాహన లేని టీడీపీ నేతలు ఇంకా ఎమ్మెల్యే రాజీనామా చేయలేదే అంటున్నారన్నారు. ఎలాగైనా అవినాశ్‌రెడ్డిని ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారని చెప్పారు. ఈ కేసులో ఎంపీ ముద్దాయి అని జడ్జి తీర్పు ఇస్తే ఈ రాజకీయాల్లో తాను కొనసాగాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కాకర్ల నాగేశ్వరెడ్డి పాల్గొన్నారు.

### మోటార్లకు మీటర్లు పెడితే పగలగొట్టండి

**టీడీపీ నేత నారా లోకేశ్**

కర్నూలు(అర్బన్): వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడితే పగలగొట్టాలని, రైతులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. 'యువగళం' పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గం మాచాపురం గ్రామంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ జగన్ ఒక హాలిడే సీఎం అని, అందువల్లే క్రాప్ హాలిడే, పవర్ హాలిడే, ఆక్వా హాలిడే ప్రకటిస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతే వ్యవసాయశాఖ మంత్రి కోర్టులో దొంగతనం చేసే పనిలో బిజీగా ఉన్నారన్నారు. రాయలసీమ రైతులకు వరంలా ఉన్న డ్రిప్ ఇరిగేషన్‌ను జగన్ నిర్వీర్యం చేశారని ఆరోపించారు. టీడీపీ హయాంలో రూ.50 వేల కంటే తక్కువ ఉన్న రైతుల రుణాలను ఒక్క సంతకంతో మాఫీ చేశామన్నారు. 'మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అలియాస్ విషనాగు అవినీతి ఆనవాళ్లు అడుగడుగునా కనిపిస్తున్నాయి' అని లోకేశ్ అన్నారు.

### చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలను వంచించడం సరికాదు

**సీపీఎం నేత వి.శ్రీనివాసరావు**

సాక్షి, న్యూఢిల్లీ : టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో ఒక మాట, ప్రధాని నరేంద్ర మోదీకి మరో మాట చెప్పి ప్రజలను వంచించటం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రధాని మోదీ విధానాలన్నింటినీ తాను ఏకీభవిస్తానని, ఆయన విజన్ తనకు నచ్చిందన్న చంద్రబాబు వ్యాఖ్యలను శ్రీనివాసరావు తప్పుబట్టారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ వ్యతిరేకిస్తున్న ఉచితాలను తాను అధికారంలోకి వస్తే అమలు చేస్తానని చంద్రబాబు చెప్పడం పొంతనలేని విధానాలకు నిదర్శనమన్నారు.

# ఎన్టీఆర్ శతజయంతి సభా ఫ్లాపే

## రజనీకాంత్‌ను తీసుకొచ్చినా రాని జనం

- వచ్చిన కొద్దిమందీ చంద్రబాబు, బాలకృష్ణ ప్రసంగాలకు ముందే జంప్
- చిన్న గ్రౌండ్‌లో పెట్టినా నిండని కుర్చీలు
- పోరంకి సభకు స్పందన లేకపోవడంతో బాబు డీలా



స్టేజ్ ఎదుట జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు





స్టేజీకు ఎదురుగా రెండు వైపులా ఖాళీగా కుర్చీలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సభలకు జనం రావడంలేదని మరోసారి రుజువైంది. ఎన్టీఆర్ శతజయంతి పేరుతో కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమం కూడా తుస్సుమంది. ఎన్టీఆర్ పేరు చెప్పి ఎంత హడావుడి చేసినా, చెన్నై నుంచి రజనీకాంత్‌ను తీసుకొచ్చి హంగామా చేసినా, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులందరినీ రంగంలోకి దింపినా జనం నుంచి మాత్రం స్పందన రాలేదు. సభలో సగం కుర్చీలు కూడా నిండలేదు. తాడిగడప-ఎనికేపాడు రోడ్డులోని చిన్న గ్రౌండ్‌లో తెలుగుదేశం పార్టీ శుక్రవారం ఈ సభ నిర్వహించింది. టీడీపీ నేతకు చెందిన రెండున్నర ఎకరాల ఖాళీస్థలంలో భారీ సెట్టింగులు, హోర్డింగులు, డీజే, హైమాస్ట్ లైటింగులతో హడావుడి చేసినా జనం మాత్రం పట్టించుకోలేదు.

ఈ చిన్న గ్రౌండ్‌ను నాలుగు భాగాలుగా విభజించి ఒకదాన్లో వేదిక, సెట్టింగులు వేయగా రెండో భాగాన్ని వీఐపీలు, ముఖ్యులకి, మూడు, నాలుగు భాగాలను జనానికి కేటాయించి బారికేడ్లు పెట్టి కుర్చీలు వేశారు. వీఐపీ గ్యాలరీ, ఆ తర్వాత ముఖ్యులకు కేటాయించిన గ్యాలరీల్లో ఓ మాదిరిగా జనం కనిపించారు. ప్రజల కోసం కేటాయించిన గ్యాలరీ మాత్రం వెలవెలబోయింది. ఈ గ్యాలరీలో ఎటుచూసినా ఖాళీ కుర్చీలే కనిపించాయి. భారీగా జనం వస్తారనే ఆశతో వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచినా అవి తీసుకునేవారే కరువయ్యారు. వచ్చిన కొద్దిపాటి జనంలో సగంమందికిపైగా చంద్రబాబు, రజనీకాంత్, బాలకృష్ణ రాకముందే సభను వీడి వెళ్లిపోయారు. వెళ్లిపోతున్న వారిని ఆపడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించినా ఎవరూ పట్టించుకోలేదు. మిగిలిన వారిలో చాలామంది బాలకష్ణ, రజనీకాంత్, చంద్రబాబు మాట్లాడే సమయానికి వెళ్లిపోయారు. ముందుభాగంలో ఉన్న కొద్దిపాటి జనాన్నే టీడీపీ అనుకూల మీడియా, సోషల్ మీడియాలో భారీగా వచ్చినట్లు చిత్రీకరించినా వెనుకభాగంలో ఖాళీ కుర్చీలు చూసిన ఆ పార్టీ నేతలు జనం ఎందుకు రావడం లేదని మాట్లాడుకోవడం కనిపించింది. తమకు బాగా పట్టుందని చెప్పుకొనే కృష్ణాజిల్లాలో నడిబొడ్డున, అదీ అతి చిన్న గ్రౌండ్‌లో పెట్టిన సభకు జనం రాకపోవడంతో చంద్రబాబు డీలాపడ్డారు.

**జనం రావడం లేదనే చిన్న గ్రౌండ్.. అయినా ఫలితం నిల్**

తన సభలకు జనం రావడంలేదని తెలియడంతోనే భారీగా వచ్చినట్లు చూపించుకునేందుకు చంద్రబాబు చిన్న గ్రౌండ్లను ఎంచుకుంటున్నారు. రెండురోజుల కిందట పల్నాడు జిల్లా అమరావతి, సత్తెనపల్లి సభలను కూడా చిన్న గ్రౌండ్లలో పెట్టినా జనం రాలేదు. అంతకుముందు మచిలీపట్నం, ఆ తర్వాత గుంటూరు జిల్లాలో ఎక్కడ చూసినా ఆయన సభలను జనం పట్టించుకోలేదు. పల్నాడు జిల్లా నాయకులు ఎంత ప్రయత్నించినా, భారీగా తాయిలాలు పంచినా జనసమీకరణ చేయలేకపోయారు. దీంతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ పెట్టి వారికి క్లాసు పీకారు. జనాన్ని ఎందుకు తీసుకురావడంలేదని ప్రశ్నించి చిందులు తొక్కారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో తగిలిన షాక్‌తో కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలో ఎన్టీఆర్ శతజయంతి సభకు భారీగా జనసమీకరణ చేయాలని నిర్ణయించారు. రజనీకాంత్‌ను తీసుకురావడం, ఎన్టీఆర్ కుటుంబసభ్యులందరినీ రంగంలోకి దింపడం ద్వారా హైప్ తీసుకురావడానికి ప్రయత్నించారు. అవేమీ ఫలితాన్ని ఇవ్వలేదు. ఇది కూడా ఫ్లాప్ అవడంతో టీడీపీ నేతలు నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు.

టీడీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు సైతం ఎంత ప్రయత్నించినా, ప్రలోభాలు పెట్టినా జనం రావడంలేదని వాపోతున్నారు.

# అవినాశ్‌పై సీబీఐ అభియోగాలు నిరాధారం

- వివేకా హత్య కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన అవినాశ్ న్యాయవాది
- 2017 ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆరోపణలు ఊహాజనితాలే
- స్థానిక సంస్థల ఓటర్లను సీబీఐ విచారించనే లేదు
- 2019 ఎన్నికల్లో ఎంపీ టికెట్ అవినాశ్‌కు ముందే ఖరారు
- అవినాశ్ విజయానికి ప్రచార బాధ్యతలు వివేకానే చేపట్టారు
- హత్యకు ముందు రోజు మైదుకూరులో వివేకా ప్రచారం చేశారు

సాక్షి, అమరావతి : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై సీబీఐ మోపిన అభియోగాలు నిరాధారమని, అహేతుకమైనవని అవినాశ్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు తెలిపారు. సీబీఐ అత్యుత్సాహంతో ఎంపీ అవినాశ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుందని చెప్పారు. ఎంపీకి వ్యతిరేకంగా సీబీఐ మోపిన అభియోగాలు పూర్తిగా అవాస్తవమని ఆయన ఆధారాలతో సహా న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకానందరెడ్డి ఓటమికి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి కారణమని, 2019 ఎన్నికల్లో ఎంపీ టికెట్ కోసమే వివేకాని హత్య చేయించారన్న అభియోగాలు ఊహాజనితాలు, కల్పితాలేనని విస్పష్టంగా చెప్పారు. ఈ కోణాల్లో సీబీఐ దర్యాప్తు ఎంత అహేతుకంగా సాగిందో ఆయన సవివరంగా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయస్థానం ముందు న్యాయవాది ఉంచిన ప్రధానాంశాలివీ..

▲ 2017లో కడప జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 800 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆ ఓటర్లు సమీప ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారు. పార్టీలకు వచ్చిన ఓట్లను రెవెన్యూ డివిజన్లు, ప్రాంతాలవారీగా వేరు చేసి పరిశీలించడం సాధ్యం కాదు. పోలైన అన్ని ఓట్లను కలిపి ఎన్నికల కమిషన్ లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తుంది. కాబట్టి వివేకానందరెడ్డికి ఏ అసెంబ్లీ నియోజకవర్గంలోని వారు ఓటు వేయలేదన్నది నిర్ధారించడం సాధ్యం కాదు. ఆ నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రతినిధులైన ఓటర్లే వివేకానందరెడ్డికి ఓటు వేయలేదని, అందుకు అవినాశ్, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి కారణమని సీబీఐ చెప్పడం పూర్తిగా అసంబద్ధం, నిరాధారం. పోనీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లయిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు 800 మందిని సీబీఐ విచారించిందా అంటే అదీ లేదు. అందువల్ల ఎంపీ, ఆయన తండ్రిపై సీబీఐ చేస్తున్న అభియోగాలు పూర్తిగా అవాస్తవాలు. వివేకానందరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్‌భాస్కర్‌రెడ్డిల ఇంటికి వెళ్లి వారిని నిందించారన్న సీబీఐ అభియోగం కూడా పూర్తిగా అవాస్తవం. ఆయన వారిద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేయలేదు. నిందించనూ లేదు.

▲ 2019 ఎన్నికల్లో ఎంపీ టికెట్ కోసమే వివేకానందరెడ్డిని హత్య చేయించారన్న సీబీఐ అభియోగం పూర్తిగా నిరాధారం. ఎందుకంటే అప్పటికే వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా నిర్ణయించారు. ఆయన ప్రచారం మొదలుపెట్టారు కూడా. వైఎస్ వివేకానందరెడ్డే ఎంపీగా అవినాశ్ రెడ్డి విజయం కోసం ప్రచార బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. హత్యకు ముందు రోజు కూడా వివేకానందరెడ్డి పార్టీ అభ్యర్థి అవినాశ్‌రెడ్డి తరఫున మైదుకూరు నియోజకవర్గంలో ప్రచారం చేశారు. మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డితో కలసి వివేకానందరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డిని, ఎంపీగా అవినాశ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కానీ సీబీఐ ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది. ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సీబీఐ అధికారులు ఆ విషయంపై విచారించనే లేదు. మైదుకూరులో ప్రచారం చేసిన ఇళ్లకు వెళ్లి విచారించినా వాస్తవం తెలుస్తుంది. రఘురామిరెడ్డిని గానీ, మైదుకూరు నియోజకవర్గంలో గానీ విచారించకుండానే సీబీఐ అవినాశ్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తోంది. ఎంపీ టికెట్ కోసమే ఈ హత్య చేయించారన్న సీబీఐ అభియోగాలు పూర్తిగా నిరాధారం.

# ఎన్టీఆర్ యుగ పురుషుడు

- ఎన్టీఆర్ శతజయంతి సభలో నటుడు రజనీకాంత్

సాక్షి, అమరావతి/పెనమలూరు/గన్నవరం: ఆంధ్రుల అభిమాన నటుడు నందమూరి తారకరామారావు యుగపురుషుడని, ఆయన నటనే తనకు స్ఫూర్తిగా నిలిచిందని సూపర్‌స్టార్ రజనీకాంత్ చెప్పారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకిలో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ శతజయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ నటన తనపై ఎంతో ప్రభావం చూపిందని, తనను నటుడిని చేసిందని చెప్పారు. ఎన్టీఆర్‌తో తాను టైగర్ సినిమాలో నటించానని గుర్తుచేసుకున్నారు. నటుడిగా ఎన్టీఆర్ ఎంతగానో రాణించి ఎందరో అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. తెలుగువారి ఆత్మాభిమానం కోసం ఆయన రాజకీయాల్లోకి వచ్చి సమాజంలో అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. తాను ఆరేడేళ్ల వయసులో చూసిన తొలిసినిమా పాతాళభైరవి అని గుర్తుచేసుకున్నారు. తర్వాత 'లవకుశ' సినిమా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎన్టీఆర్‌ను చూశానని, శ్రీకృష్ణపాండవీయంలో ఎన్టీఆర్‌ను చూసి మైమరిచిపోయానని తెలిపారు. కండక్టర్ అయ్యాక ఎన్టీఆర్‌ను అనుకరిస్తుంటే సన్నిహితులు సినీరంగంలోకి రావాలని ప్రోత్సహించారని ఆయన చెప్పారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ వ్యక్తి కాదని, ఒక శక్తి అని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయిన ఎన్టీఆర్ ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేవరకు తెలుగుజాతి పోరాడాలన్నారు. నటుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం, తెలుగుకు వెలుగు తీసుకొచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులను సన్మానించారు. సీనియర్ జర్నలిస్టు ఎస్.వెంకటనారాయణ రచించిన 'అసెంబ్లీలో ఎన్టీఆర్ ప్రసంగాలు', 'ప్రజల చైతన్యం కోసం ఎన్టీఆర్ చారిత్రాత్మక ప్రసంగాలు' పుస్తకాలను రజనీకాంత్ ఆవిష్కరించారు. సభాప్రాంగణంలో జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలను ఆయన అభిమానులు ప్రదర్శించి సందడి చేశారు. ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, కార్యక్రమ కన్వీనర్ టి.డి.జనార్దన్, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయంలో రజనీకాంత్‌కు బాలకృష్ణ, టి.డి.జనార్దన్, అభిమానులు స్వాగతం పలికారు.

# టీడీపీ పుట్టాకే ఎస్సీలకు పదవులు

- ఎస్సీ కాలనీలను బాగుచేసింది నేనే
- అంబేడ్కర్ విదేశీ విద్యాదీవెనకు జగన్ పేరు పెట్టుకున్నారు
- టీడీపీ దళితనేతల ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ పుట్టాకే దళితులకు పదవులు వచ్చాయని ఆ పార్టీ అధినేత చంద్రబాబు చెప్పారు. వారికి పదవులు ఇప్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. శుక్రవారం జరిగిన మంగళగిరి టీడీపీ దళితనేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా ఉన్నప్పుడు పట్టుబట్టి, చొరవచూపి అంబేడ్కర్‌కి భారతరత్న వచ్చేలా చేశామన్నారు. రాష్ట్రపతిగా కేఆర్ నారాయణ్‌ను ఎంపిక చేయడంలో తెలుగుదేశం పార్టీ కీలకపాత్ర పోషించడంతోపాటు మహేంద్రనాథ్‌ను రాష్ట్ర తొలి దళిత ఆర్థికమంత్రిగా నియమించడం, కాకి మాధవరావుని తొలి రాష్ట్ర దళిత చీఫ్ సెక్రటరీగా చేయడం, ప్రతిభాభారతిని అసెంబ్లీ స్పీకర్‌ని చేయడం.. ఇలా అన్ని పదవులు తెలుగుదేశం పార్టీ పుట్టిన తర్వాతే దళితులకు వచ్చాయని చెప్పారు. దళితులకు తెలుగుదేశం పార్టీ చేసినట్లుగా దేశంలో ఏపార్టీ చేయలేదని, భవిష్యత్తులో కూడా ఎవరూ చేయలేరని పేర్కొన్నారు. కానీ వీటిని ప్రచారం చేసుకోవడంలో విఫలమయ్యామన్నారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు పెడితే వాటిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్వీర్యం చేశాడని, ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లకు కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోగా అన్ని పథకాలను రద్దుచేశారని ఆరోపించారు. అంబేడ్కర్ విదేశీ విద్యాదీవెన పథకానికి అంబేడ్కర్ పేరు తీసేసి జగన్ ఆయన పేరు పెట్టుకున్నారని చెప్పారు. అంబేడ్కర్ రాజ్యాంగం రాసేటప్పుడు పదేళ్లు రిజర్వేషన్లు పెడితే 75 ఏళ్లుగా ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ఎస్సీ కాలనీలను బాగుచేసింది తానేనన్నారు. యర్రగొండపాలెంలో నేనేదో అన్నానంటున్నారని, ఏమన్నానో చెప్పమంటే చెప్పరని పేర్కొన్నారు. గతంలో కూడా ఇదే విధంగా వ్యవసాయం దండగని, ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని తానన్నట్లు తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. ఇవన్నీ దళితవాడల్లో చెప్పి ఈ ప్రభుత్వం దళితులకు చేసిన ద్రోహాన్ని గడపగడపకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా 'దళితద్రోహి జగన్ రెడ్డి : దళితబాంధవుడు-పేదలపెన్నిధి చంద్రన్న' పుస్తకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు.

# దళిత సంక్షేమంలో చంద్రబాబు విఫలం

▶ మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పనిచేసి కూడా దళితులు గుర్తుంచుకునేలా ఏ ఒక్క పథకాన్నీ అందించలేదన్నారు. ఇప్పటికైనా దళితుల సంక్షేమంపై చర్చించేందుకు చంద్రబాబు ముందుకురావడం శుభపరిణామమని చెప్పారు. కనీసం చర్చ తర్వాతైనా వాస్తవాలు తెలుసుకుంటారన్నారు. సీఎం జగన్ దళిత సంక్షేమంలో డిస్టింక్షన్ సాధిస్తే, చంద్రబాబు ఫెయిలయ్యారని పేర్కొన్నారు. దళిత సంక్షేమం, దళితులకు ఎవరు మేలు చేశారనే అంశంపై చర్చకు తాము సిద్ధమని, అసెంబ్లీ వేదికగా చర్చిద్దామని చెప్పారు. చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీ వేదికగా దళిత సమస్యలపై చర్చకు రావాలని సవాలు చేశారు.

**విద్యతోనే దళితుల జీవితాల్లో వెలుగులు**

విద్యతోనే దళితుల జీవితాల్లో వెలుగులు సాధ్యమన్న అంబేడ్కర్ ఆలోచన స్ఫూర్తిని సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో విద్య, వైద్యరంగాల్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి భ్రష్టుపట్టించారని విమర్శించారు. సీఎం జగన్ నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, ఆరోగ్యశ్రీతో విద్య, వైద్యాలను పెట్టుబడిదారీవ్యవస్థ చేతుల్లోంచి విడిపించి సామాన్యుడికి అందించారని చెప్పారు. రాష్ట్రంలో ఎటువంటి వివక్షకు తావులేకుండా రూ.2.08లక్షల కోట్లు ప్రజలకు నేరుగా అందిస్తే.. అందులో ఏకంగా రూ.53 వేల కోట్లకుపైగా దళితులకు ఇచ్చి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడ్డారన్నారు. ఒకే ఒక్క పరీక్ష ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో పారదర్శకంగా నియామకం చేస్తే దాన్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా ఉద్యోగాలు పొందడం సంస్కరణకు నిదర్శనమని చెప్పారు. చంద్రబాబులో అసహనం పెరిగిపోతోందని, సీఎం జగన్‌ను నోటికొచ్చినట్టు మాట్లాడటం హేయమని చెప్పారు. తాను చేయలేనిది ఎదుటివారు చేస్తే ఓర్వలేని గుణం చంద్రబాబులో నిలువెల్లా ఉందన్నారు. 30 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్లస్థలాలు ఇస్తే.. సింహభాగం దళితులకే అందాయని తెలిపారు. చంద్రబాబు హయాంలో సెంటుస్థలం ఇచ్చారా? ఆయన అర్థశాస్త్రంలో ఆ విధానం ఉందా? అని ప్రశ్నించారు. 'అసెంబ్లీ కంటే ప్రజాస్వామ్యంలో చర్చావేదిక ఏం ఉంటుంది. మీరు చర్చిద్దాం అంటున్నారు కదా. అసెంబ్లీకి రండి. మీరు వస్తానంటే ప్రత్యేక అసెంబ్లీ పెట్టమని కూడా కోరతాం. అమరావతిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తామంటే దానికి వ్యతిరేకంగా కేసులు వేసింది మీరే. ఇప్పుడు దళితుల సంక్షేమం గురించి ఏం మాట్లాడతారు. విజయవాడ నడిబొడ్డున రూపుదిద్దుకుంటున్న అంబేడ్కర్ విగ్రహాన్ని చూస్తే దళితుల ఆత్మగౌరవం ఎంతగా పెరుగుతోందో తెలుస్తుంది.' అని చెప్పారు. దళితులను రాజకీయంగా ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టడమే కాకుండా కేబినెట్‌లో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. మండలిలో 43 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు ఉంటే వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సభ్యులు 22 మంది ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 29 ఎస్సీ నియోజకవర్గాలు, నాలుగు పార్లమెంటు స్థానాలు ఉంటే.. జగన్ నాయకత్వంలో 28 నియోజకవర్గాల్లోను, నాలుగు పార్లమెంటు స్థానాల్లోను గెలిచిన విషయాన్ని బాబు మర్చిపోకూడదన్నారు.

### చావుకు కారణమైన వారే ఉత్సవాలు చేస్తున్నారు

- నా అల్లుడు పెద్ద దొంగ అని ఎన్టీఆర్ చెప్పారు
- మంత్రి ఆర్‌కే రోజా



చిలకలపూడి (మచిలీపట్నం): నందమూరి తారకరామారావు చావుకు కారణమైన వారే ఆయన జయంతి ఉత్సవాలు చేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆర్‌కే రోజా విమర్శించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శుక్రవారం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ నుంచి తెలుగుదేశం పార్టీని లాక్కుని ఆయన మరణానికి కారణమైన వారు ఆయన జయంతి ఉత్సవాలు జరుపుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉంటేనే చంద్రబాబునాయుడుకు ఎన్టీఆర్ గుర్తొస్తారని చెప్పారు. 14 సంవత్సరాల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఒక్క జిల్లాకు కూడా ఎన్టీఆర్ పేరు పెట్టలేదన్నారు. ఆయన పేరుతో ఏమీ పెట్టలేదన్నారు. నా అల్లుడు పెద్ద దొంగ అని స్వయంగా ఎన్టీ రామారావే చెప్పారని గుర్తుచేశారు. గతంలో నరేంద్రమోదీ భార్యను చూసుకోలేని వాడు దేశాన్ని ఏం పాలిస్తాడని కాంగ్రెస్ పార్టీతో జతకలిసిన చంద్రబాబు ప్రస్తుతం విజన్ ఉన్న మోదీ అని ప్రకటనలు చేయటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ఎవరి కాళ్లయినా పట్టుకుని డ్రామాలు ఆడే చంద్రబాబు భవిష్యత్తులో అధికారం వస్తుందని తహతహలాడుతున్నాడని విమర్శించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన చంద్రబాబును ప్రజలు ఏ విధంగా అంగీకరిస్తారని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్ జగనే రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని ఆమె చెప్పారు.

### ఎన్టీఆర్ మరణానికి కారణం చంద్రబాబే

- మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు మరణానికి చంద్రబాబు కారకుడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తూ కొన్ని వీడియోలు, ఫొటోలు ఆవిష్కరిస్తున్న చంద్రబాబు.. ఎన్టీఆర్ చివరిదశలో చంద్రబాబు గురించి ఆవేదన వ్యక్తం చేసిన వీడియోలను కూడా విడుదల చేస్తే బాగుంటుందని చెప్పారు. ఆ వీడియోలను విడుదల చేసే దమ్ముందా... అని ప్రశ్నించారు. చనిపోయేముందు ఎన్టీఆర్ తన అల్లుడు చంద్రబాబును పరమ దుర్మార్గుడని విమర్శిస్తూ ఔరంగజేబుతో పోల్చాడని, కుమిలిపోతూ మరణించాడని తెలిపారు. చంద్రబాబు పల్నాడు జిల్లా పెదకూరపాడు, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గాల్లో చేపట్టిన 'ఇదేమి ఖర్మ' కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ షో అని పేర్కొన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేసిన తురక గంగమ్మ కుటుంబానికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఆర్థికసాయం చేశారే తప్ప వారికి బీసీల పట్ల ప్రేమే లేదన్నారు. అలా ప్రేమ ఉంటే పల్లపు రోశయ్య కుటుంబానికి ఎందుకు సాయం చేయలేదని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో దాతల సహకారంతో 42 గదులు నిర్మించి లాటరీ విధానంలో పారదర్శకంగా పేద దూదేకుల, ముస్లింలకు అందించామని చెప్పారు. వాటిని కూల్చేస్తానన్న చంద్రబాబు దమ్ముంటే వచ్చి కూల్చాలని అంబటి సవాలు చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లం చర్ల సాంబశివరావు, కళ్లం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### చంద్రబాబు ఎస్సీలకు చేసిన మేలేంటి?

- మంత్రి సురేష్



సాక్షి, అమరావతి: దళితులను దారుణంగా అవమానిస్తున్న టీడీపీ నేతలు ఎస్సీలకు వారి ప్రభుత్వం మేలు చేసినట్లు, తమ ప్రభుత్వం ఏమీ చేయనట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్సీలకు ఎంత లబ్ధి జరిగిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. తెలుగుదేశం నేతలు చెప్పుకోవడానికి ఏమీలేక తమ ప్రభుత్వంపైన, మంత్రులపైన కారుకూతలు కూస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జునపై నక్కా ఆనందబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో ఎస్సీల సంక్షేమానికి రూ.33,629 కోట్లు, ఎస్టీలకు రూ.12,488 కోట్లు కలిపి మొత్తం రూ.46,117 కోట్లు ఖర్చు చేశారని, వైఎస్ జగన్ పాలన కాలంలో 2019 నుంచి 2022 డిసెంబర్ వరకు ఎస్సీల కోసం రూ.58,353 కోట్లు, ఎస్టీల కోసం రూ.15,660 కోట్లు మొత్తం రూ.74,013 కోట్లు ఖర్చుచేశారని వివరించారు. డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా మొత్తం 1,72,82,806 మంది ఎస్సీలు, 53,89,459 ఎస్టీలకు తమ ప్రభుత్వం రూ.74,013 కోట్లు అందజేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవడానికి 23,13,385 మంది ఎస్సీలకు రూ.5,914 కోట్లు, 4,71,311 మంది ఎస్టీలకు రూ.1,218.8 కోట్లు చొప్పున మూడున్నరేళ్లలో రూ.7,132.8 కోట్లు అందించిందని తెలిపారు.

### బాబూ.. చర్చిద్దాం రా..

- దళిత ద్రోహి ఎవరో.. దళిత బాంధవుడెవరో తేల్చుకుందాం :మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ ఐదేళ్ల పాలనలో దళితులను వేధించి, దాడులకు పాల్పడిన చంద్రబాబుకు ఇప్పుడు దళితులపై ప్రేమ పుట్టుకొచ్చిందా? అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున ప్రశ్నించారు. ఐదేళ్ల టీడీపీలో.. నాలుగేళ్ల తమ ప్రభుత్వంలో దళితులకు జరిగిన సంక్షేమం, వేధింపులు, దాడులపై చర్చిద్దామన్న చాలెంజ్‌ను స్వీకరించలేని దద్దమ్మ చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. చర్చకు రమ్మని మరోసారి చాలెంజ్ విసురుతున్నానని చెప్పారు. దళిత ద్రోహి ఎవరో, దళిత బాంధవుడెవరో తేల్చుకుందామన్నారు. విశాఖపట్నం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ హయాంలో దళితుల్ని ఉద్దేశించి హేళనగా, అవమానకరంగా మాట్లాడిన చంద్రబాబు మాటలను టీవీ స్క్రీన్‌పై ప్రసారం చేసి చూపించారు. మంత్రి మాట్లాడుతూ దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా.. అని ఆనాడు చంద్రబాబు మాట్లాడిన మాటలు రికార్డుల్లో ఉన్నాయన్నారు. 'నీ కొడుకు లోకేశ్.. దళితులు ఏం పీకారు.. ఏం పొడిచారు.. అనటం నిజం కాదా? నీవు బీసీల తోకలు కత్తిరిస్తానన్నది వాస్తవం కాదా? పేదల శ్రేయస్సు కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుంటే.. కడుపు మంటతో నువ్వు, నీ కొడుకు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. గత ఎన్నికల్లో 29 ఎస్సీ నియోజకవర్గాల్లో 28 చోట్ల వైఎస్సార్‌సీపీని గెలిపించి ప్రజలు నీకు బుద్ధి చెప్పారు. భవిష్యత్‌లో కూడా ఇదే పరాభవం తప్పదు..' అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పెత్తందార్లకు వత్తాసు పలికి, ఇప్పుడు పేదల ఓట్లు దండుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాడని చెప్పారు.



## టెస్టుల్లో శ్రీలంక ‘సెంచరీ’ విజయం

బౌలర్లు రమేశ్ మెండిస్ (5/64), ప్రభాత్ జయసూర్య (2/88), అసిథా ఫెర్నాండో (3/30) రాణించడంతో... ఐర్లాండ్‌తో గాలెలో జరిగిన రెండో టెస్టులో శ్రీలంక ఇన్నింగ్స్ 10 పరుగుల తేడాతో గెలిచింది. దాంతో కరుణరత్నే కెప్టెన్సీలోని శ్రీలంక రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 1982లో టెస్ట్ హోదా పొందిన శ్రీలంక జట్టుకిది 100వ టెస్టు విజయం కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 54/2తో ఆట చివరిరోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 77.3 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది.

## సెమీఫైనల్లో సుమిత్ నగాల్



రోమా గార్డెన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ సుమిత్ నగాల్ వరుసగా మూడో విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. రోమ్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ 7–5, 6–0తో మాక్స్ హూక్స్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

## సాత్విక్–చిరాగ్ జోడీకి పతకం ఖాయం

### సింధు, ప్రణయ్‌లకు నిరాశ




దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–11, 21–12తో అహసాన్–హెంద్రా సెతియవాన్ (ఇండోనేసియా) జోడీని ఓడించింది. ఈ గెలుపుతో సాత్విక్–చిరాగ్ 1978 తర్వాత ఆసియా చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో ఫైనల్ చేరిన, పతకాన్ని ఖరారు చేసుకున్న భారతీయ జోడీగా గుర్తింపు పొందింది. 1978లో ప్రకాశ్ పదుకొనే–సయ్యద్ మోడీ జోడీ భారత్‌కు రజత పతకం అందించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ పీవీ సింధు 21–18, 5–21, 9–21తో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. కాంటా సునెయామ (జపాన్)తో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హెచ్ఎస్ ప్రణయ్ తొలి గేమ్‌ను 11–21తో కోల్పోయి, రెండో గేమ్‌లో 9–13తో వెనుకబడిన దశలో గాయంతో వైదొలిగాడు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 18–21, 21–19, 15–21తో దెజాన్–గ్లోరియా విడ్‌జాజా (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

## రన్నరప్ కార్తీక్ వెంకటరామన్



చెన్నై: సన్‌వే ఫార్మెంటెరా అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ రన్నరప్‌గా నిలిచాడు. స్పెయిన్‌లో ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 10 రౌండ్ల తర్వాత ఫెదోసీవ్ వ్లాదిమిర్ (రష్యా), కార్తీక్ వెంకటరామన్ (భారత్), ప్రణవ్ (భారత్), లియోన్ ల్యూక్ మెండోకా (భారత్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు ఈ నలుగురి మధ్య ప్లే ఆఫ్ గేమ్‌లను నిర్వహించారు. వ్లాదిమిర్, కార్తీక్ ఫైనల్ చేరగా.. ఫైనల్లో కార్తీక్‌పై నెగ్గి వ్లాదిమిర్ విజేతగా నిలిచాడు.

# లక్నో పరుగుల సునామీ

- మేయర్స్, స్టొయినిస్, బదోని, పూరన్ మెరుపులు
- 56 పరుగులతో పంజాబ్‌పై జయభేరి



‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ స్టొయినిస్

మొహాలీ: వారంకిందట గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చేతిలో బోలెడు వికెట్లున్నా తక్కువ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది లక్నో సూపర్ జెయింట్స్. ఇప్పుడిదే జట్టు పంజాబ్ కింగ్స్‌పై పరుగుల పంజా వేసింది. ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు చేసి మరీ 56 పరుగులతో ఘనవిజయం సాధించింది. మొదట లక్నో 20 ఓవర్లలో 5 వికెట్లకు 257 పరుగుల భారీస్కోరు చేసింది. స్టొయినిస్ (40 బంతుల్లో 72; 6 ఫోర్లు, 5 సిక్సర్లు), మేయర్స్ (24 బంతుల్లో 54; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), పూరన్ (19 బంతుల్లో 45; 7 ఫోర్లు, 1 సిక్స్), బదోని (24 బంతుల్లో 43; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. తర్వాత పంజాబ్ 19.5 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. అథర్వ (36 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

### దంచుడే... దంచుడే...

మేయర్స్ రెండో ఓవర్లో పెట్టిన ధనాధన్ ముహూర్తం తర్వాత వచ్చిన వారంతా దంచేసేలా చేసింది. రాహుల్ (12) నిరాశపరచగా... గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్, రజా, రబడలు వేసిన పవర్‌ప్లేలో మేయర్స్ ‘నాటు నాటు’ కొట్టుడుతో 20 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. ఇంకో ఫోర్ కొట్టి జోరుమీదున్న అతన్ని రబడ బోల్తా కొట్టించాడు. కానీ పవర్‌ప్లేలో లక్నో 74/2 స్కోరు చేసింది. ఓపెనర్ల ఆట ముగిసినా... దూకుడైతే ఎంతకీ ఆగలేదు. బదోని, స్టొయినిస్‌ల బ్యాట్లు కూడా భారీ షాట్లపైనే గురి పెట్టడంతో 7.4 ఓవర్లలోనే స్కోరు 100 దాటింది. గుర్నూర్ వేసిన ఆ ఎనిమిదో ఓవర్లో ఇద్దరు చెరో 6, 4లతో 24 పరుగులు పిండారు. ఆటలోనే హైలైట్స్ చూపెట్టడంతో 10 ఓవర్లలో లక్నో 128/2 స్కోరు చేసింది. కాసేపటికి 6 కొట్టిన బదోని మరుసటి బంతికి అవుటైతే... తర్వాత వచ్చిన పూరన్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. ఇలా ఆకాశమే హద్దుగా సాగిన లక్నో స్కోరు 15.5 ఓవర్లోనే 200 పరుగులు దాటింది. స్టొయినిస్ 31 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. డెత్ ఓవర్లలో స్టొయినిస్, పూరన్ అవుట్ కావడంతో ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు నమోదైంది. లేదంటే స్కోరు చరిత్ర మారేది! 2013లో పుణే జట్టుపై బెంగళూరు 263 పరుగులు చేసింది.

### 200 పైచిలుకు తీసుకొచ్చినా...

ధావన్ (1), ప్రభ్‌సిమ్రన్ (9) నిరాశపరిచినప్పటికీ అథర్వ, రజా (22 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టు స్కోరును 100 దాటించారు. ఆ తర్వాత లివింగ్‌స్టోన్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ (24; 3 సిక్స్‌లు), స్యామ్ కరన్ (11 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు.

### స్కోరు వివరాలు

**లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్:** రాహుల్ (సి) షారుఖ్ (బి) రబడ 12; మేయర్స్ (సి) ధావన్ (బి) రబడ 54; బదోని (సి) చహర్ (బి) లివింగ్‌స్టోన్ 43; స్టొయినిస్ (సి) జితేశ్ (బి) కరన్ 72; పూరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 45; హుడా (నాటౌట్) 11; కృనాల్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 257. వికెట్ల పతనం:** 1–41, 2–74, 3–163, 4–239, 5–251. **బౌలింగ్:** గుర్నూర్ 3–0–42–0, అర్ష్‌దీప్ 4–0–54–1, రబడ 4–0–52–2, రజా 1–0–17–0, చహర్ 4–0–29–0, స్యామ్ కరన్ 3–0–38–1, లివింగ్‌స్టోన్ 1–0–19–1.

**పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రభ్‌సిమ్రన్ (సి) సబ్–సామ్స్ (బి) నవీనుల్ 9; ధావన్ (సి) కృనాల్ (బి) స్టొయినిస్ 1; అథర్వ (సి అండ్ బి) బిష్ణోయ్ 66; రజా (సి) కృనాల్ (బి) యశ్ 36; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 23; స్యామ్ కరన్ (సి) బదోని (బి) నవీనుల్ 21; జితేశ్ (సి) రాహుల్ (బి) యశ్ 24; షారుఖ్ (సి) బిష్ణోయ్ (బి) యశ్ 6, చహర్ (సి) హుడా (బి) యశ్ 0; రబడ (బి) నవీనుల్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 201. వికెట్ల పతనం:** 1–3, 2–31, 3–109, 4–127, 5–152, 6–178, 7–192, 8–193, 9–197, 10–201. **బౌలింగ్:** స్టొయినిస్ 1.5–0–21–1, మేయర్స్ 1–0–4–0, బదోని 0.1–0–0–0, నవీనుల్ 4–0–30–3, అవేశ్ 2–0–28–0, మిశ్రా 2–0–23–0, బిష్ణోయ్ 4–0–41–2, యశ్ 3.5–0–37–4, కృనాల్ 1–0–13–0.



### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర. |
|---|---|---|---|---|---|
| రాజస్తాన్ | 8 | 5 | 3 | 10 | 0.939 |
| లక్నో | 8 | 5 | 3 | 10 | 0.841 |
| గుజరాత్ | 7 | 5 | 2 | 10 | 0.580 |
| చెన్నై | 8 | 5 | 3 | 10 | 0.376 |
| బెంగళూరు | 8 | 4 | 4 | 8 | -0.139 |
| పంజాబ్ | 8 | 4 | 4 | 8 | -0.510 |
| కోల్‌కతా | 8 | 3 | 5 | 6 | -0.027 |
| ముంబై | 7 | 3 | 4 | 6 | -0.620 |
| హైదరాబాద్ | 7 | 2 | 5 | 4 | -0.725 |
| ఢిల్లీ | 7 | 2 | 5 | 4 | -0.961 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా × గుజరాత్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
ఢిల్లీ × హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

# బ్రిజ్‌భూషణ్‌పై ‘ఎఫ్ఐఆర్’ నమోదు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఢిల్లీ పోలీసుల చర్య
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



“సుప్రీం కోర్టు ఆదేశాలను నేను స్వాగతిస్తున్నా. ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నాకూ మంచిదే. విచారణలో వారికి అన్ని విధాలా సహకరిస్తా. విచారణ కమిటీలు ఏర్పాటు చేసినప్పుడు కూడా నేను ప్రశ్నించలేదు. రెజ్లర్లు మరికొంత సమయం ఆగాల్సింది. కానీ వారు కోర్టుకు వెళ్లారు. ఎవరి పట్లా తప్పుగా వ్యవహరించలేదు. నాకు నాపై నమ్మకముంది.
–బ్రిజ్‌భూషణ్ సింగ్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు స్పందించారు. శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా బ్రిజ్‌భూషణ్‌పై ‘ఎఫ్ఐఆర్’ నమోదు చేస్తామని ఇచ్చిన హామీని పూర్తి చేశారు. బ్రిజ్‌భూషణ్‌పై కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మైనర్ రెజ్లర్ చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంటూ ‘పోక్సో యాక్ట్’ ప్రకారం ఒక ఎఫ్ఐఆర్... ఇతర రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ప్రకారం మరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. రెండింటిపై సత్వర విచారణ చేపడతామని పోలీసులు చెప్పారు. ఈ అంశంపై మే 5న మరోసారి విచారిస్తామని, ఆలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిరసన చేస్తున్న రెజ్లర్లు, ఫిర్యాదు చేసిన వారి జాబితాలో ఉన్న ఒక మైనర్ రెజ్లర్ భద్రతకు సంబంధించి కూడా ఢిల్లీ పోలీసులు బాధ్యత తీసుకోవాలని కూడా సుప్రీం సూచించింది. ‘మైనర్ రెజ్లర్‌కు ఉన్న ముప్పును దృష్టిలో పెట్టుకుంటూ తగినంత భద్రత కల్పించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం. ఇతర రెజ్లర భద్రతను కూడా ఆయన సమీక్షించాలి. దర్యాప్తునకు సంబంధించిన డాక్యుమెంట్ల విషయంపై గోప్యత కూడా పాటించాలి’ అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడా బెంచీ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు బజరంగ్, వినేశ్, సాక్షి తదితర రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద తమ నిరసన కొనసాగిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించడం పట్ల రెజ్లర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఎఫ్ఐఆర్ మాత్రమే కాదు, బ్రిజ్‌భూషణ్ అరెస్ట్ అయ్యే వరకు ఇది కొనసాగుతుందని బజరంగ్ స్పష్టం చేశాడు. ‘విజయం దిశగా ఇది మొదటి అడుగు మాత్రమే. అయితే మా నిరసన ఇకపైనా కొనసాగుతుంది. ఆయనను అన్ని పదవుల నుంచి తప్పించడంతో పాటు జైలుకు పంపాల్సిందే. లేదంటే విచారణను ప్రభావితం చేస్తాడు’ అని రెజ్లర్ సాక్షి మలిక్ పేర్కొంది.



వినేశ్ ఫొగాట్, సంగీత ఫొగాట్, సాక్షి

### ‘కరెంట్ కట్’



‘ఢిల్లీ పోలీసులు మా పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. ఎఫ్ఐఆర్ నమోదైంది కాబట్టి నిరసన ముగించమని ఒత్తిడి తెస్తున్నారు. కరెంట్ కట్ చేసి గేట్లు మూసేశారు. భోజనం, నీళ్లు కూడా లోపలికి రానివ్వడం లేదు. నేను ఏసీపీతో మాట్లాడాను. ఏం చేస్తారో చేసుకోండి అని ఆయన జవాబిచ్చాడు. వారు ఏం చేసినా మా ఆందోళన కొనసాగిస్తాం. మీ ఇంటి ఆడపిల్లలైతే ఇలాగే చేస్తారా. బ్రిజ్‌భూషణ్ చట్టంకంటే పెద్దవాడిగా మారిపోయాడు’ (అర్ధ రాత్రి 12 గంటలకు పరిస్థితి).



# సిసింద్రీలకు సమ్మర్ కేర్!





ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే వేసవి సెలవులు మొదలయ్యాయి. ఇక పిల్లల ఆటలు, పాటలు అంటూ ఎక్కువ సేపు బయటే తిరుగుతూ ఉంటారు. తిండీ, నిద్రనూ కూడా నిర్లక్ష్యం చేసి మరీ ఆటల్లో మునిగిపోతారు. సమ్మర్‌లో చిన్నపిల్లలను నిర్లక్ష్యం చేస్తే త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బ, చర్మ సమస్యలతో సహా మరెన్నో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే వాళ్లను ఈ కాలంలో మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

### మసాలాలు, జంక్ ఫుడ్ జోలికి వెళ్లవద్దు..

వేసవిలో కారం, మసాలా, వేపుళ్లు, స్వీట్లు వంటి వాటికి దూరంగా ఉంచాలి. కారం, మసాలాలు తింటే మరింత వేడి చేసే ప్రమాదం ఉంది. పిజ్జా, బర్గర్, అలాగే నిల్వ ఆహారాన్ని ఇవ్వకూడదు. ఇవన్నీ దాహాన్ని మరింత పెంచుతాయి. ఎక్కువగా ఇంట్లో తాజాగా వండిన ఆహారాన్నే తీసుకునేలా చూడాలి. అలాగే లేస్, కుర్కురేలు వంటివి అసలు మంచిది కాదు. వీలయినంత వరకు ఇంట్లో వండిన చిరుతిళ్లే అలవాటు చేయాలి.

### సౌకర్యంగా ఉండే దుస్తులు

బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చిన్నారులకు తేలికైన, కాటన్ వస్త్రాలను వేయాలి. ఇవి సింథటిక్, ఇతర ఫ్యాబ్రిక్స్ కంటే చెమటను ఎక్కువగా పీల్చేసుకుంటాయి కాబట్టి బేషజాలకు పోకుండా పిల్లలకు లేత రంగులలో ఉండే కాటన్ దుస్తులను వేయడం ఉత్తమం. అలాగే రెండుపూటలా స్నానం చేయించడం మంచిది. బయట ఆటలాడి వచ్చినా, ఇంట్లోనే ఉన్నా కూడా పిల్లలకు చెమట పడుతుంది. అలాగే వదిలేస్తే అలర్జీలు వస్తాయి. అందువల్ల గోరువెచ్చటి నీటితో రెండుపూటలా స్నానం చేయించాలి.

పజిల్స్ ఇవ్వడం, అంత్యాక్షరి, వర్డ్ బిల్డింగ్ వంటివి ఆడించాలి. వారికి ఆసక్తి ఉన్న అంశంపై మరింత ఎక్కువ ఏకాగ్రత చూపేలా లేదా రాని సబ్జెక్టును నేర్చుకునేలా చేయాలి.

### పండంటి ఆరోగ్యం కోసం..

సాధారణంగా వేసవిలో పిల్లల చర్మం పొడిబారి, దురద, మంట వంటి పలురకాల ఎలర్జీలు మొదలవుతుంటాయి. అటువంటి లక్షణాలు కనిపించినప్పుడు వారు డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. యూరిన్‌కు అతి తక్కువగా వెళ్లడం, కడుపునొప్పి, తలనొప్పి, వికారంగా ఉన్నా.. జాగ్రత్తగా గమనించాలి. మామిడి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చ, కమలాజ్యూస్‌లు పట్టించాలి. రోజూ ఉదయం గ్లాసు కొబ్బరినీళ్లు ఇవ్వాలి. ఇందులోని పొటాషియం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. పిల్లలతో రోజుకి కనీసం రెండు లీటర్ల నీటిని తాగించడం అన్నింటికన్నా ముఖ్యం. సబ్జానీళ్లు ఇస్తే మరీ మంచిది.

### చల్లటి పదార్థాలు ఇవ్వద్దు

వేసవిలో తాపం ఎక్కువగా ఉండటం సహజం. చల్లటివి ఏమైనా తినాలని, తాగాలనీ అనిపిస్తుంది. అలాగని ఫ్రిజ్‌లో పెట్టి.. తీసిన వెంటనే తిన్నా అవి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. పిల్లలు ఫ్రిజ్ నీళ్లు తాగితే.. జలుబు చేసే అవకాశం ఉంది. దానికన్నా కుండ నీళ్లు తాగించడం చాలా మంచిది.

### మజ్జిగ ఇవ్వండి

మధ్యాహ్నం భోజనం తర్వాత పలుచటి మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి, ఉప్పు, పావుచెక్క నిమ్మరసం కలిపి తాగిస్తే జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. మజ్జిగలో కాల్షియం, విటమిన్ బి 12, పొటాషియం అందుతాయి. ఇవి తలనొప్పి, వికారం వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని స్తాయి. క్యారెట్, కీర దోస ముక్కలపై కాస్త నిమ్మ రసం, చిటికెడు ఉప్పు చల్లి తినిపించడం మంచిది. ముఖ్యంగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి.

### సన్‌స్క్రీన్

మీ పిల్లలు బయటకు వెళ్లేప్పుడు.. అతిగా ఎక్స్‌పోజ్ అయ్యే భాగాలకు సన్‌స్క్రీన్ లోషన్ రాయడం మంచిది. సన్‌స్క్రీన్ పిల్లలను వడదెబ్బ, రాషెస్ నుంచి రక్షిస్తుంది. మీ పిల్లలు బయట ఉండే సమయం బట్టి.. సన్‌స్క్రీన్ రెండు సార్లు రాసినా పర్వాలేదు.

### కూలింగ్ గ్లాసెస్

మీ పిల్లలు ఎండల్లో బయటకు వచ్చినప్పుడల్లా.. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకునేలా చూడండి. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే.. సూర్యుని కిరణాలు డైరెక్ట్‌గా కళ్లల్లో పడవు. కళ్లు సేఫ్‌గా ఉంటాయి. కుదిరితే.. క్యాప్ పెట్టుకుంటే ఇంకా మంచిది.. ఎండ డైరెక్ట్‌గా వారి తల మీద పడదు. ఎండ తలమీద పడితే.. తలనొప్పి, వినుగు, కళ్లు తిరిగే అవకాశం ఉంటుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తర్వాత చల్లటి నీళ్లతో కళ్లు శుభ్రంగా కుడిగితే.. వారికి ప్రశాంతంగా ఉంటుంది.

### మధ్యాన్నం పూట బయటకు పంప వద్దు

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఆటలు ఆడుకోవడానికి.. బయటకు వెళ్లిపోతారు. అయితే మధ్యాహ్న సమయం లో మాత్రం పిల్లలను బయటకు అనుమతించవద్దు. ఆ సమయంలో ఎండ ఎక్కువగా ఉంటుంది, రేడియేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. బయట వాతావరణం చాలా వేడిగా ఉండడం వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరిగి.. చెమట ఎక్కువగా పడుతుంది. ఒంట్లో నీరు వేగంగా ఆవిరై... డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఇవి వడదెబ్బకు దారితీస్తాయి. ఉదయం, సాయంత్రం ఎండలేని సమయాల్లోనే పిల్లలను బయటకు అనుమతించాలి.

### ఏం చేయాలి మరి?

మధ్యాహ్న సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునే ఆటలు ఆడుకునేలా చూడాలి.

### వేసవి ఫ్లూ

5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఏడాది పొడవునా ఈ సమస్యలు తరచుగా వస్తాయి. కాబట్టి వారిని ఎండలో తిరగనీయకుండా ఉంచాలి. సాయంత్రం వేళ లేదా ఉదయం పూట వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఆడుకోవడానికి అనుమతివ్వండి. వారికి సరైన పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచవచ్చు.

### కీటకాల బెడద

ఎండాకాలంలో దోమలు చిరాకు పుట్టిస్తాయి. దోమలే కాకుండా ఇతర కీటకాల కాటుకు పిల్లలు గురయ్యే అవకాశం ఉంది. ప్రభావిత ప్రాంతంలో దురద, వాపు వస్తాయి కాబట్టి వైద్యుల సూచన మేరకు పిల్లల కోసం ప్రత్యేకమైన దోమల నివారణ మందులను వాడేందుకు ప్రయత్నించండి.

### ఈతకు వెళుతుంటే...

చెరువులు.. బావులకు సరదాగా ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. కొంత మంది పాత బావుల్లో కూడ ఈతకు వెళతారు. ఇలాంటి సమయంలో కొన్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలు ఈత కొట్టే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

పిల్లలు రోజంతా బయట ఆడుకుంటారు, ఈ సమయంలో వారు తినడం, తాగడం మర్చిపోతారు. అటువంటి పరిస్థితిలో, వారి ఆహారంపై మరింత శ్రద్ధ వహించడం మంచిది.

# మామిడిపళ్లు తినేముందు...



మామిడి పండ్లను తినేముందు వాటిని కనీసం ఒక గంట పాటు నీటిలో నానబెట్టాలని అమ్మమ్మలు, నానమ్మలు సలహా ఇస్తూ ఉంటారు. కారణం ఏమిటంటే, మామిడిపండ్లలో ఫైటిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంటుంది. ఇలా అధికంగా ఉత్పత్తి అయ్యే ఈ యాసిడ్‌ను తొలగించడానికి నీళ్లలో నానబెట్టాలి. వివిధ కూరగాయలు, ధాన్యాలు, పప్పులు వంటి వాటిలో ఈ ఫైటిక్ యాసిడ్ ఉంటుంది. ఇలా నానబెట్టడం వల్ల అది విచ్ఛిన్నమైపోతుంది. ఈ ఫైటిక్ యాసిడ్ అదనపు వేడిని కూడా ఉత్పత్తి చేస్తుంది. నీటిలో నానడం వల్ల ఈ అదనపు వేడి తగ్గిపోతుంది.

### టాక్సిన్లను తొలగిస్తుంది

మామిడి పండ్లను తినడానికి ముందు గంటపాటు నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి తొక్కపై ఉండే కనిపించని నూనె తొలగిపోతుంది. అది కొందరిలో ఎలర్జీలు కలిగించే అవకాశం ఉంది. అలాగే పాలీఫెనాల్స్, టానిన్లు వంటి సూక్ష్మ పదార్థాల మిశ్రమం తొక్క పైన ఉండే అవకాశం ఉంది. అవి శరీరంలో చేరితే దురద, బొబ్బలు రావడానికి కారణం అవుతుంది. మామిడిపండ్లు నానబెట్టడం వల్ల అవన్నీ తొలగి పండు తినడానికి అనువుగా సురక్షితం గా మారుతుంది.

మామిడి పండ్లను ఇలా నీటిలో నానబెట్టడం వల్ల వాటి రుచి కూడా బాగుంటుంది. ప్రత్యేకించి ఆ పండ్లను ఫ్రిడ్జ్‌లో ఉంచినట్లయితే వాటిని కచ్చితంగా నీళ్ళల్లో నానబెట్టాలి. ఎందుకంటే ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు పండు వాసనను, రుచిని మార్చేస్తాయి. నీళ్లలో నానబెట్టడం వల్ల వాటి సహజమైన తీపి, సువాసనను తిరిగి పొందవచ్చు.

# నులి పురుగుల నివారణకు...



పిల్లలు కొన్నిసార్లు ఎంత రుచిగా చేసి పెట్టినా సరే, ఆకలి కావడం లేదంటారు. తరచూ విరేచనాలు చేసుకుంటారు. బరువు తగ్గిపోయి బలహీనంగా కనిపిస్తుంటారు. ఎందుకు ఇలా అవుతోందో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. నిజానికి ఇవి ప్రమాదకరమైన వ్యాధి లక్షణాలేమీ కాదు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయి. వాటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం...

తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులే పీల్చుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాల మీదికి కూడా వస్తుంది.

### కడుపులో నులి పురుగులు పోవడానికి...

- వేప నూనె పది చుక్కలు చక్కెరలోవేసి లోపలకు తీసుకుంటే క్రిములు నశిస్తాయి
- గుప్పెడు లేత వేప చిగురు, అర చెంచా ఉప్పు, అర చెంచా పసుపు కలిపి మాత్రల్లా చేసుకొని రాత్రి నిద్రించే ముందు ఒక మాత్ర వేసుకుంటే నులిపురుగులు నశిస్తాయి.
- పచ్చి బొప్పాయి కాయకు గాట్లు పెట్టగా వచ్చిన పాలు చెంచా, ఆముదం చెంచా కలిపి తాగితే. పురుగులు పడిపోతాయి.
- ఎండించిన వేప పువ్వు 50 గ్రాములు. మిరియాల పొడి చెంచా, ఉప్పు చెంచా కలిపి ప్రతిరోజు భోజనంలో మొదటి ముద్దగా కలుపుకుని తినాలి, లేదా గ్లాసు నీటిలో ఒక చెంచా వేసి సగం అయ్యే వరకు మరిగించి కషాయం లాగా తాగినా కూడా నులిపురుగులు నశిస్తాయి.
- వీటన్నింటినీ చేయడం కష్టం అనుకుంటే ఆల్బెండిజాల్ ట్యాబ్లెట్‌ను పదిహేను రోజులకొకసారి చొప్పున నెలరోజులు వాడాలి. ఒక నెల గ్యాప్ ఇచ్చి అదే రిపీట్ చేయాలి.

స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
| 463 | 150 |
| 61,112 | 18,065 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 12,196 | ▲ | 54 |
| డోజోన్స్ | 34,059 | ▲ | 232 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,871 | ▲ | 39 |
| డాక్స్ | 15,922 | ▲ | 122 |
| షాంఘై | 3,323 | ▲ | 37 |
| నికాయ్ | 28,856 | ▲ | 399 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (24 క్యారట్) | | |
| 60,168 | ▼ | 347 |
| బంగారం (22 క్యారట్) | | |
| 59,927 | ▼ | 346 |
| వెండి (కిలో) | | |
| 73,868 | ▼ | 547 |



## ఎల్ఐసీ చైర్మన్‌గా సిద్ధార్థ మహంతి



**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ కొత్త చైర్మన్‌గా సిద్ధార్థ మహంతి నియమితులయ్యారు. దీనితో మార్చి తొలి వారంలో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) చేసిన సిఫారసుకు కేంద్రం నుంచి ఆమోదం లభించినట్లయ్యింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల చీఫ్‌లు, సారథుల ఎంపికను ఎఫ్ఎస్ఐబీ చూస్తుంటుంది. నిబంధనల ప్రకారం నలుగురు మేనేజింగ్ డైరెక్టర్ల నుంచి చైర్మన్‌ను ఎంపిక చేస్తారు. ప్రస్తుతం మహంతి ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. 2023 మార్చి 13న ఎంకే కుమార్ పదవీవిరమణ తర్వాత సంస్థ తాత్కాలిక చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనుభవం, ఇతర అంశాల ఆధారంగా ఎల్ఐసీ చైర్మన్ పదవికి సిద్ధార్థ మహంతి ఎంపికయ్యారు. ఎఫ్ఎస్ఐబీ సిఫారసుకు ప్రధాని అధ్యక్షతన గల కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఇందుకు సంబంధించి వెలువడిన సమాచారం ప్రకారం, ఎల్ఐసీ చైర్మన్‌గా మహంతి 62 ఏళ్లు వచ్చే వరకు అంటే 2025 జూన్ 7 వరకూ కొనసాగుతారు.

## సోనీ బ్రావియా కొత్త టీవీలు

**విజయవాడ:** సోనీ ఇండియా కంపెనీ ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి సోనీ బ్రావియా ఎక్స్70ఎల్, బ్రావియా ఎక్స్75ఎల్ సిరీస్ టీవీలను విడుదల చేసింది. ఎక్స్1 4కే ప్రాసెసర్, లైవ్ కలర్, డాల్బీ ఆడియో, క్లియర్ ఫేస్ టెక్నాలజీ, 10వేలకి పైగా యాప్స్, గేమ్స్‌తో పాటు ఏడు లక్షలకు పైగా సినిమాలు, టీవీ సిరీస్‌లను కలిగిన గూగుల్ టీవీ ఫీచర్లు వీటిలో ఉన్నాయి.




ఎక్స్-ప్రొటెక్షన్ పీఆర్ఓ, వాయిస్ ఆధారిత రిమోట్-స్మార్ట్ రిమోట్‌లు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఎక్స్ 75ఎల్ సిరీస్‌లో మొత్తం నాలుగు మోడళ్లు ఉన్నాయి. వీటి ధరలు రూ.1.04 లక్షలు – రూ. 51,999 మధ్య ఉన్నాయి. ఇక ఎక్స్70ఎల్ సిరీస్‌లో రెండు మోడళ్లు ఉన్నాయి. ఇందులో కేడీ-43 ఎక్స్70ఎల్ ధర రూ.49,990, కేడీ-50 ఎక్స్70ఎల్ ధర రూ.61,990 గా ఉంది. పై రెండు సిరీస్‌లోని మోడళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సోనీ సెంటర్లు, ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షాపుల్లో, ఈ-కామర్స్ పోర్టళ్లలో లభిస్తాయని కంపెనీ తెలిపింది.

# రెండింతలకు చేతక్ స్కూటర్ల ఉత్పత్తి

- జూన్ నాటికి సాధ్యం: బజాజ్
- ఫేమ్-2 కొనసాగించాల్సిందే



**న్యూఢిల్లీ:** వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని జూన్ నాటికి రెండింతలకు చేర్చనున్నట్లు ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఫేమ్-2 పథకం పొడిగింపు విషయంలో నెలకొన్న అనిశ్చితిని దృష్టిలో పెట్టుకుని ఎక్స్‌క్లూజివ్ స్టోర్ల విస్తరణ చేపడుతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం నెలకు 5,000 యూనిట్లను తయారు చేస్తున్నట్లు కంపెనీ ఈడీ రాకేశ్ శర్మ తెలిపారు. 'విడిభాగాలు సరఫరా చేసే కొందరు వెండార్లపై పెద్ద ఎత్తున ఆధారపడ్డాం. వారు సకాలంలో సరఫరా చేయకపోవడంతో సమస్యలు ఎదుర్కొన్నాం. సరఫరా సమస్యల నుంచి గట్టెక్కాం. అది మాకు కొంత విశ్వాసాన్ని ఇస్తోంది. మే నెలలో ఉత్పత్తి 7,000 యూనిట్లకు, జూన్‌లో 10,000 యూనిట్లకు చేరనుంది. డిమాండ్‌నుబట్టి భవిష్యత్‌లో ఉత్పత్తి ఏ స్థాయిలో ఉండాలో నిర్ణయిస్తాం. ఎక్స్‌క్లూజివ్ ఔట్‌లెట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 105 నుంచి సెప్టెంబర్‌కల్లా సుమారు 150 తాకనుంది. సరఫరా సమస్యలు తొలగిపోయి డిమాండ్ కొనసాగి, నెట్‌వర్క్ విస్తరణతో 2023-24లో బజాజ్ ఆటో చేతక్‌తోపాటు 'యూలుకు' సరఫరా చేసిన వాహనాలతో కలిపి విక్రయాలు ఒక లక్ష యూనిట్లకు ఎగుస్తుంది' అని వివరించారు.

**సబ్సిడీ పొడిగించాల్సిందే..**

ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంపొందించే పథకం ఫేమ్-2 పొడిగింపుపై ఈ ఏడాది సెప్టెంబర్‌కల్లా స్పష్టత వచ్చే అవకాశం ఉందని బజాజ్ ఆటో అర్బనైట్ బిజినెస్ ప్రెసిడెంట్ ఎరిక్ వాస్ పేర్కొన్నారు. 'పొడిగింపు నిర్ణయానికి ముడిపడి చాలా అంశాలు ఉన్నాయి. సబ్సిడీని నిలిపివేస్తే ఎలక్ట్రిక్ వాహనాల ధరలు గణనీయంగా పెరుగుతాయి.' అని తెలిపారు.

## మార్చిలో ఐదు నెలల కనిష్టానికి 'మౌలికం'

**న్యూఢిల్లీ:** ఎనిమిది రంగాల మౌలిక పరిశ్రమ మార్చిలో ఐదు నెలల కనిష్ఠ స్థాయిని నమోదుచేసుకుంది. వృద్ధి కేవలం 3.6 శాతంగా నమోదయ్యింది. ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిలో అసలు వృద్ధిలేకపోగా 2.8 శాతం క్షీణించింది. విద్యుత్ (-1.8 శాతం), సిమెంట్ (-0.8 శాతం) అదే నష్టాల బాటన నడిచాయి. ఇక బొగ్గు ఉత్పత్తి భారీగా 12.2 శాతం పెరిగింది. ఎరువుల విషయంలో వృద్ధి రేటు 9.7 శాతంగా ఉంది. స్టీల్ (8.8 శాతం), సహజ వాయువు (2.8 శాతం), రిఫైనరీ ప్రొడక్ట్స్ (1.5 శాతం) కూడా లాభాల బాటనే నడిచాయి. కాగా ఆర్థిక సంవత్సరం మొత్తంగా ఈ రంగాల వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వెయిటేజ్ దాదాపు 40.27 శాతం.



# అల్ట్రాటెక్ సిమెంట్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 1,670 కోట్లు
- షేరుకి రూ. 38 డివిడెండ్




**న్యూఢిల్లీ:** ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 36 శాతం క్షీణించి రూ. 1,670 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,614 కోట్లు ఆర్జించింది. ముడివ్యయాలు లాభాలపై ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం 18 శాతం వృద్ధితో రూ. 18,562 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 15,767 కోట్ల ఆదాయం నమోదైంది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 38 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. ఈ క్యూ4లో మొత్తం వ్యయాలు సైతం 20% పెరిగి రూ. 16,293 కోట్లకు చేరాయి. ఇంధన వ్యయాలు 17%, పెట్ కోక్ ధరలు 18 శాతం చొప్పున పెరిగాయి. ఫ్లైయాష్, జిప్సమ్, స్లాగ్ ధరల ప్రభావంతో ముడివ్యయాలు 9%అధికమయ్యాయి. సిమెంట్ అమ్మకాల పరిమాణం 14 శాతం బలపడి 31.7 మిలియన్ మెట్రిక్ టన్నులను తాకింది.

**పూర్తి ఏడాదికి సైతం**

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి అల్ట్రాటెక్ సిమెంట్ నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 5,073 కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7,334 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 20 శాతంపైగా ఎగసి రూ. 63,240 కోట్లను తాకింది. 2021-22లో రూ. 52,599 కోట్ల టర్నోవర్ నమోదైంది. గతేడాది సిమెంట్ ఉత్పత్తి, డిస్పాచెస్, అమ్మకాలలో 100 మిలియన్ టన్నుల మార్క్‌ను అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో అల్ట్రాటెక్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం బలపడి రూ. 7,555 వద్ద ముగిసింది.

# అయిదో రోజూ లాభాలే

- రెండు నెలల గరిష్టానికి సూచీలు
- ర్యాలీకి రిలయన్స్, ఐటీసీ షేర్ల అండ
- 61 వేల పైకి సెన్సెక్స్
- 18 వేల పైకి నిఫ్టీ



**ముంబై:** ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం స్టాక్ సూచీలు రెండు నెలల గరిష్టానికి చేరుకున్నాయి. అధిక వెయిటేజీ ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ రెండుశాతం రాణించడం కలిసొచ్చింది. మే సిరీస్ మొదటి రోజున ఫ్లాటుగా ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 73 పాయింట్లు పెరిగి 60,722 వద్ద, నిఫ్టీ 35 పాయింట్లు పెరిగి 17,950 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు ఆఖర్లో ఐటీ షేర్లకు డిమాండ్ లభించడంతో ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 569 పాయింట్లు ఎగసి 61,209 వద్ద, నిఫ్టీ 174 పాయింట్లు దూసుకెళ్లి 18,089 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 463 పాయింట్లు పెరిగి 61 వేల స్థాయి పైన 61,112 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 150 పాయింట్లు బలపడి 18,065 వద్ద నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి 17 తర్వాత సెన్సెక్స్ తొలిసారి 61 వేల స్థాయిపై.., నిఫ్టీ 18 వేల స్థాయిపై ముగియడం ఇదే తొలిసారి. కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.32%, 0.91 శాతం చొప్పున బలపడ్డాయి. సూచీలు అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో రూ. 2.66 లక్షల కోట్ల సంపద ఇన్వెస్టర్ల సొంతమైంది. అంచనాలకు మించి ఆర్థిక ఫలితాలు నమోదు కావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ''అంతర్జాతీయ ఈక్విటీల ట్రెండ్‌ను ప్రతిబింబిస్తూ దేశీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో పయనించాయి. దేశీయ ఈక్విటీలను కొనేందుకు ఎఫ్ఐఐలు ఆసక్తి చూపుతుండటం, ఇప్పటివరకు విడుదలైన కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు మెప్పించడం, క్రూడాయిల్ ధరలు పతనం తదితర అంశాలతో దేశీయ ఈక్విటీ మార్కెట్ వరుసగా అయిదోరోజూ ముందుకెళ్లింది. సూచీలు రెండు నెలల గరిష్టానికి చేరుకున్న నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశం లేకపోలేదు. ఈ కీలక తరుణంలో ట్రేడర్లు అప్రమత్తత వహించాలి'' అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

**మార్కెట్లో మరిన్ని సంగతులు..**

- ఫలితాల సందర్భంగా రూ.12 వేల కోట్ల బైబ్యాక్ ప్రకటన తర్వాత విప్రో కంపెనీ 3% లాభపడి రూ.385 వద్ద స్థిరపడింది.
- యాక్సిస్ బ్యాంక్ షేరు 2.39% నష్టపోయి రూ.860 వద్ద ముగిసింది. వార్షిక ప్రాతిపదికన మార్చి త్రైమాసికంలో రూ.5,361 కోట్లు నికర నష్టాన్ని నమోదు చేయడం షేరు పతనానికి కారణమైంది.
- ఫైనాన్స్ సర్వీసెస్ రంగానికి చెందిన ఆరు కంపెనీల షేర్లు ఏడాది గరిష్టానికి తాకాయి. ఆదిత్యా బిర్లా క్యాపిటల్, ఇండియన్ బ్యాంక్, సీఎస్‌బీ బ్యాంక్, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్, చాయిస్ ఇంటర్నేషనల్ షేర్లు ఇందులో ఉన్నాయి.

# కేఎస్‌బీఎల్, ప్రమోటర్లపై ఏడేళ్ల నిషేధం..

కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు రూ. 13 కోట్లు... పార్థసారథికి రూ. 8 కోట్లు జరిమానా




**న్యూఢిల్లీ:** క్లయింట్ల నిధులను దుర్వినియోగం చేసిన కేసులో కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్), దాని ప్రమోటర్ కొమండూర్ పార్థసారథి ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్‌లో లావాదేవీలు జరపకుండా సెబీ నిషేధించింది. కేఎస్‌బీఎల్‌కు రూ. 13 కోట్లు, పార్థసారథికి రూ. 8 కోట్లు జరిమానా కూడా విధించింది. అలాగే పార్థసారథి ఏ లిస్టెడ్ కంపెనీలోనూ కీలక మేనేజర్ హోదాల్లో పని చేయకుండా పదేళ్ల పాటు నిషేధించింది. కేఎస్‌బీఎల్‌కు చెందిన మరో ఇద్దరు డైరెక్టర్లయిన భగవాన్ దాస్ నారంగ్, జ్యోతి ప్రసాద్‌లకు ఇది రెండేళ్ల పాటు వర్తిస్తుంది. అటు కేఎస్‌బీఎల్ నుంచి తీసుకున్న రూ. 1,443 కోట్ల మొత్తాన్ని మూడు నెలల్లోగా వాపసు చేయాలంటూ కార్వీ రియల్టీ, కార్వీ క్యాపిటల్‌ను సెబీ ఆదేశించింది. లేని పక్షంలో ఆ మొత్తాన్ని రాబట్టేందుకు రెండు సంస్థల ఆస్తులను ఎన్ఎస్ఈ తన అధీనంలోకి తీసుకుంటుందని సెబీ స్పష్టం చేసింది. క్లయింట్లు ఇచ్చిన పవర్ ఆఫ్ అటార్నీలను దుర్వినియోగం చేసి వారి షేర్లను తనఖా పెట్టి, కార్వీ సొంత అవసరాల కోసం నిధులను సమీకరించిందని ఆరోపణలు ఉన్నాయి.

**కేఐఎస్ఎల్‌పై ఆంక్షలు:** నిబంధనల ఉల్లంఘన కేసులో కొత్త క్లయింట్లను చేర్చుకోకుండా కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ (కేఐఎస్ఎల్)పై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు వర్తిస్తుందని పేర్కొంది.

2021-22 మధ్య కాలంలో డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలకు సంబంధించి కంపెనీ పలు నిబధనలను ఉల్లంఘించినట్లు సెబీ విచారణలో తేలింది. మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించేందుకు ఉద్యోగులు గానీ, భౌతిక మౌలిక సదుపాయాలు గానీ కేఐఎస్ఎల్‌కు లేవని కూడా వెల్లడైంది. పైగా 2022 డిసెంబర్ నుంచి 2025 డిసెంబర్ వరకూ చెల్లుబాటయ్యేలా రెన్యువల్ ఫీజును కూడా కంపెనీ కట్టలేదని 13 పేజీల ఎక్స్‌పార్టీ మధ్యంతర ఉత్తర్వుల్లో సెబీ పేర్కొంది. ఇలాంటి సంస్థల కార్యకలాపాల వల్ల సెక్యూరిటీల మార్కెట్ సమగ్రత, ఇన్వెస్టర్ల ప్రయోజనాలు దెబ్బతింటాయని వ్యాఖ్యానించింది.

# సినిమా

## ఖుషీ ఖుషీగా...

**హీ**రోయిన్ సమంత అభిమానులకు బర్త్ డే గిఫ్ట్ ఇచ్చింది 'ఖుషి' చిత్ర యూనిట్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (ఏప్రిల్ 28) సమంత బర్త్‌డే. ఈ సందర్భంగా 'ఖుషి' చిత్రంలో మెడలో ఐడీ కార్డ్, బ్యాగ్ తగిలించుకుని ఖుషీ ఖుషీగా చిరునవ్వులు చిందిస్తున్న సమంత కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. కాగా హీరో విజయ్ దేవరకొండ, 'ఖుషి' యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు సమంతకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ''ఖుషి' సినిమా ప్రస్తుతం చివరి షెడ్యూల్ జరుపుకుంటోంది. సెప్టెంబర్ 1న సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



**ఇన్‌ఫెక్షన్ తగ్గడానికి...**

సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడి సినిమాలకు కొద్ది రోజులు విరామం ఇచ్చిన సంగతి తెలిసిందే. మయోసైటిస్ నుంచి కోలుకుంటున్న ఆమె మళ్లీ షూటింగ్‌లతో బిజీ అయ్యారు. అయితే ముఖానికి ఆక్సిజన్ మాస్క్ ధరించి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న ఫోటోను సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో ఆమె ఫ్యాన్స్ ఆందోళనపడ్డారు. ''నేను హైపర్‌బేరిక్ థెరపీ తీసుకుంటున్నాను. ఈ థెరపీలో స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని అందిస్తారు. దీని వల్ల ఎక్కువ ఆక్సిజన్ ఊపిరితిత్తుల్లో చేరి, ఇన్‌ఫెక్షన్లను తగ్గించడమే కాకుండా దెబ్బతిన్న కణజాలం తిరిగి కోలుకునేందుకు ప్రేరేపిస్తుంది'' అని సమంత పోస్ట్ చేశారు.


• సమంత

## హ్యాపీగా.. జాలీగా...


• మహేశ్‌బాబు

**ఇ**టీవల ఫ్యామిలీతో కలిసి ప్యారిస్, జర్మనీకి హాలిడే ట్రిప్‌కు వెళ్లొచ్చారు మహేశ్‌బాబు. తాజాగా మరో హాలిడే ట్రిప్‌ను ప్లాన్ చేసుకున్నట్లున్నారు. భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, సితారలతో కలిసి మహేశ్‌బాబు శుక్రవారం విదేశాలకు పయనమయ్యారు. హ్యాపీగా.. జాలీగా యూరప్ వెళ్లారని తెలిసింది. కాగా 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత దర్శకుడు త్రివిక్రమ్‌తో కలిసి మహేశ్‌బాబు మూడోసారి సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణను ఈ నెలాఖర్లో ప్లాన్ చేశారట. కానీ కొన్ని కారణాల వల్ల షూటింగ్ షెడ్యూల్ వాయిదా పడటంతో మహేశ్ హాలిడే ట్రిప్ ప్లాన్ చేసుకున్నారని సమాచారం. పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 13న విడుదల చేస్తామని చిత్ర యూనిట్ ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

## కాంబినేషన్ సెట్?


• ప్రభాస్

**హీ**రో ప్రభాస్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమాకు రంగం సిద్ధమవుతోందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రజాకారుల ఉద్యమం నేపథ్యంలో సుకుమార్ ఓ కథను రెడీ చేశారని, ఈ కథలో ప్రభాస్ హీరోగా నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ప్రభాస్ 'సలార్', 'ప్రాజెక్ట్ కె', 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రాల తర్వాత 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' మూవీ చేస్తారు. కాగా 'స్పిరిట్' షూటింగ్‌లో పాల్గొంటూనే, సుకుమార్ దర్శకత్వంలోని సినిమానూ సెట్స్‌పైకి తీసుకుని వెళ్తారట ప్రభాస్. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.


• సుకుమార్

## ఆ తేడా చూడను


• ఐశ్వర్యా రాయ్

''**ఓ** సినిమాను నేనెప్పుడూ దక్షిణాది, ఉత్తరాది అని విభజించి చూడలేదు. ఏ సినిమా అయినా అది భారతీయ సినిమాగానే భావిస్తాను'' అన్నారు ఐశ్వర్యా రాయ్. 'ఈ మధ్య కాలంలో బాలీవుడ్ కంటే దక్షిణాది సినిమాల పాపులారిటీ ఎక్కువగా ఉందనీ, ఉత్తరాదిపై దక్షిణాది చిత్ర పరిశ్రమ ఆధిపత్యం చలాయిస్తుందనీ కొందరు అనుకుంటున్నారు. వీటిని మీరు అంగీకరిస్తారా?' అనే ప్రశ్నలు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్యకి ఎదురయ్యాయి. దీనిపై ఐశ్వర్యా రాయ్ స్పందిస్తూ– ''ఏ రంగంలో అయినా పోటీ ఉన్నట్లే చిత్ర పరిశ్రమలోనూ ఒక ఇండస్ట్రీకి మరొక ఇండస్ట్రీకి మధ్య పోటీ ఉంటుంది. అయితే కళాకారుల మధ్య అలాంటి భేదాలుండవు. నేనెప్పుడూ దక్షిణాది, ఉత్తరాది అని విడిగా చూడలేదు. ఏ సినిమా అయినా భారతీయ చిత్రంగానే భావిస్తాను. ఒక దానిపై మరొకటి ఆధిపత్యం చలాయిస్తుందనే అభిప్రాయాన్ని అంగీకరించను. ఒకచోట అవకాశాలు రాకపోతే మరొక చోట ప్రయత్నించవచ్చు. అక్కడ కూడా రాకపోతే వేరే ఇండస్ట్రీలోకి వెళ్లొచ్చు. కళకు, కళాకారులకు ఎక్కడైనా గౌరవం ఉంటుంది. పని చేసే ప్రతి సినిమా నుంచి ఏదో ఒక విషయం నేర్చుకోవచ్చు. దక్షిణాదిలో మణిరత్నంగారు, శంకర్‌గారు.. వంటి పెద్ద దర్శకులతో మంచి సినిమాలు చేసే అవకాశం నాకు వచ్చింది'' అన్నారు ఐశ్వర్య.

## మహారాణి పాత్రలో...


• రష్మికా మందన్నా

**మ**హారాణిగా నిర్ణయాలు తీసుకోనున్నారట హీరోయిన్ రష్మికా మందన్నా. మరాఠీ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పెద్ద కుమారుడు శంభాజీ భోంస్లే జీవితం ఆధారంగా హిందీలో ఓ పీరియాడికల్ ఫిల్మ్ రూపొందనుంది. ఈ చిత్రానికి 'ఛావా' అనే టైటిల్ అనుకుంటున్నారట. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో శంభాజీ మహారాజ్ పాత్రను విక్కీ కౌశల్ పోషించనున్నారు. శంభాజీ భార్య మహారాణి ఏసుబాయి భోంస్లే పాత్రలో రష్మికా మందన్నా నటించనున్నారని సమాచారం. ఈ సినిమా కథ నచ్చి రష్మికా మందన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఆ కాలపు యాక్సెంట్ నేర్చుకోవడం కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారని భోగట్టా. యుద్ధాల కోసం శంభాజీ పక్క దేశాలకు వెళ్లినప్పుడు, రాజమహల్‌లో రాణిగా ఏసుబాయి ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? ఎలాంటి రాజకీయ వ్యూహాలను రచించారు? అనే కోణంలో కూడా ఈ సినిమా కథ ఉండేలా స్క్రిప్ట్‌ను రెడీ చేశారట లక్ష్మణ్. ఈ సినిమా షూటింగ్‌ను సెప్టెంబరులో ఆరంభించాలనుకుంటున్నారని టాక్. ఇక ఇప్పటికే హిందీలో 'గుడ్ బై', 'మిషన్ మజ్ను' సినిమాలు చేసిన రష్మికా మందన్నా ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్‌తో 'యానిమల్' సినిమా చేస్తున్నారు. అలాగే అల్లు అర్జున్ హీరోగా రూపొందుతున్న 'పుష్ప: ది రూల్'లో రష్మికా హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే.

## సీక్రెట్ ఆపరేషన్


• విద్యుత్

**విద్యుత్** జమాల్ హీరోగా సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఐబీ 71'. దలీప్ తాహిల్, అనుపమ్ ఖేర్, విశాల్ జెత్వా ప్రధాన పాత్రలు పోషించారు. టి-సిరీస్, రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై విద్యుత్ జమాల్ నిర్మించిన ఈ చిత్రం మే 12న రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఐబీ ఆపరేషన్1: ఇంటెలిజెన్స్ ఇన్ యాక్షన్' అనే వీడియోను విడుదల చేశారు. ''1971లో ఇండియా – పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరిగింది. అయితే ఈ వార్‌లో ఇండియా గెలవడానికి కారణమైన 'ఇంటెలిజెన్స్ బ్యూరో సీక్రెట్ మిషన్స్' ఆధారంగా, వాస్తవ ఘటనలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అని యూనిట్ పేర్కొంది.

## పవర్‌ఫుల్ జాస్మిన్


• ఆండ్రియా

**వెం**కటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆండ్రియా జెర్మియా నటించనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేసింది. బ్లాక్ అండ్ బ్లాక్ అవుట్ ఫిట్‌లో చేతిలో తుపాకీతో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపిస్తున్నారు ఆండ్రియా. ''వెంకటేశ్ కెరీర్‌లో 75వ ల్యాండ్ మార్క్ మూవీ 'సైంధవ్'. ఈ చిత్రంలో జాస్మిన్ అనే ముఖ్యమైన పాత్రలో ఆండ్రియా నటిస్తున్నారు. 'సైంధవ్' షూటింగ్ ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. 'సైంధవ్'ని పాన్ ఇండియా చిత్రంగా తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడతో పాటు హిందీలో డిసెంబర్ 22న విడుదల చేస్తాం'' అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాత: కిషోర్ తాళ్లూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్).

## వరికపుడిశెల వాగు ఎత్తిపోతలకు

# తొలగిన అడ్డంకి



### అభయారణ్యంలో పనులకు కేంద్రం అనుమతి

- పంప్ హౌస్, అభయారణ్యంలో 4 కి.మీ పైపు లైన్ పనులకు మార్గం సుగమం
- తొలి దశలో పల్నాడులో 24,900 ఎకరాలకు సాగునీరు
- కేంద్ర అటవీ శాఖ అనుమతి లభించక దశాబ్దాలుగా కాగితాలకే పరిమితం
- దుర్భిక్ష పల్నాడును సుభిక్షం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం వైఎస్ జగన్
- అటవీ అనుమతి సాధించడం ద్వారా రైతుల కల సాకారం
- రెండో దశ డీపీఆర్‌కు అధికారుల కసరత్తు

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషితో పల్నాడు ప్రాంత ప్రజల దశాబ్దాల స్వప్నం వరికపుడిశెల ఎత్తిపోతలకు అడ్డంకులు తొలగిపోయాయి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు లభించక దశాబ్దాలుగా పనులు ప్రారంభం కాని ఈ ప్రాజెక్టును సీఎం జగన్ సాధించారు. శ్రీశైలం – నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో వరికపుడిశెల ఎత్తిపోతల పనులు చేపట్టేందుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చింది. దాంతో వరికపుడిశెల వాగు కుడి గట్టుపై పంప్‌హౌస్, టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 4 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణానికి మార్గం సుగమమైంది.

దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో పల్నాడు ఒకటి. పక్కనే వరికపుడిశెల వాగు, కృష్ణా నదులు ప్రవహిస్తున్నా పల్నాడులో సాగు, తాగు నీటికి తీవ్ర ఇబ్బందులే. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 40 కిలోమీటర్ల ఎగువన కృష్ణా నదిలో వరికపుడిశెలవాగు కలిసే ప్రాంతానికి ముందే ఆ వాగు నీటిని ఎత్తిపోసి పల్నాడును సుభిక్షం చేయాలనే ప్రతిపాదన దశాబ్దాలుగా ఉంది. ఇందుకోసం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పనులు చేయాల్సి ఉంటుంది. ఈ పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఆ ఎత్తిపోతల కాగితాలకే పరిమితమైంది.

#### పల్నాడును సుభిక్షం చేసే దిశగా..

పల్నాడు ప్రాంతానికి సాగు, తాగు నీటిని అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గట్టి సంకల్పం తలపెట్టారు. వరికపుడిశెలవాగు, కృష్ణా, గోదావరి జలాలను తరలించి పల్నాడుకు అందించాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. దాంతో వరికపుడిశెల వాగు కుడి గట్టున ఎత్తిపోతలను నిర్మించి, తొలి దశలో రోజుకు 281 క్యూసెక్కుల చొప్పున 1.57 టీఎంసీలను తరలించాలని ప్రణాళిక రూపొందించారు. రూ. 340.26 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టు ద్వారా వెల్దుర్తి మండలంలో 24,900 ఎకరాలకు నీళ్లందించవచ్చు. టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో వరికపుడిశెల వాగుపై ఎత్తిపోతల నిర్మాణం, దాని ద్వారా నీటిని తరలించడానికి 4 కిలోమీటర్ల పైపు లైన్ నిర్మాణానికి 19.13 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందుకు ప్రతిగా దుర్గి మండలంలో 21 హెక్టార్ల భూమిని అటవీ శాఖకు బదలాయించి, పరిహారాన్ని కూడా ప్రభుత్వం చెల్లించింది. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అధికారులతో పల్నాడు ప్రాంత ప్రజాప్రతినిధులు, జలవనరుల శాఖ అధికారులు పలు మార్లు చర్చలు జరపడంతో కేంద్రం కదిలింది. వరికపుడిశెల ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో పంప్‌హౌస్, పైపు లైన్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఎత్తిపోతల ద్వారా తరలించే నీటిని వెల్దుర్తి, ఉప్పలపాడు, గొట్టిపాళ్ల, సిరిగిరిపాడు, బొదిలవీడు, గంగులకుంట, లోయపల్లి గ్రామాల పరిధిలో 24,900 ఎకరాలకు సరఫరా చేయడానికి పైపు లైన్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభించారు. ఇప్పుడు అటవీ ప్రాంతంలో పైపులైన్ నిర్మిస్తారు. పైపు లైన్ల ద్వారా నీటిని తరలిస్తే సరఫరా నష్టాలు ఉండవని, ఆయకట్టుకు సమర్థవంతంగా నీటిని అందించవచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పైపు లైన్ ద్వారా ఆయకట్టుకు నీళ్లందించే తొలి ఎత్తిపోతల పథకం ఇదే. వరికపుడిశెల ఎత్తిపోతల తొలి దశకు అడ్డంకులు తొలగడంతో పల్నాడులో భారీ ఎత్తున ఆయకట్టుకు నీళ్లందించేలా రెండో దశకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# థాంక్యూ సీఎం సార్..

- మీ సాయంతో అంతరిక్షం అందుకుంటున్నా.. సహకరించిన సీఎంకు జాహ్నవి కృతజ్ఞతలు



తల్లిదండ్రులతో మంత్రి వేణును కలసిన జాహ్నవి

**రామచంద్రపురం:** సైంటిస్ట్ ఆస్ట్రోనాట్‌గా ఎదగాలని కలలుగన్న ఓ యువతి ఆకాంక్షలకు ప్రభుత్వ సాయం తోడైంది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దంగేటి జాహ్నవి ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈమెకు అంతరిక్ష రంగంపై విపరీతమైన మక్కువ. అమెరికా నాసా శిక్షణకు ఎంపికైన ఈమెకు ఆర్థిక ఇబ్బంది తలెత్తింది. బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే సీఎం ఈ శిక్షణ కోసం ఆమెకు రూ.50 లక్షలు మంజూరు చేశారు. దీంతో అమెరికాలోని నాసా అంతరిక్ష కేంద్రంలో నెల పాటు శిక్షణ పొందింది. ఇటీవల జాహ్నవి స్వస్థలం చేరుకుంది. మరికొన్నాళ్లు ఆమె శిక్షణ పొందాల్సి ఉంది. జాహ్నవి తన తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మంత్రి వేణును కలిసింది. చిరకాల స్వప్నమైన సైంటిస్ట్ ఆస్ట్రోనాట్ కావడానికి సహకారాన్ని అందజేసిన సీఎం జగన్‌కు, మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలిపింది.

## ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన జాతీయ సదస్సు

**సాక్షి, విశాఖపట్నం :** వేగంగా మార్పు చెందుతున్న సాంకేతికతలకు అనుగుణంగా రక్షణ వ్యవస్థకు సంబంధించిన యంత్రాల నిర్మాణాలను మరింత అత్యాధునికంగా రూపొందించేందుకు కృషి చేయాలని నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) డైరెక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. విశాఖపట్నంలోని ఎన్ఎస్‌టీఎల్‌లో కండిషన్ మోనటరింగ్ జాతీయ సదస్సు–2023 ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇండస్ట్రీస్ 4.0లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ సహా ఇతర టెక్నాలజీలు కీలకంగా మారనున్నాయని తెలిపారు. రెండు రోజులు జరిగిన సదస్సులో రక్షణ రంగంలో మార్పులు, అభివృద్ధికి సంబంధించిన 40 వరకూ పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ సదస్సులో సీఎంఎస్ఐ అధ్యక్షుడు పీవీఎస్ గణేష్‌కుమార్, కన్వీనర్ డాక్టర్ వెంకటరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఫైబర్ బోట్ల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం



రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం

**తాళ్లరేవు :** కాకినాడ జిల్లా తాళ్లరేవు బైపాస్ రహదారిలోని సుబ్బారాయుని దిమ్మ సమీపంలోని జీసస్ కింగ్ ఫైబర్ రిపేరింగ్ యూనిట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గుత్తుల శ్రీనివాస్‌కు చెందిన ఈ తయారీ కేంద్రం పూర్తిగా దగ్ధమైంది. మెటీరియల్‌తో పాటు సుమారు 40కి పైగా చెరువులకు ఉపయోగించే ఫైబర్ బోట్లు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మంటలార్పేందుకు ప్రయత్నించి.. అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపకవాహనాలకు సమాచారం ఇచ్చారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కాకినాడ జగన్నాథపురం నుంచి వాహనం వచ్చి మంటలను అదుపుచేసింది. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ యూనిట్ పైనుంచి హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 29 । ఏప్రిల్ । 2023






## దుర్గమ్మ సేవలో ఆర్టీసీ చైర్మన్

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు స్వాగతం పలికారు.



## దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, చండీ హోమంలో ఉభయదాతలు భారీగా పాల్గొన్నారు.



## ఘనంగా సంగీత కళాశాల వార్షికోత్సవం

విజయవాడ కల్చరల్: ఘంటసాల వేంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## న్యూస్‌రీల్

### 10లోగా అక్రెడిటేషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివిధ ప్రసార మాధ్యమాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు నూతన అక్రెడిటేషన్ కోసం మే పదో తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐపీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్ ఎస్.ఢిల్లీరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్, న్యూస్ ఏజెన్సీ జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమాచార శాఖ వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేసిన అనంతరం ఆ వివరాల ప్రింట్ డాక్యుమెంట్ కాపీలను జతపరిచిన దరఖాస్తు, ఆధార్ కార్డ్ నకలును విజయవాడ స్టేట్ గెస్ట్ హౌస్ ఆవరణలో ఉన్న జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

### నేడు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం రాతపరీక్ష

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ అర్హతతో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం పొందడానికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం రాత పరీక్ష, ఇంటర్వ్యూను శనివారం నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రాంగణంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్ మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో 75 శాతానికి పైగా, వ్యాపార గణితంలో 60 శాతానికి పైగా మార్కులతో 2022లో, 2023లో ఇంటర్ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 8 గంటలకు హెచ్‌సీఎల్ ప్రాంగణానికి హాజరు కావాలని కోరారు. వివరాలకు 83673 90590, 63019 90597, 85550 85030, 77807 54278 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటు
- అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాల కల్పన
- త్వరలో సీఎం చేతుల మీదుగా బందరు పోర్టు పనులు, వైద్య కళాశాల ప్రారంభం
- వైఎస్ జగన్ వంటి సమర్థుడైన ముఖ్యమంత్రి ఏ రాష్ట్రానికీ లేరు
- కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్.కె.రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా. చిత్రంలో మంత్రి జోగి రమేష్, ఎంపీలు బాలశౌరి, అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కేపీ సారథి, సింహాద్రి రమేష్, వల్లభనేని వంశీ, కైలే అనిల్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ అపరాజిత సింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజలు అందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలశాఖ మంత్రి, కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. అందు కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వంటి సమర్థుడైన ముఖ్యమంత్రి దేశంలో ఏ ఇతర రాష్ట్రానికీ లేరని పేర్కొన్నారు. మచిలీపట్నం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పురోగతి, టిడ్కో గృహ సముదాయాల ప్రారంభోత్సవం, రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసే అంశాలపై చర్చించారు. అనంతరం సమావేశం వివరాలను మంత్రి రోజా విలేకరులకు వెల్లడించారు.

### ఆరోగ్య శ్రీలో 3 వేల వైద్య సేవలు

ప్రజలకు, ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సేవలు అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి రోజా పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ పథకంలో మూడు వేల రకాల వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నూతన పరికరాలను ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించారని వివరించారు. ఆర్థిక వనరులను కూడా న్యాయబద్ధంగా సమీకరిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా వైద్యసేవలు అందించి ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టారని గుర్తుచేశారు.

### త్వరలో చిరకాల వాంఛ సాకారం

బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుందని మంత్రి రోజా తెలిపారు. వచ్చే నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడు తూతూ మంత్రంగా పనులకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఆ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పోర్టు పనులు ప్రారంభించిన వెంటనే శరవేగంగా జరుగుతాయని ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి శ్రీవేంకటేశ్వరరావు (నాని), కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేష్‌బాబు, వల్లభనేని వంశీమోహన్, కైలే అనిల్‌కుమార్, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ గల పోలీసులకు గుర్తింపు

**కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా**



మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ప్రతిభ గల అధికారులు బదిలీపై ఎక్కడకు వెళ్లినా పోలీసు శాఖలో కచ్చితంగా గుర్తింపు ఉంటుందని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న డీఎస్పీలను ఎస్పీ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ జిల్లాలో ఒకేసారి నలుగురు డీఎస్పీలు వేరే ప్రాంతాలకు వెళ్లటం తనను మానసికంగా బాధిస్తున్నప్పటికీ బదిలీపై వెళ్లే ప్రాంతాల్లోనూ ఇదే నిబద్ధతతో విధులు నిర్వర్తించి అక్కడా మంచి అధికారులుగా ప్రతి ఒక్కరూ గుర్తింపు తెచ్చుకోవాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటరామాంజనేయులు, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, మాసూంబాషా, మహబూబ్‌బాషా, సత్యానందం, జయపాల్, సీఐలు రామకృష్ణ, శ్రీనివాసరావు, జిల్లాలోని పలువురు సీఐలు పాల్గొన్నారు.

# జూన్ 12 నాటికి పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాల పంపిణీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ డీఈఓ రేణుక

ఆటోనగర్(విజయవాడతూర్పు): వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులు అందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తామని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల నుంచి సకాలంలో పాఠ్య, నోటుపుస్తకాలను పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తక విక్రయ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ పాఠశాలలకు ఆమె పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. జగనన్న విద్యా కానుక కూడా జూన్ 12వ తేదీ అందజేస్తామని డీఈఓ తెలిపారు. జిల్లాకు సంబంధించి సుమారు 13 లక్షల పాఠ్య పుస్తకాలు అవసరమన్నారు. ఇప్పటికి 9వ తరగతి మినహా అన్ని పుస్తకాలు వచ్చాయని పేర్కొన్నారు. జగ్గయ్యపేటకు 33,400, పెనుగంచిప్రోలుకు 13,690 పుస్తకాలను ఆర్టీసీ కార్గో బస్సుల ద్వారా పంపించామని వివరించారు. కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నానికి 42,240 పుస్తకాలను పంపించామని తెలిపారు. మే నెలాఖరు కల్లా ఈ రెండు జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాలకు పుస్తకాలు చేరుతాయని స్పష్టంచేశారు. ప్రభుత్వ పాఠ్యపుస్తక విక్రయ కార్యాలయం మేనేజరు ఎ.ఎస్.కె.ఆంజనేయులు, డీఈఓ కార్యాలయం సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి నరసింహుని తిరుకల్యాణోత్సవాలు



ముస్తాబైన వేదాద్రి ఆలయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసిన యోగానంద లక్ష్మీ నరసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి మే ఏడో తేదీ వరకు కనుల పండువగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

### ఉత్సవాలు ఇలా..

ఈ నెల 30న స్వామిని పెళ్లి కుమారుడిని చేస్తారు. మే ఒకటో తేదీన అంకురార్పణ, ధ్వజారోహణం, రెండో తేదీన శేషవాహన సేవ, మూడో తేదీన హనుమంతు వాహన సేవ, నాలుగో తేదీన దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణ, రాత్రి 12 గంటలకు భూ నీల సమేత యోగానంద లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం, ఐదో రోజున గజవాహన సేవ, తెప్పోత్సవం, ఆరో తేదీన రథున చూర్ణోత్సవం, చక్రతీర్థం, వసంతోత్సవం, ధ్వజారోహణం, ఏడో తేదీన పవళింపు సేవ, పుష్పయాగం వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయం వద్ద వారం రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయి.

### ఏర్పాట్లు పూర్తి

ఎనిమిది రోజుల పాటు జరిగే నరసింహుని కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఈఓ నాగరాజు తెలిపారు. ఆలయం వద్ద కృష్ణానదీలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఘాట్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ ఉత్సవాల్లో బాలత్రిపుర సుందరి అమ్మవారి ట్రస్టు, కేసీపీ ఆధ్వర్యంలో ప్రసాదాలు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖలతో పాటు అన్ని శాఖాధికారులు ఉత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

### ఉత్సవాలకు ప్రత్యేకంగా బస్సులు

వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నందిగామ, జగ్గయ్యపేట నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నుంచి గింజుపల్లి వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిలో కొణకంచి అడ్డరోడ్డు నుంచి బండిపాలెం మీదుగా, చిల్లకల్లు నుంచి వేదాద్రిలోని స్వామి వారి ఆలయానికి చేరుకోవచ్చు.

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్

# డెట్స్ రికవరీ ట్రిబ్యునల్

31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, శ్రీ నారాయణ భవన్, సాయిబాబా వీధి, దాబా గార్డెన్స్, విశాఖపట్నం-530 020
ఫోన్: 0891 - 2957045 ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

## సెక్యూర్డ్ అస్సెట్లు/స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఈ-వేలం ప్రకటన

(ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని రెండవ షెడ్యూలులోని రూల్ 52(2) ప్రకారం)

ఒ.ఎ.నెం.82/2016 లోగల ఆర్.పి.నెం.74/2018

1) ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, దానవాయిపేట బ్రాంచ్, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా మరియు శ్రీ గందు అప్పారావు & ఇతరుల మధ్యగల ఒ.ఎ.నెం.82/2016 లో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్ 1993కు బకాయిపడ్డ బకాయిల రికవరీ నిమిత్తం 19(22) విభాగం క్రింద గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం, ఎ.పి. వారిచే జారీ చేయబడిన 17-01-2018 తేది నాటి రికవరీ సర్టిఫికెట్‌ను అమలు నిమిత్తం దీనిని దిగువ సంతకందారుకు పంపబడినది.

2) రికవరీ సర్టిఫికెట్ ద్వారా కవర్ చేయబడిన రూ.84,54,082/- (అక్షరాల ఎనభై నాలుగు లక్షల యాభై నాలుగు వేల ఎనభై రెండు రూపాయలు మాత్రమే), వడ్డీ, ఖర్చులు మొ॥ వాటితో కలిపి దిగువ తెలిపిన సర్టిఫికెట్ బకాయిదారుల నుండి రికవరీ నిమిత్తం ఆర్.పి. నెం.74/2018 లోని ఉత్తర్వులను అమలుచేయడానికి దిగువ సంతకందారు నిర్ణయించడమైనది. (సిడి-1) శ్రీ గందు అప్పారావు, తండ్రి : సత్యనారాయణమూర్తి, వసలపూడి గ్రామం, మామిడికుదురు మండలం, తూర్పు గోదావరి జిల్లా, (సిడి-2) శ్రీ ఎస్. సంజీవ్ గాంధీ, తండ్రి: ఎస్.సుబ్బారావు, డి.నెం. 1-35/1, అత్తమూరు గ్రామం, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, (సిడి-3) శ్రీ వేగేశ్న రఘువర్మ రాజు, తండ్రి: వి.జగపతిబాబు, డి.నెం. 1-154, దొడ్డిపట్ల గ్రామం, నైకలూరు మండలం, కృష్ణా జిల్లా, (సిడి-4) శ్రీ వేగేశ్న వెంకటరామ మోహన్‌రావు, తండ్రి: ఎస్.రాములు, డి.నెం. 17-74(3), చినుకూరి వీధి, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా.

3) ది.31-01-2023 నాటికి రూ.2,37,26,554/- (ది.31-01-2023 నాటికి వడ్డీ లెక్కింపబడింది) మరియు తదనంతర వడ్డీ మరియు ఖర్చులు, వేలం అమ్మకం క్రింద రికవరీ ప్రొసీడింగ్స్‌లో ఉత్పన్నమైన ఖర్చులు చెల్లించవలసి వుంది.

4) రికవరీ సర్టిఫికెట్ పరిశీలించినమీదట దిగువ తెలిపిన సర్టిఫికెట్ బకాయిదారుల యొక్క షెడ్యూలు ఆస్తులను సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఈ-ఆక్షన్ అమ్మకం పద్ధతిలో విక్రయించేందుకు దిగువ సంతకందారు ఆదేశించడమైనది. తేదీ, సమయం దిగువ ఇవ్వబడినది. వేలం ముగిసేలోగా బిడ్ జరిగితే, ప్రతిదానికి 5 నిమిషాల ఆటో ఫ్లాష్ ఎక్స్‌టెన్షన్ ఫ్లాష్ అనగా ఒక్కదానికి 5 నిమిషాల పొడిగిన ఇ-వేలం ముగింపు సమయం పొడిగించబడును. వేలం తేది, బిడ్ ఫారంను సమర్పించడానికి చివరి తేది, రిజర్వుధర, ధరావత్తు, బిడ్ పెంపు మొత్తం మరియు వేలం సమయం వివరాలు ప్రతి ఐటమ్/ ఆస్తి వివరాలు ఈక్రింద తెలియజేయడమైనది.

| వేలము తేది : ది.03-06-2023, | బిడ్ కొరకు చివరి తేది : 01-06-2023 (సా॥ 4-00 గం॥లకు) | | | | |
|---|---|---|---|---|---|
| షెడ్యూలు | ఆస్తి యొక్క విస్తీర్ణం | రిజర్వుధర | ధరావత్తు | బిడ్ పెంపు మొత్తం | వేలం జరుగు సమయం* |
| షెడ్యూలు – బి | 4840 చ॥గజాలు లేదా ఎ.1.00 సెంటల వ్యవసాయ భూమి | ₹ 1,50,00,000/- | ₹ 15,00,000/- | ₹ 1,00,000/- | ఉ॥ 11.00 గం॥ నుండి మ॥ 12.00 గం॥ వరకు |
| షెడ్యూలు – సి | 4840 చ॥గజాలు లేదా ఎ.1.00 సెంటల వ్యవసాయ భూమి | ₹ 1,50,00,000/- | ₹ 15,00,000/- | ₹ 1,00,000/- | |

*వేలం ముగిసేలోగా బిడ్ జరిగితే, ప్రతిదానికి 5 నిమిషాల ఆటో ఎక్స్‌టెన్షన్ ఫ్లాష్ అనగా ఒక్కొక్కదానికి 5 నిమిషాల పొడిగిన ఈ-వేలం ముగింపు సమయం పొడిగించబడును.

5) సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఈ-ఆక్షన్‌లో అమ్మకం నిమిత్తం పాల్గొనవల్సిందిగా ప్రజలను కోరడమైనది. సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు : మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి : శ్రీ ధరణి కృష్ణ, నెం.9948182222, ఇ మెయిల్ ఐడి : andhra@c1india.com.

6) ఈ-ఆక్షన్ యొక్క వివరాణాత్మక నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ https://www.bankeauctions.com చూడవల్సిందిగా ఆసక్తిగల అభ్యర్థులు/ బిడ్డర్‌లను కోరడమైనది. అమ్మకం లావాదేవీల్లో ఈ-ఆక్షన్‌లో పాల్గొనే నిమిత్తం మరియు తమ బిడ్ ఫారాల సమర్పణ కొరకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్, హెల్ప్, విధానం, ఈ-ఆక్షన్ గురించి ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలెను.

7) వేలములో పాల్గొనే ఉద్దేశ్యము గల అభ్యర్థులు ధరావత్తు సొమ్మును ఆర్‌టిజియస్/నెఫ్ట్/ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కలెక్షన్ అకౌంట్ నెం.09434915010026, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్, దానవాయిపేట బ్రాంచ్, రాజమండ్రి, ఐయఫ్‌యస్‌సి కోడ్ : IBKL0000094 మరియు బిడ్ ఫామ్ను ఆన్‌లైన్‌లో సమర్పించుటకు చివరి తేదీని పైన పేర్కొన్న పట్టికలో వివరించిన విధంగా ధరావత్తు జమచేసిన ప్రూఫ్, పాన్ కార్డ్, చిరునామా మరియు ఐడి ప్రూఫ్‌ను పైన తెలిపిన పట్టికలో తెలిపిన చివరితేదిలోగా మరియు బిడ్ ఫామ్ యొక్క హార్డ్ కాపీని పూర్తిగా వివరములతో నింపి పైన తెలిపిన డాక్యుమెంట్లను స్వీయనిర్ధారణ సంతకంతో రిజిస్టర్ పోస్ట్‌ద్వారాగాని/ స్పీడ్ పోస్ట్ ద్వారాగాని/ కొరియర్ ద్వారా గాని దిగువ సంతకందారుకు ది.02-06-2023న సాయంత్రం 4.00 గం॥లలోపు దిగువ సంతకందారుకు చేరవలెను. ఏవిధమైన తపాలాశాఖవారి ఆలస్యములతో మాకు సంబంధం లేదు.

8) ఆసక్తిగలవారు వేలం అమ్మకానికి వుంచబడిన ఆస్తి యొక్క టైటిల్ గురించి విచారణలు, షెడ్యూలు ఆస్తుల యొక్క తనిఖీ, టైటిల్ డీడ్‌ల యొక్క కాపీలు మరియు ఎటువంటి ప్రతిబంధక సర్టిఫికెట్‌ల కొరకు శ్రీ కె.వి కృష్ణయ్య, డిజియమ్ & బ్రాంచ్ హెడ్, మొబైల్ నెం. 9703200556, ల్యాండ్‌లైన్ నెం.0883-2433335, ఈ మెయిల్ ఐడి : rb094@idbi.co.in ద్వారా సంప్రదించవల్సిందిగా కోరడమైనది. ఈ దిగువ సంతకందారు అమ్మకం ధృవీకరించిన సఫలీకృత బిడ్డరుకు బ్యాంకు యొక్క బ్రాంచి హెడ్ ఆస్తికి సంబంధించిన టైటిల్‌డీడ్ డాక్యుమెంట్లను (క్రింద పేర్కొన్న వరుస నెం.లు 8ఎ, 8బి, 8సి, & 8డి, వద్ద పేర్కొన్న నిబంధనలు మరియు షరతులకు లోబడి) అందజేస్తారు.

8ఎ) వేలం కోసం ఉంచిన ఆస్తులు 2018 ఎఫ్ఐఆర్ నెం.ఆర్‌సి 02(ఎ) ప్రకారం, సిబిఐ, ఏసిబి, విశాఖపట్నం దర్యాప్తులో ఉన్నాయని మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విశాఖపట్నం, విచారణలో ఉన్నాయని ఆసక్తి ఉన్న బిడ్డర్లు గమనించవలసిందిగా కోరడమైనది.

8బి) సిబిఐ, ఏసిబి, విశాఖపట్నం 26-04-2018 & 06-07-2021 నాటి లేఖ ప్రకారం సిబిఐ నుండి నిర్దిష్ట అనుమతి లేకుండా ఒరిజినల్ టైటిల్ డీడ్‌లను విడుదల చేయవద్దని బ్యాంకుకు సూచించారు. అయితే, వేలంలో విజయవంతమైన కొనుగోలుదారు పేరు మీద ఎస్.ఆర్.ఓలో సేల్ సర్టిఫికెట్‌ను నమోదు చేయడానికి సమ్మతి తెలిపియున్నారు.

8సి) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విశాఖపట్నం 08-06-2018 నాటి లేఖ ప్రకారం తనఖా పెట్టబడిన/ తాకట్టు పెట్టిన ఆస్తుల యొక్క ఒరిజినల్ ఆస్తి పత్రాలను బ్యాంకు సంరక్షణలో ఉంచాలని మరియు వారి సమ్మతి లేకుండా విడుదల చేయవద్దని బ్యాంకుకు సూచించారు.

8డి) 2018 ఎఫ్ఐఆర్ నెం.ఆర్‌సి 02(ఎ)తో సంబంధిత విచారణకు సంబంధించి ఒరిజినల్ టైటిల్ డీడ్‌లు సిబిఐ వద్ద ఉన్నాయి.

ఆస్తి యొక్క వివరములు

షెడ్యూలు 'బి'

మహేశ్వరం ఎస్‌ఆర్‌ఓలో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం.4598/2010 ప్రకారము షెడ్యూలు ఆస్తి శ్రీ ఎస్.సంజీవ్ గాంధీ కి చెందినది. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం ఎస్ఆర్‌ఓ పరిధి, మహేశ్వరం మండలం, తుమ్మలూరు గ్రామ పంచాయతి, తుమ్మలూరు గ్రామం, ఆర్.ఎస్ నెం.368 నందు 4840 చ॥గజాలు లేదా ఎ.1.00 గుంటలు విస్తీర్ణముగల ఖాళీస్థలము యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం : 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, పడమర : జి.భిక్షపతి యొక్క భూమి, ఉత్తరం : యమ్‌డి. సలీమ్ యొక్క భూమి.

షెడ్యూలు 'సి'

మహేశ్వరం ఎస్‌ఆర్‌ఓలో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం.4599/2010 ప్రకారము షెడ్యూలు ఆస్తి శ్రీ వేగేశ్న రఘువర్మ కు చెందినది. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం ఎస్ఆర్‌ఓ పరిధి, మహేశ్వరం మండలం, తుమ్మలూరు గ్రామ పంచాయతి, తుమ్మలూరు గ్రామం, ఆర్.ఎస్ నెం.368 నందు 4840 చ॥గజాలు లేదా ఎ.1.00 గుంటలు విస్తీర్ణముగల ఖాళీస్థలము యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం : 33 అ॥ల వెడల్పు గల రోడ్డు, పడమర : జి.భిక్షపతి యొక్క భూమి, ఉత్తరం : యమ్‌డి. సలీమ్ యొక్క భూమి.

(ఈ ప్రకటన వివరములు ది.13-04-2023 తేదీన నా స్వహస్తాలతో మరియు సీల్‌తో విశాఖపట్నం ట్రిబ్యునల్‌వారి సమక్షములో ధృవీకరించబడినవి).

సం/- బి.ఎన్.యస్.వి.యస్.కె. బంగార్రాజు, రికవరీ ఆఫీసర్-2
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం.

# జీవితం నిరంతర కురుక్షేత్రం

- సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి
- 'విశ్వజనీన గీత' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మానవ జీవితం నిరంతరం కురుక్షేత్రమని ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. విద్యార్థులు మానవీయ కోణాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విద్యావేత్త ఎంఆర్‌కే మూర్తి రచించిన 'విశ్వజనీన గీత' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తనికెళ్ల భరణి పుస్తకాన్ని ఆవిష్కరించి తొలిప్రతిని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావుకు అందించారు. అనంతరం తనికెళ్ల భరణి మాట్లాడుతూ భారతీయ ఔన్నత్యాన్ని చాటి చెప్పే భగవద్గీతపై వందలాది భాషల్లో వేలాది వ్యాఖ్యానాలు, అనేక వివరణలు పుస్తక రూపాల్లో వచ్చాయన్నారు. అదే గ్రంథాన్ని నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే దిశగా 'విశ్వజనీన గీత' పేరుతో ఎంఆర్‌కే మూర్తి తీసుకొచ్చారన్నారు. సంస్థ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వజనీన గీత పుస్తక రచయితను ప్రశంసించారు. నటుడు తనికెళ్ల భరణి సినీ, రంగస్థల రంగాలకు అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులు ఇటువంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని తమతమ జీవితాల్లో ఉన్నత స్థాయికి ఎదగటానికి కృషి చేయాలన్నారు. రచయిత ఎంఆర్‌కే మూర్తి మాట్లాడుతూ విద్యార్థులను ప్రేరణనిచ్చేందుకు, వారిలో సృజనకు పదును పెట్టేందుకు ఈ పుస్తకాన్ని తీసుకొచ్చానన్నారు. కళాశాల అధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు, కార్యదర్శి పీ లక్ష్మణస్వామి, ఉపాధ్యక్షులు శ్రీరాం రాధాకృష్ణమూర్తి, కోశాధికారి కొత్త మాసు వెంకటేశ్వరరావు, కేబీఎస్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు ప్రసంగించారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): తుమ్మలపాలెంలో జాతీయ రహదారి నంబర్65పై ఓ కారు శుక్రవారం బీభత్సం సృష్టించింది. విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న కారు రోడ్డుపై నడుస్తున్న వ్యక్తిని ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా బైకును ఢీకొట్టి అదుపు తప్పి ఆగిఉన్న కారును వెనుక వైపు ఢీకొట్టింది. ఈఘటనలో రోడ్డుపై వెళ్తున్న తుమ్మలపాలెంకు చెందిన కలపాల రాంబాబు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ పి.శ్రీను బైక్‌పై వెళ్తూ గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు పంపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, కమిషనర్ స్వప్నిల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవుల సందర్భంగా కృష్ణానదీ తీరాన పున్నమీఘాట్‌లో శనివారం సాయంత్రం నుంచి మే 7వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 11 గంటల వరకు 'ఫ్లేవర్స్ ఆఫ్ ఇండియా' థీమ్‌పై రివర్ ఫ్రంట్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం రాత్రి పున్నమీఘాట్‌లో జరుగుతున్న ఫుడ్ ఫెస్టవల్ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఫుడ్ ఫెస్టివల్ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నలుగురు జిల్లా బహిష్కరణ

విజయవాడ స్పోర్ట్స్: గంజాయి, ఇతర మత్తుపదార్థాలు అక్రమ రవాణా చేయడంతో పాటు ఘర్షణలకు పాల్పడుతూ జిల్లాలో ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న నలుగురు వ్యక్తులను జిల్లా నుంచి బహిష్కరిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న వల్లభనేని ప్రభుదాస్ అలియాస్ దంతం ప్రభుదాస్, కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న సాలి వెంకటేష్, షేక్ కరిముల్లా, కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న షేక్ సలీం గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలను అక్రమంగా రవాణా చేయడంతో పాటు పలు ప్రాంతాల్లో అల్లర్లను సృష్టిస్తున్నట్లు సీపీ చెప్పారు. జైలు జీవితం అనుభవించినా వీరి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో జిల్లా నుంచి బహిష్కరిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

## మే 22న బందరు పోర్టు పనులు ప్రారంభం

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణ పనులను మే 22వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మాజీ మంత్రి, బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) తెలిపారు. అదేరోజు మచిలీపట్నంలోని గోసంఘంలో నిర్మాణం పూర్తి చేసుకున్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు సీఎం చేతుల మీదుగా అందజేయనున్నట్లు పేర్ని నాని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): కారు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై గురు వారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మార్త నరసింహారావు (30) గ్రామం నుంచి సమీపంలోని హోటల్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఉన్న ఇష్టా హోటల్ సమీపంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

## నేడు నటరాజ రామకృష్ణ జయంత్యుత్సవం

సాక్షి, అమరావతి: నటరాజ రామకృష్ణ జయంతిని పురస్కరించుకుని శనివారం అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సీఈవో ఆర్.మల్లికార్జునారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాయంత్రం ఐదు గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. అంతర్జాతీయ ప్రఖ్యాత కళాకారులతో నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నట్టు చెప్పారు.

## గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

రామవరప్పాడు : ఆగి ఉన్న లారీలో నిద్రిస్తున్న డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో నిద్రలోనే మృతి చెందిన ఘటన నిడమానూరు జాతీయరహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం నుంచి విజయవాడ వైపు నిడమానూరు ఖుషి దాబా ఎదురు థర్మాకోల్ షీట్ల లోడుతో ఉన్న కంటైనర్‌ను జాతీయరహదారికి ఒక పక్కగా ఆపి క్యాబిన్‌లో డ్రైవర్ నిద్రించాడు. ఉదయం అయిన డ్రైవర్ లెగవకపోవడంతో అనుమానం వచ్చి గ్రామ వీఆర్వోకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను ఎంత లేపినా చలనం లేకపోవడంతో 108కు సమాచారం అందించారు. పరీక్షించిన సిబ్బంది మృతి చెందినట్లు నిర్ధారించారు గుండెపోటు రావడంతో మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుని వద్ద లభించిన డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించగా ఊరు మద్రాసు, పేరు మునియాలగణ్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న పటమట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయశాఖ, విజయవాడ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఈ క్రింది [illegible]

| క్రమ సంఖ్య | పని వివరము | అంచనా విలువ |
|---|---|---|
| 1. | శ్రీ [illegible] దేవస్థానం, [illegible] గ్రామము [illegible] మండలం, కృష్ణాజిల్లా. | రూ. 80.00 లక్షలు |
| 2. | శ్రీ [illegible] దేవస్థానం, [illegible] గ్రామము [illegible] మండలం, కృష్ణాజిల్లా | రూ. 80.00 లక్షలు |

ఇతర వివరములకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.
ఇట్లు : [illegible]

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
తాడిగడప బ్రాంచి (11931)
పెనమలూరు మండలం,
కృష్ణా జిల్లా - 521137

## ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప శాఖ అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం సెక్షన్ రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదేమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు ఎక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన బకాయి మొత్తమును కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప శాఖ వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది. 25-05-2023న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.

1) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) మెస్సర్స్ ఎంపైర్ గ్రూప్ ఇన్‌ఫ్రా & హోల్డింగ్స్ ప్రై.లి. డి.నెం. 10-265, ఎస్.ఆర్.బి.జి.పి.ఎల్ బిల్డింగ్, గన్నవరం, కృష్ణా జిల్లా - 521101. 2) శ్రీ మధిర రాము, తండ్రి : మోహనరావు, ఫ్లాట్ నెం. 104, శ్రీ రామ్ రూబీ విల్లా, రోడ్ నెం. 5, పందరీపురం, అశోక్‌నగర్, విజయవాడ-520007. 3) శ్రీమతి మందవ సంగీత, భర్త : మధిర రాము, ఫ్లాట్ నెం. 104, శ్రీ రామ్ రూబీ విల్లా, రోడ్ నెం. 5, పందరీపురం, అశోక్‌నగర్, విజయవాడ-520007.

బకాయి మొత్తం : డిమాండ్ నోటీసు తేది 19-07-2021 నాటికి రూ. 59,95,916.08/- (అక్షరాలా యాభై తొమ్మిది లక్షల తొంభై ఐదు వేల తొమ్మిది వందల పదహారు రూపాయల ఎనిమిది పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : ఆస్తి నెం.1 : శ్రీ మధిర రాము, తండ్రి : మోహనరావు గారి పేరిట కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, చిన్నఅవుటపల్లి గ్రామం & గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం. 151/2, డోర్ డి.నెం. 8-200 వద్ద 176 చ॥గ॥ల విస్తీర్ణంలో గల ఆర్‌సిసి రూఫ్ బిల్డింగ్. ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు : శ్రీ మద్దినేని వెంకయ్య గారి ఆస్తి, దక్షిణం : గోల్డెన్ నెస్ట్ అపార్ట్‌మెంట్ ఆస్తి, పడమర : పంచాయితీ రోడ్డు, ఉత్తరం : శ్రీ మద్దినేని వెంకయ్య గారి ఆస్తి.

రిజర్వు ధర : రూ. 5,72,000/- ధరావత్తు : రూ. 57,200/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

ఆస్తి నెం.2 : శ్రీ మధిర రాము, తండ్రి : మోహనరావు గారి పేరిట విజయవాడ, అశోక్‌నగర్, ఆర్.ఎస్.నెం. 233/1 వద్ద మొత్తం 822 చ॥గ॥లలోని అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 33 చ॥గ॥ల విస్తీర్ణంతో కలిపి 'శ్రీరామ్స్ రూబీ విల్లా' అపార్ట్‌మెంట్ నందు ఐదవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 601కి చెందిన నివాస ఫ్లాట్. స్థలమునకు హద్దులు : తూర్పు : 30 చ॥అ॥ల వెడల్పు గల మున్సిపల్ రోడ్డు, దక్షిణం : బందరు కాలువ కట్ట, పడమర : శ్రీ అత్తిలి సత్యనారాయణ & జి. నంబాబ్ గార్లకు చెందిన ఆస్తి, ఉత్తరం : ఇతరులకు చెందిన ఆస్తి. ఫ్లాట్‌కి చెందిన ఆస్తి : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : శూన్యాకాశము, పడమర : శూన్యాకాశము, ఉత్తరం : శూన్యాకాశము.

రిజర్వు ధర : రూ. 40,25,000/- ధరావత్తు : రూ. 4,02,500/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

2) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీమతి గంగం మమత, భర్త : గంగం శ్రీనివాసరెడ్డి, 3-14, బంజారుపల్లి, వందిక్క, హుస్నాబాద్ మండలం, సిద్ధిపేట జిల్లా, తెలంగాణ-505467. 2) శ్రీ కాజా గోపికృష్ణ, తండ్రి : రామమోహనరావు, డి.నెం. 54-20-11/1, గౌరంగబాబు వీధి, శ్రీనగర్ కాలనీ, విజయవాడ-520008

బకాయి మొత్తం : శ్రీమతి గంగం మమత గారు తీసుకున్న లోన్ తాలూకు డిమాండ్ నోటీసు తేది 05-05-2021 ప్రకారం బకాయి రూ. 31,44,708/- మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : శ్రీమతి గంగం మమత, భర్త : గంగం శ్రీనివాసరెడ్డి గారి పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, గూడవల్లి గ్రామం & గ్రామ పంచాయితీ, డి.నెం. 2-136 వద్ద అవిభక్త వాటా 54.25 చ॥గ॥లతో కలిపి 1923 చ॥గ॥ విస్తీర్ణంలో నిర్మించిన సాయి వివాన్ అపార్ట్‌మెంట్ నందు నాల్గవ అంతస్తులో 1022 చ॥అ॥ ప్లింత్ ఏరియా విస్తీర్ణంలోని ఫ్లాట్ నెం. 606. ఆస్తి / ఫ్లాట్ కి హద్దులు : తూర్పు : శూన్యాకాశము, దక్షిణం : శూన్యాకాశము, పడమర : 7.10 అ॥ వెడల్పు కామన్ కారిడార్ మరియు మెట్లు, ఉత్తరం : శూన్యాకాశము మరియు లిఫ్ట్.

రిజర్వు ధర : రూ. 25,00,000/- ధరావత్తు : రూ. 2,50,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

3) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీ కోటం వినోద్‌కుమార్ రెడ్డి, తండ్రి : రమణారెడ్డి, 1-73, రాచయ్యపేట, గోపవరం, గోపవరం ప్రాజెక్ట్ సైట్, కడప-516233. 2) శ్రీమతి శారదా బోడేపూడి, భర్త : బోడేపూడి వెంకటరావు, ఫ్లాట్ నెం. 505, డి.నెం. 2-29, సాయి వివాన్ అపార్ట్‌మెంట్స్, గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్ - 521104

బకాయి మొత్తం : శ్రీ కోటం వినోద్ కుమార్ రెడ్డి గారు తీసుకున్న లోన్ తాలూకు డిమాండ్ నోటీస్ తేది 05-05-2021 ప్రకారం బకాయి రూ. 26,46,203/- మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ఆస్తి వివరములు : శ్రీ కోటం వినోద్ కుమార్ రెడ్డి, తండ్రి : రమణారెడ్డి గారి పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, గూడవల్లి గ్రామం & గ్రామ పంచాయితీ, డి.నెం. 2-136 వద్ద అవిభక్త వాటా 54.25 చ॥గ॥లతో కలిపి 1923 చ॥గ॥ విస్తీర్ణంలో నిర్మించిన సాయి వివాన్ అపార్ట్‌మెంట్ నందు మూడవ అంతస్తులో 1022 చ॥అ॥ ప్లింత్ ఏరియా విస్తీర్ణంలోని ఫ్లాట్ నెం. 406. ఆస్తి / ఫ్లాట్ కి హద్దులు : తూర్పు : శూన్యాకాశము, దక్షిణం : శూన్యాకాశము, పడమర : కామన్ కారిడార్ మరియు మెట్లు, ఉత్తరం : శూన్యాకాశము మరియు లిఫ్ట్.

రిజర్వు ధర : రూ. 25,00,000/- ధరావత్తు : రూ. 2,50,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. అధీకృత అధికారి గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తులపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు మొబైల్ నెం. 8867673939, MailID: ubin0811939@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత/సహాదారులుతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద టీవీ నోటీసుగా పరిగణించవలెను.

తేది : 24-04-2023 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : తాడిగడప యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప బ్రాంచి



Saptagiri Grameena Bank (Public Sector RRB : Sponsored by Indian Bank) | సప్తగిరి గ్రామీణ బ్యాంక్ | सप्तगिरि ग्रामीण बैंक

HEAD OFFICE: CHITTOOR, A.P

## AUDITED FINANCIAL RESULTS FOR THE YEAR ENDED 31st MARCH 2023

BALANCE SHEET AS ON 31.03.2023 (Amount in 000s)

| LIABILITIES | As on 31-03-2023 | As on 31-03-2022 |
|---|---|---|
| Capital | 177705 | 177705 |
| Share Capital Deposits | - | - |
| Reserves & surplus | 14072687 | 11432522 |
| Deposits | 119371278 | 91065282 |
| Borrowings | 36429838 | 42142436 |
| Other Liabilities | 5174695 | 3056201 |
| TOTAL | 175226203 | 147874146 |
| ASSETS | | |
| Cash and Balances with RBI | 3343207 | 2790466 |
| Balances with Banks and Money at Call & Short Notice | 72288243 | 60792899 |
| Investments | 11919994 | 10860007 |
| Advances (excluding IBPC) | 84293360 | 70547145 |
| Fixed Assets | 176621 | 153096 |
| Other Assets | 3204778 | 2730533 |
| TOTAL | 175226203 | 147874146 |
| Contingent Liabilities | 164154 | 163676 |

PROFIT AND LOSS ACCOUNT FOR THE YEAR ENDED 31.03.2023 (Amt in 000s)

| | As on 31-03-2023 | As on 31-03-2022 |
|---|---|---|
| I INCOME | | |
| Interest Earned | 13652264 | 10713368 |
| Other Income | 1405134 | 1125350 |
| Provisions Written Back | - | - |
| TOTAL | 15057398 | 11838718 |
| II EXPENDITURE | | |
| Interest Expended | 8019136 | 6227115 |
| Operating Expenses | 1662007 | 1643721 |
| Provisions and Contingencies | 1862186 | 1169729 |
| Provision for Investments and Others | - | - |
| TOTAL | 11543329 | 9040565 |
| III PROFIT & LOSS | | |
| Net profit for the year | 3514069 | 2798153 |
| Provision for Income Tax | 952500 | 680000 |
| Deferred Tax Liability/[DTA] | 78596 | 108286 |
| TOTAL | 2640165 | 2009867 |
| IV APPROPRIATIONS | | |
| Transfer to Statutory Reserves | 528033 | 401973 |
| Transfer to Other Reserves | - | - |
| Balance carried over to Balance Sheet | 2112132 | 1607894 |
| TOTAL | 2640165 | 2009867 |

| Growth | |
|---|---|
| 35.49% YoY Growth | Gross Profit Rs. 537.63 Cr |
| 31.36% YoY Growth | Net Profit Rs.264.02 Cr |
| 23.69% YoY Growth | Business per Branch Rs.94.27 Cr |
| 19.91% YoY Growth | Business per Employee Rs. 21.73 Cr |
| 22.74% YoY Growth | Owned Funds Rs. 1425.04 Cr |
| 31.08% YoY Growth | Deposits Rs. 11937.13 Cr |
| 21.26% YoY Growth | Gross Advances Rs. 10121.58 Cr |
| 26.39% YoY Growth | Total Business Rs. 22058.71 Cr |
| 49 bps YoY Reduction | Gross NPA 0.61% |
| Net NPA 0% | |

Notes: 1. The above financial results have been audited by the statutory central auditors of the bank in line with the guide lines, issued by NABARD and are approved by the Board of Directors in their meeting held on 27.04.2023. 2. The financial results have been prepared following same accounting polices and practices as those followed in the previous financial year ended 31.03.2022. 3. The financial results have been arrived at, after considering provisions for standard assets, Non Performing assets, as per prudential norms issued by RBI and provisions for Gratuity, Leave encashment, depreciation on assets, deferred tax and income tax, pension Fund etc.

| CHITTOOR 28.04.2023 | NIRANJAN & NARAYAN Chartered Accountants | DSVR KISHORE PATNAIK CHIEF MANAGER (A & I) | B.K. RAVI SHANKAR General Manager | A.S.N. PRASAD CHAIRMAN |
|---|---|---|---|---|

## క్లుప్తంగా

### ప్రజల దప్పిక తీర్చడం అభినందనీయం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వేసవిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దప్పిక తీర్చడం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సీతారామపురం సన్‌రైజ్ ఆస్పత్రి సమీపంలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వైద్య సేవలు, ఇతర పనుల కోసం వేలాది మంది ఇక్కడకు వస్తుంటారని, అలాంటి వారికి చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచిపరిణామం అన్నారు. కార్యక్రమంలో కాజ శంకర్, ఓబిరెడ్డి వెంకట్రామిరెడ్డి, మోహన్‌రావు, క్రాంతి, నాగ భూషణం, మోజెస్, కుక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): 'తూర్పు'లో 11వ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలోని కొసర మసీద్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని పవన్ కుమార్, షౌకత్, మసీదు కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

ఆటోనగర్(విజయవాడతూర్పు): హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, విశాఖపట్నంతో పాటు పలు దూర ప్రాంతాల ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆటోనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 99592 25463 నెంబర్‌కు చేసి సమస్యలను తెలపాలని పేర్కొన్నారు.

### వైఎస్సార్ బీమా అందజేత



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక 22వ డివిజన్‌లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వ్యక్తి కుటుంబసభ్యులకు స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి వైఎస్సార్ బీమా కింద తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం మృతి చెందిన బాలబొమ్మ గణేష్‌కు వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయంగా రూ.10 వేలు మంజూరైంది. శుక్రవారం వార్డు సచివాలయంలో ఆర్థిక సాయాన్ని కార్పొరేటర్ కొండారెడ్డి మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటర్ ఫలితాల్లో మోడరన్ విద్యార్థుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంటర్మీడియట్ ఫలితాల్లో మోడరన్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు అకాడమీ ప్రిన్సిపాల్ కేవీ సునీల్‌చంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో సీహెచ్ సంచన 489 మార్కులు, ఎ మిశ్రీత 484, జీపీఏ శ్రీవాత్సవ్ 484 మార్కులు సాధించారని, 88.7 శాతం ఉత్తీర్ణత పొందినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీలో పి సాయి ఫణీంద్ర 976 మార్కులు, ఎస్ శ్రావణి 975, కె వెంకట విష్ణు ప్రియ 965, 94.2 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. మూడున్నర దశాబ్దాలుగా సుంకర పాపారావు ఆధ్వర్యంలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నామని ప్రిన్సిపాల్ సునీల్‌చంద్ తెలిపారు.

### దైవారాధనతోపాటు సమాజ సేవ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రతి వ్యక్తి దైవారాధనతోపాటు సమాజ సేవ చేయాలని ఆధ్యాత్మికవేత్త, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. లయన్స్ డే సందర్భంగా వాసవి క్లబ్ గెలాక్సీ, వాసవి క్లబ్స్ ఆధ్వర్యాన శుక్రవారం గొల్లపూడిలోని వాసవి ఫార్మా కాంప్లెక్స్‌లో నిర్మించిన ఉత్తర ముఖ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో హజరత్తయ్య గుప్తాను సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు కొణిజేటి శ్రీలక్ష్మీ నాగేశ్వరరావు దంపతుల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అభివృద్ధికి రూ.50 వేలను గుప్తా చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

**దేవినేని అవినాష్**



సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): పార్టీ పటిష్టానికి పని చేసే ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. శుక్రవారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 3, 17 డివిజన్ల వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి రథసారథులు కార్యకర్తలేనన్నారు. పార్టీ పటిష్టతకు పాటుపడుతున్న కార్యకర్తలు దొరకడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ప్రతి కార్యకర్తకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. వానొస్తే తారకరామనగర్ ప్రాంత వాసులు పడుతున్న బాధలను కళ్లారా చూసి చలించిపోయి ఇచ్చిన మాట ప్రకారం రిటైనింగ్ వాల్ నిర్మించి ముంపు ప్రాంత వాసుల కష్టాలు తీర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు జగనన్నపై, పార్టీ మీద చేస్తున్న అసత్య ప్రచారాలు తిప్పికొట్టడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ఒకటికి పదిసార్లు వారికి వివరించాలని కోరారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన క్లస్టర్ ఇన్‌చార్జులు, కన్వీనర్లు, గృహసారథులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, 3,17 డివిజన్ల కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, తంగిరాల రామిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ముసునూరు సుబ్బారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి, అయ్యపరెడ్డి, దామోదర్, తిరుపతిరెడ్డి, మొహిద్దీన్, సాయికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# నేడు స్థాయీ సంఘం సమావేశం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్ల అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకోవడానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం స్థాయీ సంఘం సమావేశం జరగనుంది.

వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్‌కంట్రోల్ రూంలో సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. అజెండాలో మొత్తం 15 అంశాలు రాగా సభ్యులు ఆయా అంశాలను చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

**ప్రధానాంశాలివి**

- 63వ డివిజన్‌లోని వడ్డెర కాలనీలో వీఎంసీ మల్టీ పర్పస్ హాలు, వాంబే కాలనీలోని హెచ్‌బ్లాక్‌లోని కమ్యూనిటీ హాలు లీజు, శ్రీకృష్ణదేవరాయ షాపింగ్ కాంప్లెక్స్‌లో 14 షాపుల లీజు పొడగింపు, అద్దె పెంపుదలపై వచ్చిన ప్రతిపాదనను సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.
- సర్కిల్–1 పరిధిలోని 48వ డివిజన్ బ్రహ్మంగారి మఠం వద్ద కల్యాణ మండపానికి షెడ్ నిర్మాణం, తమ్మిన పోతురాజు కమ్యూనిటీ హాలు మొదటి అంతస్తు నిర్మాణానికి కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు చర్చించనున్నారు.
- వీఎంసీ నూతన భవనం 2వ అంతస్తు వరకు ఎయిర్‌కండిషన్లు, ఇతర వస్తువుల మంజూరుకు, రూ.49.80 లక్షల నిధుల మంజూరుకు వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని రైల్వేట్రాకు నుంచి పాత ఆర్‌ఆర్‌పేట స్ట్రాం వాటర్ డ్రెయిన్ నిర్మాణం వరకు ఆర్‌సీసీ బాక్స్ కల్వర్టు నిర్మాణం చేపట్టడానికి అయ్యే రూ.49.50 లక్షలు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేసి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు చర్చించననున్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణలంక సబ్‌స్టేషన్, పీఎస్ఆర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాణిగారితోట, నెహ్రూనగర్, సత్యంగారి దొడ్డి, గౌతమీనగర్, ద్వారకానగర్, మంటాడవారి వీధి, శంకరమఠం రోడ్డు, సుబ్బరాయనగర్, తిరుమలరావు వీధి, రణదీవెనగర్ కట్ట, పచ్చమేడబజార్, హైస్కూల్ రోడ్డు, పెద్దివారి వీధి, కల్పనా ప్రింట్స్ రోడ్డు, మస్జీద్ వీధి, వల్లూరివారి వీధి, రెహ్మాన్ వీధి, లాల్‌బహదూర్ రోడ్డు, మెట్లబజార్, పోలీస్ రామయ్య వీధి, పోస్టాఫీస్ రోడ్డు ప్రాంతాల్లో కరెంట్ ఉండదని వివరించారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ పరిధిలోని స్క్యూబ్రిడ్జి, కృష్ణలంక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తారక రామానగర్, భూపేష్‌గుప్తానగర్, చలసానినగర్, బాలాజీనగర్, గీతానగర్‌కట్ట, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్ర స్థాయి చెస్ ఫిడేరేటింగ్ పోటీల రన్నర్ శర్వాణి



శర్వాణిని అభినందిస్తున్న అక్బర్‌పాషా, రాజీవ్

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్–17 బాలికల చెస్ ఫిడేరేటింగ్ పోటీల్లో నగర క్రీడాకారిణి చీదెళ్ల శర్వాణి రెండో స్థానంలో నిలిచి రన్నర్ ట్రోఫీని కైవసం చేసుకోవడం అభినందనీయమని ది విజయవాడ చెస్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎండీ అక్బర్‌పాషా, ఎం.రాజీవ్ తెలిపారు. కృష్ణా జిల్లా పోరంకిలో ఇటీవల జరిగిన పోటీల్లో సత్తా చాటిన శర్వాణిని శుక్రవారం అభినందించారు.

ఎన్టీఆర్ జిల్లా సెకండ్ సీడెడ్ చెస్ క్రీడాకారిణి రాష్ట్ర స్థాయి పోటీలకు శర్వాణి ప్రాతినిధ్యం వహించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 7/8 పాయింట్లు సాధించడంతో పాటు రూ. 3,500 నగదు ప్రోత్సాహక బహుమతిని, ప్రశంసాపత్రాన్ని సాధించిందన్నారు. మే ఒకటో తేదీ నుంచి పంజాబ్‌లో జరిగే జాతీయ పోటీలకు శర్వాణి అర్హత సాధించిందన్నారు.

# వైభవంగా తిరు కల్యాణోత్సవం



స్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్థానిక కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీ పాండురంగ, సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారి తిరుకల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయం పదకొండో వార్షికోత్సవం పురస్కరించుకొని స్వామి సన్నిధిలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి తిరుమంజనం చేసి ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం పుణ్యహవచనం, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం తదితర కార్యక్రమాలను అర్చకులు వివరించారు. అనంతరం కన్యాదానం, మాంగల్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం వివిధ వాహనాలపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి పూజలు చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవను కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రముఖుడు గొల్లపూడి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు నిర్వహించారు.

# అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అప్పుల బాధ తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన అయోధ్యనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్యనగర్‌కు చెందిన రాజనాల జ్యోతి(41)కి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త రవికుమార్ 13 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా జ్యోతి అప్పటి నుంచి ఇంటి ముందు చిల్లరకొట్టు నడుపుతూ ఇద్దరు బిడ్డలను పోషించుకుంటోంది. అప్పులు ఎక్కువ కావడంతో ఆమె తరచూ బాధపడుతూ ఉండేది. శుక్రవారం ఉదయం షాపులో పెట్టిన కిరాణా డబ్బులు తగ్గడంతో తన కూతురు చరితశ్రీని పిలిచి డబ్బులు ఏమైనా తీశావా అని అడగ్గా ఆమె నేనేమి తీయలేదంటూ కాస్త గట్టిగా సమాధానం చెప్పింది. దీంతో ఒక్కసారిగా అసహనానికి గురైన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలోని బెంజిసర్కిల్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామచంద్రనగర్‌లోని ఆచార్య రంగా వీధిలో నివసిస్తున్న రాజపుత్ర రూప్‌సింగ్ శుక్రవారం ఉదయం బెంజిసర్కిల్‌లోని పెట్రోల్ బంకు వైపు నుంచి ట్రెండ్‌సెట్ మాల్ వైపు రోడ్డు దాడుతున్నాడు. ఆ సమయంలో బెంజిసర్కిల్ వైపు నుంచి పశువుల ఆసుపత్రి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం వృద్ధుడిని ఢీకొట్టింది. అతను కిందపడిపోవడంతో తలకు, ఎడమ కాలికి బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. ప్రయాణికులు 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కృష్ణలంక ఎస్ఐ ప్రకాశరావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఘనంగా సహస్ర చండీయాగం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో నిర్వహిస్తున్న సహస్ర చండీయాగానికి శుక్రవారం భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం విశేష చండీయాగం, సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి కరుణదాసు ఆధ్వర్యాన యాగశాలలో 80 మంది రుత్వికులు యాగాన్ని నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులకు అన్న ప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కోశాధికారి జ్ఞానేశ్వర్, వైవీ నాగేందర్, చంద్రకళ, శివ, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రేపు కన్యకాపరమేశ్వరి జయంతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 30న శ్రీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు మందిరం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం మందిరంలోని వాసవీ మాతకు గోక్షీరాభిషేకం, విశేష అలంకారం, సామూహిక కుంకుమార్చనలు, మహానైవేద్యం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

### ఆదిదంపతులకు శాంతి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆదిదంపతులకు శుక్రవారం శాంతి కల్యాణం జరిగింది. ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను శ పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన , చండీ హోమం, శాంతి కళ్యాణంలో ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన అనంతరం భక్తుల రద్దీ మరింత పెరిగింది. సాయంత్రం అమ్మవారి పంచ హారతుల సేవలోనూ ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజా ఆస్తులకు నష్టం కలిగిస్తే చర్యలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్లపై రాళ్లు రువ్వడం ప్రజా ఆస్తులకు నష్టం చేకూర్చడమే కాకుండా, రైళ్ల సమయపాలనలో అంతరాయం, ప్రయాణికులకు గాయాలు వంటి విషమ పరిస్థితులకు దారి తీస్తాయని, అటువంటి ఘటనలకు పాల్పడితే రైల్వే చట్టం ప్రకారం శిక్షార్హులని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టీసీఎస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు లెవల్ క్రాసింగ్‌ల వద్ద రైళ్లపై రాళ్లు రువ్వడం నియంత్రణపై ఆర్‌పీఎఫ్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇటువంటి ఘటనలు జరిగిన సందర్భాల్లో 139కి సమాచారం అందించి నష్టాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

### గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సితార సెంటర్ నుంచి గొల్లపూడి వెళ్లే బైపాస్ రోడ్డులోని మోడరన్ మ్యాక్స్ టీ స్టాల్ సమీపంలోని బస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. మృతుని వయసు 35 నుంచి 40 మధ్య ఉంటుంది. ఒంటిపై పసుపు, బ్లూ రెండ్ రంగులున్న గళ్ల షర్ట్, నేవీ బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. రెండు చెవుల నుంచి రక్తం కారి ఉంది. కుడి మోకాలు ముందు వెనుక భాగంలో గాయాలు ఉన్నాయి. మృతుని పేరు, అడ్రస్ తెలియలేదు. సచివాలయ మహిళా పోలీసు రాజ్యలక్ష్మి ఫిర్యాదుతో గుర్తు తెలియని వ్యక్తి అనుమాన స్పద మృతిగా కేసు నమోదు చేశారు.

### కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వించిపేట నైజాంగేటు ప్రాంతానికి 20 రోజుల క్రితం అనిసా అంజుమ్, బాష అనే దంపతులు అద్దెకు వచ్చారు. కొద్ది రోజుల క్రితం బాషా ఉద్యోగ రీత్యా వైజాగ్ వెళ్లాడు. అంజుమ్ తన తల్లి వద్దకు వెళ్లింది. 27వ తేదీ సాయంత్రం అంజుమ్‌ను తీసుకుని తల్లి నసీమా నైజాంగేటుకు వచ్చింది. ఆ సమయంలో అంజుమ్ అత్త హసీనాతో గొడవ జరిగింది. తర్వాత అంజుమ్ బయటకు వెళ్లి రాలేదు. కూతురు కనిపించడం లేదంటూ నసీమా ఫిర్యాదు చేసింది.

# దివ్యాంగులపై వివక్ష చూపితే చర్యలు

**కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులపై వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఢిల్లీరావు హెచ్చరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ తొలి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ చట్టం ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులను అమలు చేయడంతోపాటు, వారి సంక్షేమానికి సమన్వయ కమిటీ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా విభిన్న ప్రతిభావంతుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చట్టంలోని సెక్షన్ 25ను పారదర్శకంగా అమలు చేయడానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండు ప్రత్యేక పడకలను వారికి కేటాయించాలన్న నిబంధనలను అమలుచేయడానికి వైద్య అధికారులను ఆదేశిస్తామన్నారు. దివ్యాంగులు విద్యను అభ్యసించేలా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నోడల్ అధికారిని నియమించి వారు కోరుకున్న పాఠశాలలో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులతో కళాత్మక ప్రతిభ సాంస్కృతిక వికాసాన్ని పెంచేందుకు అకాడమీ ద్వారా శిక్షణ అందించాలన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక కోచ్‌లను నియమించి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సదరం రిజిస్ట్రేషన్ ప్రకియలో మార్పులు చేసేలా కమిటీ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రామ్ కుమార్, ఎల్‌డీఎం కోటేశ్వరావు, చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కృష్ణ కుమారి, ఏసీపీ కె. వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ ఎస్ ఎస్ విశాలాక్షి, డీఆర్డీఏ డీపీఎం జె. శోభన్ బాబు, విభిన్న ప్రతిభావంతుల ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు రవీంద్ర బాబు, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామి, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక, కళారంగాల అభివృద్ధికి కృషి



పాటిబండ్ల జానకిని సత్కరిస్తున్న మల్లాది విష్ణు, అన్నవరపు రామస్వామి, గోవిందరాజన్

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళారంగాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో శుక్రవారం 63వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ఈ కాలేజీలో సంగీతం నేర్చుకున్నవారు నేడు సంగీత రంగంలో ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ మాట్లాడుతూ 63 సంవత్సరాల క్రితం నగరంలో సంగీత కళాశాలను ప్రారంభించారని తెలిపారు. వేలాదిమంది ఇక్కడ సంగీతంతోపాటు నాట్యంలో శిక్షణ తీసుకొని జీవితంలో స్థిరపడ్డారని గుర్తుచేశారు.

సంగీత విద్వాంసురాలు పాటిబండ్ల జానకిని సెంట్రల్ ఎమ్మెల్యే ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయిగుంట మల్లీశ్వరి, వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సంగీత కళాశాల పూర్వ అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలను నగదు బహుమతులు అందజేశారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

కూచిపూడి నాట్యాచార్యులు సీహెచ్ అజయ్‌కుమార్, భాగవతుల సౌమ్య బృందం కూచిపూడి అంశాలను ప్రదర్శించారు. వీణ అధ్యాపకులు గోవిందరాజన్ బృందం, వయోలిన్ అధ్యాపకురాలు విష్ణుభొట్ల కృష్ణ వేణి బృందం వయోలిన్‌పై కీర్తనలను పలికించారు. గాత్ర విభాగం అధ్యాపకులు, లక్ష్మీ నరసమ్మ, మల్లాది కార్తిక త్రివేణి, శోభా లక్ష్మి, చంద్రపన్ బృందం సంప్రదాయ కీర్తనలు పలికించారు. ఫల్గుణ్ స్టీవెన్ రాజు, అనిల్‌కుమార్ బృందాలు మృదంగం, తబలాపై కీర్తనలు పలికించారు.

# మధురంగా త్యాగరాజ కీర్తనలు



త్యాగరాజ స్వామి కృతులను గానం చేస్తున్న పద్మావతి, శ్రీనిధి, సింధు

విజయవాడ కల్చరల్: త్యాగరాజస్వామి జయంతి సందర్భంగా శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యాన దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో జరుగుతున్న కర్ణాటక సంగీత కార్యక్రమాలు సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సంగీత ఉత్సవంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన విద్వాంసులు, యువ సంగీత కళాకారులు త్యాగరాజ కీర్తనలను మధురంగా గానం చేశారు. వంజరి కృష్ణ, పద్మావతి, శ్రీనిధి, సింధు తదితరులు గానం చేశారు. వీణపై చిట్టా కార్తీక్ త్యాగరాజ కృతులు పలికించారు.

- ఈ నెల 30వ తేదీ ఆదివారం త్యాగరాజ స్వామి కృతుల గోష్ఠిగానం నిర్వహిస్తున్నట్లు శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్ తెలిపారు.

# కండ్రికలో డీఎం అండ్ హెచ్‌ఓ పర్యటన



బాలింతలకు అందిస్తున్న సేవలు తెలుసుకుంటున్న డీఎం అండ్ హెచ్‌ఓ సుహాసిని

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ మెడికల్, హెల్త్ ఆఫీసర్(డీఎంఅండ్ హెచ్‌ఓ) ఎం.సుహాసిని 64వ డివిజన్‌లోని కండ్రిక, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. తొలుత కండ్రికలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆమె అక్కడ ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పటల్ వైద్య బృందంతో మాట్లాడి ఎలాంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఎన్ఎస్సీ బోస్ నగర్‌లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. చిన్నారులకు ఇస్తున్న ఆహారం, వారి గ్రోత్ చార్ట్‌లను పరిశీలించారు. డ్రెయిన్లలో మురుగు పారుదల, లార్వాను స్వయంగా పరిశీలించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కండ్రిక ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్‌ఎంలు, మలేరియా, శానిటరీ విభాగ అధికారులు పాల్గొన్నారు.

# నగరంలోని 20 కూడళ్లలో చలివేంద్రాలు

**ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి**



మజ్జిగ పంపిణీలో గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని అందులో భాగంగా నగరంలోని 20 కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు మందిర గౌరవాధ్యక్షులు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. 30వ డివిజన్ దేవీనగర్ ఆచంట వెంకట రత్నంనాయుడు సర్కిల్, రామకృష్ణాపురం బుడమేరు వంతెన సెంటర్‌లో శుక్రవారం బాబా మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సహకారంతో చలివేంద్రాలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి చలివేంద్రాలను ప్రారంభించారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

- 31వ డివిజన్ ముత్యాలంపాడులో శుక్రవారం పెనుమత్స సత్యం ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన జొన్నలగడ్డ పద్మావతి సహకారంతో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు సత్యం, నేతలు పాల్గొన్నారు.

# తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్


క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాదరాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

## ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

### యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ

దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120

డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా

యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు

రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

### స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.

– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్‌ఎం, వాల్తేరు

# భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- తన జల్సాలను ప్రశ్నిస్తున్నాడని భర్తను హత్య చేసిన జమలమ్మ
- ఎన్టీఆర్ జిల్లాలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్ : తన జల్సాలకు అడ్డుపడుతున్న భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మీ శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 నవంబర్ 23న కొత్తపేట (టూ టౌన్) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన అప్పట్లో నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జమలమ్మకు జి.కొండూరు మండలం వెంకటాపురానికి చెందిన ఏడుకొండలు(32)కు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లకు జమలమ్మ చెడు వ్యసనాలకు బానిసైంది. వీటిపై ప్రశ్నిస్తున్న భర్త ఏడుకొండలును అడ్డు తొలగించుకోవాలనే నిర్ణయాన్ని తన చెల్లెలు లక్ష్మికి వివరించింది. అదే గ్రామంలో హత్య చేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కాపురాన్ని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.నైనవరం గ్రామానికి మార్చింది. అంబాపురంలో కొత్త ఇంట్లోకి ప్రవేశించిన రోజునే చెల్లెలు లక్ష్మి, న్యూఆర్‌ఆర్ పేటకు చెందిన ఒడియార్ గణేష్, జక్కంపూడికి చెందిన బాలసాని తిరుపతి సాయంతో జమలమ్మ తన భర్త ఏడుకొండలు మెడకు తాడు చుట్టి చంపేసిందని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి వస్తున్న దుర్వాసను పసిగట్టిన ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జమలమ్మకు కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు.

# చైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన వాణి

పెనమలూరు : శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి(17) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతోంది. గత రెండు రోజుల కిందట ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది. కాగా గురువారం వాణి సోదరుడు రాము కాలేజీ హాస్టల్‌కు వచ్చి వాణితో మాట్లాడి వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో స్టడీ అవర్‌కు రావాల్సిన వాణి రాలేదు. దీంతో ఆమె కోసం రూమ్‌కు వెళ్లి మిత్రులు చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

# రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమంలో పాల్గొనం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమాల్లో పాల్గొనబోమని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై పోరాటం చేసే విధంగా కొన్ని శక్తులు సచివాలయ ఉద్యోగులను రెచ్చ గొడుతున్నాయని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు వారి మాటలకు ప్రభావితం కావొద్దని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు సిరిపురం హరి, కె.రామకృష్ణా రెడ్డి, జి.హరీంద్ర, కె.కిరణ్, బి.పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరు కుట్ర చేస్తున్నారని, ఇలా కుట్ర పన్నిన వారెవ్వరూ తమకు ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. తమను ఉద్యోగులుగా గుర్తించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న సచివాలయ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రను ఖండిస్తున్నట్లు తెలిపారు.

# ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష , కార్యదర్శులుగా కె.వైధురిదేవి, ఎ.సుస్మిత


ఎన్నికైన సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షురాలిగా కె.వైధురి దేవి, ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మణ కుమారి, కార్యదర్శిగా ఎ.సుస్మిత, అదనపు కార్యదర్శి(జనరల్)గా ఎం.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి (కల్చరల్)గా ఎస్.నాగ లలితాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా టి.శారద ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.విజయలక్ష్మి, డి.సాహిత్య వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల వివరాలను ఎన్నికల అధికారి ఎస్.శాంతి కుమారి శుక్రవారం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజన ఉద్యోగుల హక్కుల రక్షణకు చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఎస్టీ ఉద్యోగుల సర్వీసు సమస్యలపై గురు, శుక్రవారాల్లో విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ విచారణ నిర్వహించింది. ఈ విచారణకు అధ్యక్షత వహించిన రవిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఏడు శాఖలకు చెందిన అధికారులను పిలిచి విచారించినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా సూచనలు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రజల నివాస, వ్యవసాయ భూముల సమస్యలపై కూడా విచారణ చేసి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, డిప్యూటీ డైరెక్టర్ పొట్లూరి పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

# పంట ఉత్పత్తుల విలువ పెంపుతో గిరి రైతు మనుగడ

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగన్నాథరావు
- కనుల పండువగా విత్తనాల పండగ

డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో పంటల ఉత్పత్తుల విలువ హెచ్చింపుతోనే గిరిజన రైతులకు మనుగడ ఉంటుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు అన్నారు. డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గ్రామంలో సంజీవని సంస్థ, థింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా శుక్రవారం జీవ వైవిధ్య జాతరలో భాగంగా విత్తనాల పండగను ఘనంగా నిర్వహించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో పాటు ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పాత విత్తనాల ద్వారా గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న అన్ని పంటల్లోనూ పోషక విలువలు అధికంగా ఉన్నాయన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ సంఘాల ఆందోళనలకు దూరంగా ఉందాం

- గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు
- ఒకే విడతన 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులకు, ప్రభుత్వం మధ్య సుహృద్భావ వాతావరణం ఉంది
- కొన్ని సంఘాలు స్వార్థం కోసం దానిని చెడగొట్టడానికి చూస్తున్నాయి
- సచివాలయాల ఉద్యోగులందరూ గమనించాలి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

సాక్షి, అమరావతి : స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనలకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకే విడతలో లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపింది. అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని ఉద్యోగ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనవద్దని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, కొన్ని ఉద్యోగ సంఘాలు స్వార్థ, రాజకీయ అవసరాలకు ఆ వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులందరూ దీనిని గమనించాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసి, ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేసి అందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగులందరూ ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా 010 పద్దు కింద జీతాలు ఇచ్చారని, డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో నెగెటివ్ మార్కులు తొలగించారని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, శానిటేషన్ సెక్రటరీలకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయంటే సీఎం జగన్‌కు మనపై ఉన్న ప్రేమాభిమానాలే కారణమని చెప్పారు.

**బదిలీలపై గందరగోళం సృష్టిస్తున్నారు**

సచివాలయాల ఉద్యోగులు చాలా మంది వివిధ కారణాలతో బదిలీలు కోరుకుంటున్నారని తెలిసిన వెంటనే సీఎం జగన్ అంగీకారం తెలిపారన్నారు. సచివాలయాల మహిళా ఉద్యోగులు పెళ్లి చేసుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు రిక్వెస్టు బదిలీలు కాదని, సాధారణ బదిలీలు జరపాలని వితండ వాదం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ కావాలని కోరుకున్నా ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని వాళ్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయాల ఉద్యోగులందరినీ బదిలీ చేయమని చెప్పడానికి వీళ్లెవరని నిలదీశారు. బదిలీ వద్దనుకొనే ఉద్యోగిని కూడా బలవంతంగా బదిలీ చేయమనడానికి వీళ్లకేం హక్కుందన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకే సాధారణ బదిలీ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు మాత్రం మూడేళ్లకే సాధారణ బదిలీలు చేయమని ఉద్యోగ సంఘం నాయకులు ఎలా అడుగుతారని అన్నారు. గందరగోళం సృష్టించి బదిలీ ప్రక్రియను అడ్డుకోవడానికి కొందరు జేఏసీల పేరుతో ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని తప్పుపట్టారు. దీనిని అందరూ గమనించాలని కోరారు. సచివాలయాల ఉద్యోగులు ఆ ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు.

# ఏయూలో ఉద్యోగ విప్లవం

- ఒకే వేదికపై 761 మందికి ఆఫర్ లెటర్స్
- తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ పత్రాలు


తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అమ్మానాన్నల పాదాలకు విద్యార్థులు నమస్కరించారు. తమ అభ్యున్నతికి అహరహం శ్రమించిన తల్లిదండ్రులను విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులే సత్కరించారు. ఈ అరుదైన సంఘటన గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయం (ఏయూ)లో కనిపించింది. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ కళాశాల అచీవర్స్ డే దీనికి వేదికైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగ విప్లవానికి వేదికగా నిలిచింది. ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏయూ రాష్ట్రానికి ఆదర్శంగా, విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలుస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రత్నాల్లాంటి పిల్లలను పెంచి విశ్వవిద్యాలయానికి పంపిన తల్లిదండ్రులందరినీ సన్మానించడం చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన, ఉపాధి కల్పన చేసే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఇచ్చే నిజమైన సంపద విద్య అని ముఖ్యమంత్రి ఇదే వేదిక నుంచి అన్నారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో మీ పిల్లలను పెంచినందుకు మీ అందరికీ వందనం అంటూ తల్లిదండ్రులకు నమస్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది 81 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఈ సంవత్సరం దీన్ని అధిగమించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

# వేదాలు విజ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- ఇద్దరికి మహా మహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు
- 539 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్: వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి, సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన ఆర్. మణి ద్రావిడ శాస్త్రికి మహా మహోపాధ్యాయ పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన కె.రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన సి.వంశీకృష్ణ ఘనాపాఠికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. సర్టిఫికెట్ కోర్సుల నుంచి పీహెచ్‌డీ వరకు వేద విద్యనభ్యసించిన 539 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వేలాది సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గణిత, వైజ్ఞానిక, ఆర్థిక, సాంకేతిక, జ్యోతిష్య శాస్త్రాలను వేదాల్లోని వైదిక అంశాలతో మేళవించి ప్రపంచానికి తెలియజేశారన్నారు. భారతీయ సంప్రదాయం, ఆధునిక శాస్త్ర సాంకేతికత మధ్య సమన్వయం పెంపొందించుకోగలిగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యాం, ఈసీ సభ్యులు హరే కృష్ణ శతపతి, ఫణి యాజులు తదితరులు పాల్గొన్నారు.

**కడప దర్గాను దర్శించుకోవడం నా అదృష్టం**

కడప కల్చరల్/రాజంపేట/ఒంటిమిట్ట: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకోవడం తన అదృష్టమని, ఇది దైవం కల్పించిన మహాభాగ్యంగా భావిస్తున్నానని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కడప పెద్ద దర్గాకు వచ్చారు. దర్గాలో గవర్నర్ పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గవర్నర్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు ఉన్నారు.

**ఒంటిమిట్ట రాములోరిని దర్శించుకున్న గవర్నర్**

ఒంటిమిట్టలోని కోదండరాముడిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని ఒంటిమిట్ట నుంచి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

# ఐఐటీలకు దీటుగా ఉద్యాన వర్సిటీ

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అకడమిక్ బ్లాక్, హాస్టళ్లను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు: ఐఐటీలు, ఎన్‌ఐటీలకు దీటుగా ఉద్యాన, వ్యవసాయ వర్సిటీలను తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో రూ.22.81 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, రెండు గర్ల్స్ హాస్టళ్లు, ఒక బాయ్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఉత్పత్తుల ఎగ్జిబిషన్ భవనాలను శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. వనిపెంటలోని కేవీకే అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ఉద్యాన వర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిధిలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతరాజుపేట కళాశాలలో రైతుల వసతిగృహం, అతిథిగృహం ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. వైఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరాం మాట్లాడారు. అనంతరం పుట్టగొడుగుల సాగుపుస్తకం, కరపత్రాలు, అంబాజీపేట పరిశోధనా స్థానం రూపొందించిన కొబ్బరి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

# ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు

- ఈ ఏడాది నుంచి రీస్ట్రక్చర్.. సిలబస్ రీడిజైన్
- ఈ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు
- ఫ్యాప్సీ అవార్డుల సన్నాహక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన


మాట్లాడుతున్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రీస్ట్రక్చర్‌తో పాటు సిలబస్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్సలెన్స్ అవార్డ్స్–2023 సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆటోమొబైల్ రంగాల్లో వీరు తమ నైపుణ్యంతో రాణించేలా తయారు చేస్తామని చెప్పారు. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీఐల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 192 స్కిల్ హబ్‌ల్లో మెరికలు తిరిగే కోర్సులను డిజైన్ చేశామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కొత్త పారిశ్రామిక పాలసీలో కొన్ని మార్పులు చేయాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇండస్ట్రియల్ హోదా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కీలకపాత్ర ఉందన్నారు. ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి కరుణేంద్ర మాట్లాడుతూ ఫ్యాప్సీ ఎక్స్‌లెన్స్–2023 అవార్డుల కోసం జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11 కేటగిరీల్లో ఈ అవార్డులుంటాయని, ఈ అవార్డులు ఇవ్వడానికి 11 మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ అవార్డులను ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రదానం చేస్తామని చెప్పారు.అనంతరం అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుతరావు, ఎఫ్‌టీసీసీఐ సీఈవో ఖ్యాతి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ గేమ్‌లో రూ.2 లక్షల నష్టం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫీజుల పేరుతో పెదనాన్న, బాబాయిల దగ్గర్నుంచి నగదు వసూలు
- ఆన్‌లైన్‌లో లుడో ఆడి డబ్బులు పోగొట్టుకున్న వైనం
- ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు

బాపట్లటౌన్ : ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి బీటెక్ విద్యార్థి రూ.2 లక్షలు నష్టపోయి చివరకు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కర్లపాలెం మండలం చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి వెంకటనారాయణ విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆన్‌లైన్‌లో లుడో గేమ్ తన స్నేహితులతో కలిసి ఆడాడు. ఈ గేమ్‌లో తొలుత రూ.100 పెట్టుబడికి రూ.1000 వరకు వచ్చాయి. ఇదే మోజులో సాయంత్రం వరకూ ఆడుతూనే ఉన్నాడు. ఇంతలో పాకెట్‌మనీ నిమిత్తం చేతిలో ఉంచుకున్న రూ.30 వేలు పోయాయి. తర్వాత తన స్నేహితుడి వద్ద రూ.70 వేలు, తన పెదనాన్న, బాబాయిలకు ఫోన్ చేసి కళాశాలలో ఫీజు చెల్లించాలంటూ నమ్మబలికి మరో రూ.లక్ష వరకూ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో విడతల వారీగా రూ.2 లక్షలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి రైలు మార్గాన బాపట్ల చేరుకున్నాడు. అప్పటికే ఎలుకల పేస్ట్ తిన్నాడు. రైల్వేస్టేషన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్ సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.